సాహిత్య

# ప్రస్థానం

నవంబరు - 2007

వెల: రు.10



# విశ్వ సాహిత్యంలో మహిళా కేతనం





మధ్యప్రదేశ్ కు చెందిన గిరిజన కళాకారిణి

రాంబాయ్ చిత్రం

సాహిత్య ప్రస్థానం
సంపుటి : 5 నవంబర్, 2007 సంచిక : 24

# కర్తవ్యం సశేషం...

**భూ**పోరాట ప్రభంజనానికి సంఘీభావంగా భూస్వరాలు వెలువరించడం, వివిధ చోట్ల ఆవిష్కరించడం ఈ కాలంలో చాలా సంతృప్తి కలిగించిన సందర్భం. మన సాహిత్యకారుల సామాజిక స్పృహను చాటి చెప్పే తాజా ఉదాహరణలు ఇలాటి సంకలనాలు.

ఇదే గాక వివిధ జిల్లాలలో క్రమేణా సాహితీ స్రవంతి నెలవారీ కార్యక్రమాలు పెరుగుతున్నాయి. సాహితీ మిత్రుల భాగస్వామ్యం, ప్రస్థానంకు రచనలు పంపడం పెరుగుతున్నది. ఇవన్నీ సంతోషించే విషయాలు.

H H H

**అ**యితే సశేష కర్తవ్యాలు ఇంకా ఎక్కువగా వున్నాయి. అందులో అతి ముఖ్యమైంది సాహిత్య ప్రస్థానంను మూల మూలలా సాహితీ మిత్రుల్లోకి తీసుకు వెళ్లడం. వ్యక్తిగతంగా అనేక మంది మిత్రులు చందాలు పంపుతున్నారు. కాని తెలుగు సాహిత్య సేన పరిమాణంతో పోలిస్తే చేరవలసిన సీమలు ఇంకా చాలా చాలా వుండి పోతున్నాయి. ముఖ్యంగా పత్రికకు రచనలు పంపించే రచయితలు, పాఠకులు వారి వారి మిత్రులనూ, సాహిత్యాసక్తి వున్న మిత్రులనూ చందాదారులుగా చేర్పించేందుకు సహకరించాలని మనవి చేస్తున్నాం. అది వారి బాధ్యత కూడా.

H H H

**ఈ** సంచికలో విషయపరంగానూ, విశ్లేషణల పరంగానూ అనేక విభిన్న అంశాలున్నాయి. ఇదే రీతిలో రానున్న రోజులలో మరింత వైవిధ్య భరితంగా, విషయ సంపన్నంగా తీసుకురావడానికి ప్రయత్నిస్తామని హామీనిస్తున్నాం.వీటిపై మీ స్పందనలు కావాలి. సమీక్షా పర్వం ప్రస్తుతానికి నిలిపివేసి నచ్చిన రచన శీర్షికను మాత్రమే కొనసాగిస్తున్నాం. నూతన సంవత్సరం నాటికి మరిన్ని ఆకర్షణలు అదనపు హంగులు జతపర్చగలం. అయిదేళ్లు జయప్రదంగా పూర్తి చేసుకునే ఈ విశాల సాహిత్య వేదికను అన్ని విధాల విజయవంతం చేయడానికి ప్రతి వారూ చేయూతనివ్వాలని కోరుతున్నాం.

H H H

**ఈ** కాలంలో ఇద్దరు రచయిత్రులు ప్రతిష్టాత్మకమైన ప్రపంచ సాహిత్య పురస్కారాలు అందుకున్నారు. వారికి అభినందనలు.

H H H

**బు**డిగ సుబ్బరాయన్, పి.యశోదా రెడ్డి, ఉత్పల సత్యనారాయణ తదితర సాహిత్య కారులు ఈ కాలంలో మనకు దూరమైనారు. వారికి సాహిత్య ప్రస్థానం నివాళులర్పిస్తున్నది.

ముఖచిత్రం & లోపలి చిత్రాలు : శ్రీరామ్ కారంకి, ప్రభాకర్

## ఈ సంచికలో...


| | |
|---|---|
| చీడ (కథ) | 2 |
| నాగావళి పల్లె కథ | 8 |
| అందని చందమామ (దీర్ఘ కవిత) | 11 |
| బీభత్సం (కథ) | 12 |
| డోరిస్ లెస్సింగ్‌కు నోబుల్ బహుమతి | 16 |
| నా రైలు ప్రయాణం (కథ) | 18 |
| గుండె తడినీ, కంటి చెమ్మనీ దాచుకోలేని కథకుడు | 22 |
| కవితలు | 24 |
| మనమూ, మన "ఆట"గాళ్ళూ | 25 |
| శ్రీశ్రీ తాత్వికాలోచనలు : ఒక పరిశీలన | 26 |
| ఈ దశాబ్ద కాలంలో కొన్ని మంచి పుస్తకాలు | 30 |
| తెలుగు నవలలో మహిళ | 35 |
| నానీల దశమ వార్షికోత్సవం నానీల శతాధిక గ్రంథోత్సవం (నివేదిక) | 41 |
| డైరీ | 45 |


సంపాదకవర్గం
తెలకపల్లి రవి (సంపాదకుడు)
కె.ఆనందాచారి
ఎ.సత్యభాస్కర్
వీరప్రసాద్
ఎం.నరహరి
కె. లక్ష్మయ్య, మేనేజర్

చిరునామా
సాహిత్య ప్రస్థానం
1-1-187/1/2,
వివేక్‌నగర్, చిక్కడపల్లి,
హైదరాబాద్-500 020
ఫోన్లు : 27660013, 27635136

# చీడ



**కెప్టెన్ నీరమ్ వారం రోజుల తరువాత ఇంటికి తిరిగొచ్చాడు. బాగా పొద్దు పోయింది. అతని భార్య కేలమ్ తలుపు తీసింది. ఇంటి వాతావరణంలో ఏదో మార్పు వచ్చిదనిపించింది.**

**మూలం : ఎస్.ఆర్. హర్‌నోట్**

**అనువాదం : ఆర్. శాంతసుందరి**

కేలమ్ ఎప్పటిలా అతన్ని నవ్వు మొహంతో పలకరించలేదు. స్వగ్రామానికి వెళ్లినప్పుడు అక్కడ అతను విన్నవీ కన్నవీ అతన్ని ఎంతో నిరాశా నిస్పృహలకి గురిచేశాయి. ఇంటికొచ్చి భార్య మొహంలోని వైరాగ్యం అలసటా చూసి అతను మరింత కలత చెందాడు.

నీరమ్, కొడుకు పారబ్ గదిలోకి వెళ్లాడు. కొడుకు నిద్రపోతున్నాడని అనుకున్నాడు. కాని తండ్రి అడుగుల చప్పుడు విని ఉలిక్కిపడి లేచాడు. ఎన్నో నెలలుగా తండ్రికి దూరంగా ఉన్నవాడిలా పరిగెత్తుకుని వచ్చి తండ్రిని వాటేసుకున్నాడు.

అర్ధరాత్రి దాటి ఉంటుంది. వాళ్ల ఇల్లు ఉన్నట్టుండి కంపించింది. తలుపులూ కిటికీలూ కొట్టుకోసాగాయి. ఒక కిటికీ అద్దం కిందపడి గదంతా గాజు పెంకులు పరుచుకున్నాయి. అక్కడక్కడా మట్టిపెళ్లలు రాలుతున్న చప్పుడు వినిపించసాగింది. ఇంట్లో సామాను పెట్టిన చోటు నుంచి జరిగిపోయింది. నీరమ్ గాభరాపడుతూ లేచి కూర్చున్నాడు. కానీ ఏం జరుగుతుందో అతనికి అర్థం కాలేదు. కేలమ్ పరిస్థితి ఇంకా అధ్వాన్నంగా ఉంది. ఆమె భయంతో వణికిపోతూ పక్కమీద ముడుచుకుపోయింది. పారబ్ దుప్పట్లో దూరిపోయాడు.

"ఏదో భూకంపంలాగుంది, కేలీ!" అన్నాడు నీరమ్.

"భూకంపం కాదు నీర్, ఇంకేదో!" అంది కేలమ్. అతికష్టం మీద ఆమె తన భావాలని అదుపులో పెట్టుకోవటానికి ప్రయత్నించసాగింది. వారం రోజులుగా మనసులో గూడు కట్టుకున్న భయాలన్ని ఒక్కొక్కటిగా బైటపడసాగాయి.

"నువ్వు వెళ్ళినప్పటినుంచీ మాకు కంటిమీద కునుకులేదంటే నమ్ము! ప్రతిరాత్రి ఇలాగే చప్పుళ్ళు, ఇల్లంతా ఊగిపోవటం... నేలలోపల బ్లాస్ట్ అవుతున్నట్టు తలుపులూ కిటికీలూ కంపించటం – ఈ వారం రోజులూ బిక్కుబిక్కుమంటూ ఎలా గడిపామో నువ్వు ఊహించలేవు! కానీ ఇవాళ ఇల్లు కంపించినట్టుగా ఇంతకు ముందు జరగలేదు" అంది కేలమ్!

"నువ్వీ సంగతి ఎవరికీ చెప్పలేదా?"

"ఎవరికి చెబుతాను? మన ఇల్లు విసిరేసినట్టు మిగతా ఇళ్లకి దూరంగా ఉంది కదా! మా స్కూల్లో చెప్పటానికి ధైర్యం చాలలేదు. అయినా ఏమని చెప్తాను – నాకే ఏదీ సరిగ్గా తెలీదు కదా?"

చుట్టుపక్కల ఇరుగూ పొరుగూ లేరని కేలమ్ అనగానే, ఏదో అపరాధం చేసినవాడిలా బాధపడ్డాడు. ఈ కొండమీద ఇల్లు కట్టుకోవడం ఎంతపొరపాటుపనో, ఇప్పుడు తెలిసొచ్చింది. ఊళ్లో ఇల్లు కట్టుకుంటే ఇక్కడ ఉన్నంత ప్రశాంతంగా ఉండదని అనుకున్నాడు. పక్కన ఇళ్లేమన్నాఉంటే, వాళ్లింట్లో కూడా ఈ కంపనలూ, అద్దాలు పగలటం లాంటివి జరిగాయా అని అడిగి ఉండేవాడు.

నీరమ్ బాల్కనీలోకి వెళ్ళి నిలబడ్డాడు. మనసులో బోలెడన్ని ప్రశ్నలు! రాత్రి రెండయింది, అయినా నిద్రరావటం లేదు. రైలింగ్ మీదకి వంగి నిలబడ్డాడు. కింద ఊరంతా దీపాలతో వెలిగిపోతుంది. వేలకొద్దీ మిణుగురు పురుగులు ఒక చోట వాలినట్టుంది. చీకట్లో ఆ అద్భుతమైన వెలుతురు, త్రికోణాకారంలో ఉన్న ఇళ్ల కప్పుల మీద నుంచి జారుతూ, దట్టమైన దేవదారు చెట్ల కొమ్మలమీద పరుచుకుంది.

ఆర్మీనించి పదవీవిరమణ చేశాక, కెప్టెన్ నీరమ్‌కి ఇల్లు కట్టుకోవటానికి ఈ స్థలం అతి కష్టం మీద దొరికింది. ఈ ఊరంటే అతనికి చిన్నప్పట్నించీ చాలా ఇష్టం. ఇక్కడే చదువుకున్నాడు. కేలమ్ అతను చదివిన స్కూల్లోనే చదివింది. ఇప్పుడు స్కూల్ టీచర్‌గా పని చేస్తోంది. పారబ్‌కి ఎనిమిదేళ్లు. కొండమీదున్న వాళ్ల ఇంటిచుట్టూ రకరకాల చెట్లతో నిండి వున్న అడవులున్నాయి. ఇంటికి బాగా కింద,కొండవాలు ముగిసేచోట జాతీయ రహదారి ఉంది. పక్కనే ఆంజనేయస్వామి ఆలయం భజన సంఘాలు రాత్రిపొద్దుపోయేదాకా సినిమాపాటల వరసలకి అనుగుణంగా భక్తిగీతాలు చెవులు బద్దలయేటంత గట్టిగా పాడుతూ ఉంటాయి. పారబ్ "దిస్ ఈజ్ రబ్బిష్ డాడ్! కె. కాస్ట్ రీడ్.. దేవుడికి చెముడా? ఇంత గట్టిగా కేకలు పెట్టి అరవకపోతే వినలేడా!" అని విసుక్కుంటూ ఉంటాడు.



నీరమ్ కిందినించి మూడు లారీలు పైకి రావడం చూశాడు. అది ఆగగానే కొందరు వచ్చి వాటిలోని సామాను దింపారు. లారీలు వచ్చినదోవనే వెళ్లిపోయాయి. అక్కడ ఆంజనేయస్వామి ఆలయంలోకి వెళ్లే మెట్లు ఉన్నాయి. ఒక పెద్దలైటు వెలుగుతూ ఉంటుంది. ఆ వెలుతుర్లో జరిగినదంతా కనిపిస్తునే ఉంది. ఎంత ఆలోచించినా, లారీల్లోంచి దింపిన సామానేమిటో, ఎవరికోసం ఎవరు పంపారో అతనికి అంతుపట్టలేదు.

మళ్లీ సన్నగా భూమి కంపించింది. నేలకింద ఏదో పేలుడు జరిగినట్టు అనిపించింది. గబగబా కిందికి దిగి, బల్లపరుపుగా ఉన్న కొండరాయి మీద ఆగాడు నీరమ్. గబుక్కున కూర్చుని, కుడి చెవిని నేలకి ఆనించాడు. కొంతసేపు పేలుళ్ల చప్పుడు వినిపించింది. తరువాత మరో రకమైన ధ్వనులు రాసాగాయి. కొన్ని వేల ఎలుకలు కొండరాళ్లని కొరుకుతున్న చప్పుళ్లు! అతను ఊపిరి బిగపెట్టి వినసాగాడు. ఆ చప్పుడు ఏమిటో అని బుర్ర బద్దలుకొట్టుకున్నాడు. ఇంతలో ఇంకో రెండు లారీలు వచ్చి కొండపక్క ఆగాయి. ఆ లారీలలోకి ఏవో సామాన్లు ఎత్తుతున్నట్టు 'టన్ టన్' మని శబ్దాలు వినిపించి, ఆగిపోయాయి. లారీలు వేగంగా వెనక్కి వెళ్ళిపోయాయి.

నీరమ్ భార్యని పిలిచాడు. ఆమెను చెవి ఆనించి వినమన్నాడు. ఏమీ అర్థం కాకపోయినా, ఆమె అతను చెప్పినట్టే చేసింది. గరగరమన్న చప్పుళ్ల ఆమెకి కూడా వినిపించాయి – "నీర్, ఏమిటా చప్పుళ్లు?" అని అడిగింది.

"ఏమో, నాకూ అర్థం కావటం లేదు. కాని లోపల ఏదో జరుగుతోంది, కొండ లోపల ఎవరో బ్లాస్ట్ చేస్తున్నట్టున్నారు!"

"కొండలోపల పేలుళ్లా? అదెలా సాధ్యం? ఈ ప్రాంతాల్లో పేలుళ్లు నిషేధించబడ్డాయి కదా?" కేలమ్ ఆందోళన పడుతూ అంది.

'అవును – ఇదంతా గ్రీన్‌బెల్ట్ ఏరియా – అదీగాక రహదారికి సరిగ్గా పైన ఉంది. ఇక్కడ ఒక్కరాయి కూడా పీక కూడదని హైకోర్టు ఆర్డరిచ్చింది!"

"కింద ప్రాచీన దేవాలయం కూడా ఉంది కదా! ఊరి పెద్దలూ, రాజకీయ నాయకులూ కమిటీ మెంబర్లేకదా! మరి అలాంటప్పుడు ఈ కొండని తవ్వే ధైర్యం ఎవరికుంటుంది?"

"ఎందుకుండదు? దేవుడి పేరుమీద ఏం చేసినా చెల్లుతుంది, మతం పేర ఎవరేనా అధికారం చలాయించవచ్చు, అడిగే వారెవరు?"

కేలమ్ భయపడింది. భర్తను ఆనుకుని నిలబడి గద్గద కంఠంతో, "ఇక మన ఇల్లు మనకి దక్కదు, నీర్! ఎంత ముచ్చటపడి దీనిని కట్టుకున్నాం! నీ ఆర్మీ ఉద్యోగంలో మన జీవితం ఎప్పుడూ ఉరుకులు, పరుగులతో ఉండేది! ఇప్పుడిప్పుడే కాస్త కుదుటపడుతున్నామంటే, ఈ సమస్య ఒకటి వచ్చి పడింది," అంది.

చాలాసేపు తెగని ఆలోచనలతో అక్కడే నిలబడిపోయి, ఆ తరువాత ఇంట్లోకి నడిచారు. పారబ్ కళ్లు మూసుకుపోవటం చూసి, కేలమ్ వాణ్ణి పడుక్కో బెట్టి, తను కూడా పక్కనే పడుకుంది. కొద్ది నిమిషాల్లో ఇద్దరూ నిద్రపోయారు. నీరమ్ మట్టుకు కళ్లు తెరుచుకునే పడుక్కున్నాడు. అతని మనసులో వరసగా ఎన్నో ప్రశ్నలు... కానీ వాటికి జవాబులు మాత్రం దొరకటం లేదు! అవతల తన స్వగ్రామంలో జరుగుతున్న సంఘటనలు కూడా అతన్ని పట్టి పీడిస్తున్నాయి.

అక్కడ కూడా అతనికి ఇటువంటి అనుభవమే ఎదురైంది. ఆ ఊరు కూడా కొండమీదే ఉంది, పక్కనే నది. ఆ నదిమీద ఒక విదేశీ కంపెనీ విద్యుత్తు ప్రాజెక్టు ప్రారంభించింది. గ్రామం దిగువనే సొరంగం తవ్వి, నదీ ప్రవాహాన్ని మరోవైపు మళ్లించే పనులు జరుగుతున్నాయి. డైనమైటుని ఉపయోగించి కొండరాళ్లని పేలుస్తున్నారు. బ్లాస్ట్ అయినప్పుడల్లా గ్రామం మొత్తం కంపించిపోతుంది. జోరుగా ఎవరో ఊపుతున్నట్టు ఇళ్లన్నీ ఊగిపోతాయి. పశువులు భయంతో అరవటం విని అక్కడివారి గుండెలు అవిసిపోతున్నాయి. కొన్ని పశువులు చనిపోతున్నాయి. దూడలు ఆ చనిపోయిన ఆవుల పొదుగుల్నే కుడుస్తూ, అరుస్తున్నాయి. పేలుళ్ల వల్ల ఇళ్లు బీటలు వారాయి. వాకిళ్లు గుంటలు పడ్డాయి. పొలాలు నాశనమయాయి. నేల కుంగిపోతోంది. గ్రామప్రజలకు తాము యింకా ఎన్నాళ్లు ప్రాణాలతో ఉంటారో తెలియని పరిస్థితి! కాని వాళ్లు మాత్రం పాపం ఎక్కడికి పోతారు? ఇదంతా నీరమ్ ప్రత్యక్షంగా చూశాడు. తాతలనాటి తమ ఇల్లు కూడా ఒకవైపు కూలిపోయింది. నీళ్ల బావులు ఎండిపోయాయి. ఊళ్లో వాళ్లని అడిగితే, అక్కడి ఎమ్మెల్యే సమ్మతితోనే పనులు జరుగుతున్నట్లు తెలిసింది. అభివృద్ధి పేరిట జరుగుతున్న ఆపనిని ప్రభుత్వం సమర్థిస్తూండటం వలన, ఇంకెవరికి మొరపెట్టుకోవాలో తెలీటం లేదని జనం అన్నారు. ఈ ఊళ్లోనూ అతని పరిస్థితి అలాగే వుంది.

నీరమ్ పొద్దున్నే త్వరగా తయారయాడు. అతని మనసంతా చికాగ్గా ఉంది. బైటకొచ్చి నిలబడ్డ అతని దృష్టి బాల్కనీ గోడకి కొత్తగా

ఏర్పడిన బీట మీద పడింది. చాలా పెద్దదే! విపరీతమైన కోపమూ, భయమూ అతనికి కలిగాయి. ఇంతలో పేపరు కుర్రాడు ఆనాటి దిన పత్రిక యిచ్చి వెళ్లాడు. పేపర్లో ఏముందో చూడాలని కూడా అనిపించలేదు. కేలమ్ పేపర్ తీసుకుని, పతాక వార్తలను చూస్తునే ప్రాన్పడిపోయింది – 'కొండ గర్భంలో వైష్ణోదేవి ప్రత్యక్షం... స్వామి భగవాన్‌దాస్‌కి దేవి దర్శనం... దేవీ పీఠాన్ని చేరుకోవటానికి గుహని తొలిచే పని ప్రారంభం!

కేలమ్‌కి దేవుడిలో నమ్మకం ఉంది. ముందు అదంతా భక్తి శ్రద్ధలతో చదవటం మొదలుపెట్టి, చివరలో భక్తి గిక్తి మరిచిపోయి, భయంతో బిగుసుకుపోయింది. ఒళ్లంతా చెమట్లు పట్టాయి. దయ్యం కనిపించిన దానిలా పిచ్చిగా చూడసాగింది. ఆమె మొహాన్ని చూసి నీరమ్ కంగారు పడ్డాడు. ఆమె చేతిలోని పేపరు తీసి చదివాడు. ఆవార్తతో పాటు ఒక ఫోటో కూడా ఉంది. ప్రెస్‌మిట్‌లో మాట్లాడుతున్న ఒక సాధువుది. ఆ సాధువు మొహం ఎక్కడో చూసినట్లునిపించింది అతనికి.



ఇప్పుడు చిక్కుముళ్లుపడ్డ ఆలోచనలన్నీ ఒక కొలిక్కివచ్చాయి. ఆ భూకంపం ఏమిటో తెలిసింది. నిర్జీవంగా సోఫాలో వాలి కూర్చున్న కేలమ్, నీరసంగా, "ఆ సొరంగం, ఆలయం మన ఇంటి కింద దాకా వస్తాయి... మన పనయిపోయింది నీర్! మన ఇల్లు పూర్తిగా కూలిపోతుంది!'' అంది ఆమె గొంతులో అమితమైన బాధ స్పష్టంగా తెలుస్తోంది.

"భయపడకు కేవీ! మన ఇంటికి ఏమి కాదు, నేను లేనూ? వాళ్లపని పడతాను, చూస్తూ కూర్చుంటానా!" అన్నాడు నీరమ్. సమస్య అంత సులభంగా పరిష్కారం కాదని తెలిసినప్పటికీ, భార్యకి ధైర్యం చెప్పటానికి అతను పైపై గాంభీర్యం ప్రదర్శించాడు. కేలమ్ మనసు కాస్త కుదటపడింది.

నీరమ్ ముందుగా రాత్రి ట్రక్కులు ఆగిన చోటికెళ్లాడు. రోడ్డుపైనున్న కొండపాదం దగ్గర జనం కనిపించారు. కాషాయవస్త్రాలు వేసుకున్న సాధువులు చాలామంది ఏవో పనుల హడావిడిలో ఉన్నారు. పేపర్లోని వార్త చదివి చాలామంది జనం అక్కడ పోగయారు. కొందరు కొండపైకి ఎక్కుతున్నారు. వాళ్లలో కొందరు నినాదాలు చేస్తున్నారు. అతను కూడా ఆ గుంపులోకి వెళ్లి కలిశాడు. పైకి చేరుకుని చూసేసరికి, అతను దిగ్భ్రాంతి చెందాడు. దాదాపు యాభై అడుగుల నిడిని, పదడుగుల వెడల్పుగల సొరంగం ఉంది. దానిలో పొడుచుకొచ్చిన రాళ్లకి వైష్ణోదేవి పూజల్లో వాడే ఎర్రటి ఓణీలు కట్టి ఉన్నాయి. నేలమీద అంతటా పూలు... అక్కడక్కడా అగరొత్తులూ, ధూపాలు! ఆ సొరంగం ప్రవేశద్వారం దగ్గర మంత్రోచ్చారణ చేస్తూ పూజార్లు కనిపించారు. వాళ్ల గొంతులు లౌడ్‌స్పీకర్లలో చాలా దూరం వరకు వినిపిస్తున్నాయి. సొరంగంలోపల కొంతదూరం నడిచాక, ఒక బండరావి మీద ఎర్రని గుడ్డలో చుట్టిన హుండీ ఉంది. అక్కడున్న ఒక సాధువు ప్రసాదం పంచి పెడుతున్నాడు. ఇంకొంచెం లోనికివెళ్తే దేవీ పీఠం భూగర్భంలో వెలిసిన స్థలం కనిపిస్తుందని, దేవీ ఆశీర్వాదం పొందిన స్వామి భగవాన్‌దాస్ స్వయంగా ఆ పీఠాన్ని ప్రతిష్ఠిస్తారని అతను అందరికీ చెబుతున్నాడు.

నీరమ్ సొరంగంలోకి యింకొంత ముందుకెళ్లాడు – అక్కడ మందుగుండు వాసన చుట్టుముట్టేసరికి గట్టిగా తుమ్మాడు. లోన డైనమైట్లు పేల్చినట్టు రూఢి అయింది. సొరంగం లోపలికి పోవటానికి ఒకళ్లనొకళ్లు తోసుకుంటున్నారు. లోనికెళ్లిన ప్రతీవాడూ సాష్టాంగపడి, జేబులోంచి డబ్బుతీసి హుండీలో వేసేవాడే! ఎంతో ఆనందంతో, ఆ దేవి తనకే ప్రత్యక్షమైనంతగా ఉబ్బితబ్బిబ్బు అవుతూ బైటికొస్తున్నాడు. సొరంగం తవ్వకం ఆపిన చోట నోట్లకట్టల కుప్ప తయారైంది. ఇదంతా చూసి నీరమ్ నిర్ఘాంతపోయాడు. అతనికున్న కొద్దిపాటి భక్తి గాలికెగిరిపోయింది.

ఒక పొడుగాటి కారు వచ్చి సొరంగం ముందు ఆగింది. అందులోంచి నలుగురైదుగురు సాధువులు దిగారు. కొందరు శిష్యపరమాణువులు వారి వెనక చేరారు. అందరికన్నా ముందు నడుస్తున్న సాధువు పొడవుగా, బలిష్ఠంగా ఉన్నాడు. అతని వేషం వేరుగా ఉంది – పొడుగాటి జుట్టూ, బాగా నెరిసిన గడ్డం, నుదుటి మీద త్రిశూల ఆకారంలో బొట్టూ, చెవులకి బంగారు రింగులూ, మెడలో రుద్రాక్షమాలలూ, చేతివేళ్లకి రత్నాలు తాపడం చేసిన ఉంగరాలు!

నీరమ్ తన పక్కనే ఉన్న ఒక సాధువుని అతనెవరని అడిగాడు. అతనే స్వామి భగవాన్‌దాస్ అని అతను చెప్పాడు. నీరమ్ అప్రమత్తుడయాడు. స్వామీజీ తన దగ్గరకు రాగానే, నీరమ్ అతని దారికి అడ్డంగా నిలబడ్డాడు. హఠాత్తుగా ఒక అపరిచితుడు తన దారికి నిలబడటం చూసి, స్వామిజీ కంగారు పడ్డాడు. నీరమ్ కళ్లు నిప్పులు చెరుగుతున్నాయి. స్వామిజీ ఎక్కువసేపు ఆ కళ్లలోకి చూడలేక, పక్కనించి తప్పుకు పోదామని ప్రయత్నించాడు. నీరమ్ అతన్ని అడ్డగించి, "స్వామి భగవాన్ దాస్ మీరేనా?" అని అడిగాడు.

అలా అడిగేసరికి అతను తొట్రుపాటు పడ్డాడు. పెదవులు అస్పష్టంగా గొణిగాయి. నీరమ్‌ను తప్పించుకుని ముందుకు పోతూ, "అంతా ఆ దేవీ ఆజ్ఞ, దాన్ని శిరసావహిస్తున్నాను!" అన్నాడు. ఈ జవాబు విని నీరమ్ కోపంతో వణికిపోయాడు. మనసులోని కోపాన్ని మాటల్లో ఈసారి వెళ్లగక్కేశాడు. "దేవీ ఆజ్ఞా కాదు, ఏం కాదు, ఇదంతా మీపనే! కొండల్లో బ్లాస్ట్ చెయ్యడం ఆపండి. పైన మా ఇల్లుంది, అది కూలిపోతుంది. మీకో దండం పెడతాను, వెంటనే ఈ అన్యాయం ఆపండి!"

స్వామిజీ ఒక్క క్షణం కంగారు పడ్డాడు. ఏమని జవాబివ్వాలో తెలీలేదు. పైన ఇల్లుందన్న సంగతి అతనికెవరూ చెప్పలేదు... అయినా తెలిస్తే మటుకు పని ఆపించేవాడా? వంకరగా నవ్వుతూ అతనికేసి చూశాడు, నీరమ్ తన ధోరణిలో మాట్లాడుతునే పోయాడు.

''ఏమిటి స్వామిజీ నా మాటలు విన్నారా లేదా, ఈ గ్రీన్‌బెల్టులో మీరు చేస్తున్నది చట్ట విరుద్ధమైన పని... ఇకనైనా ఆపండి! మీ దేవి ప్రత్యక్షమయే లోపల నేనూ నా కుటుంబం రోడ్డు మీదుంటాం, సర్వనాశనం అయిపోతాం!"

చట్టం అనే మాట విని స్వామిజీ లోలోపలే మండిపడ్డాడు. కానీ బైట శాంతంగా, "హరే రామ! హరేరామ! ఆ దేవి నిన్ను కాపాడుతుంది నాయనా! క్రోధం మాని, ఈ పవిత్రకార్యంలో నీ మనసుని లగ్నం చెయ్యి, నీకు శుభం జరుగుతుంది... జైశ్రీరామ్!" అన్నాడు. నీరమ్‌ని వదిలించుకుని ముందుకి వెళ్లిపోయాడు.

స్వామిజీ సొరంగం చేరుకోగానే అందరూ అతనికి జయజయ ధ్వానాలు పలికారు. అవి నీరమ్ చెవులకి తన పాలిట శాపాల్లా వినిపించాయి. ఆ దొంగస్వామినీ, అతని శిష్యులనీ మనసారా తిట్టుకున్నాడు. ఎలాగోలాగ ఆ గుంపునించి బైటపడి, ఒక చోట చతికిలపడ్డాడు. తల పట్టుకుని కూర్చున అతనికి, మెరుపులాగ తట్టింది– భగవాన్‌దాస్ మొహం తను ఎక్కడ చూశాడో, అతనికి జ్ఞాపకం వచ్చింది.

ఒక జిల్లా ఆఫీసర్ పదవి నుంచి అతను ఈ మధ్యనే రిటైరయ్యాడు. అతని లంచగొండితనం గురించి, పేపర్లలో చాలాసార్లు వచ్చింది. ప్రభుత్వానికి అతను ముద్దుబిడ్డ అని అందరూ చెప్పుకునేవారు. అతన్ని ఎవరూ ఏమీ చెయ్యలేకపోయారు. అతను రిటైరవగానే ప్రభుత్వం మారింది. అప్పుడు అతను ఊరువదిలి పారిపోయి ఒక మఠంలో చేరాడు. బాబాల ట్రిక్కులన్నీ నేర్చుకుని, ఈ 'వ్యాపారం'లోకి దిగాడు. చాలామంది 'ఎస్‌మెన్'ని సంపాదించుకున్నాడు. వారిలో చాలామంది ఉద్యోగం సద్యోగం లేక రికామిగా తిరిగే కుర్రకారే! వాళ్లకి దీన్లోనే ప్రయోజనం కనిపించింది. తనకున్న పరిచయాలని ఉపయోగించుకుని, ఒక పెద్దపట్నంలో సొంత ఆశ్రమం స్థాపించాడు. మళ్లీ ప్రభుత్వం మారి, పాత ప్రభుత్వం అధికారంలోకి వచ్చేవరకూ, ఈ ఊళ్లో అతను అడుగుపెట్టలేదు. ఆ తరువాత తన ఊరికి వచ్చి, తన శిష్యుల చేత తన గురించి పెద్ద ఎత్తున ప్రచారం చేయించాడు. వైష్ణోదేవి దర్శనానికి అంత దూరం వెళ్లక్కర్లేదని, పైగా ఆ దేవి ఉన్న ఆప్రాంతాల్లో ఉగ్రవాదుల భయం ఎక్కువైందనీ, తనకి పరమభక్తుడైన భగవాన్‌దాస్‌ని దేవి ఈ ఊరికి రమ్మందనీ, అందుచేత దేవి ఇక్కడ కొండగుహలో వెలిసి, అందరికీ దర్శనమిస్తుందనీ, భక్తుల కోరికలని తీరుస్తుందని ప్రచారం చెయ్యసాగారు. ఇదంతావాళ్లు ముందుగా ఒక పథకం వేసుకుని చేసిన పనే.



జిల్లా పరిషత్తూ, ప్రభుత్వమూ భగవాన్‌దాస్‌కి చేదోడు వాదోడుగా ఉన్నాయనీ, లేకపోతే అతను ఈ పనికి పూనుకునేవాడు కాదని నీరమ్‌కి నమ్మకం కుదిరింది. ఈ సంగతి అర్థం కాగానే అతను నీరుకారిపోయాడు. కాని చూస్తూ చూస్తూ కూర్చోవటం కూడా అతనివల్ల కాలేదు. అందుకని అతను తన పోరాటాన్ని మొదలు పెట్టటానికి పోలీసు విభాగాన్ని ఎంచుకున్నాడు. ఒక ఫిర్యాదురాసి, పోలీస్‌స్టేషన్‌కి తీసుకెళ్లాడు. చాలాసేపు ఇనస్పెక్టర్ కోసం ఎదురు చూడవలసివచ్చింది. తీరా అతనికి పిలుపు వచ్చేసరికి, ఇనస్పెక్టర్ టీ తాగుతూ తాపీగా కూర్చునున్నాడు. నీరమ్ తన అర్జీని అతనికిచ్చాడు. అతడు దానిని చాలాసేపు చదివాడు. నీరమ్ తనగోడు వెళ్లబోసుకున్నాడు. చెబుతున్నప్పుడు కళ్లల్లో నీళ్లు తిరిగాయి. కాని పోలీస్‌స్టేషన్ లాంటి చోట వాటికి విలువేముంటుంది?

ఇన్‌స్పెక్టర్ అర్జీ కాగితాన్ని బల్లమీద ఒక పక్క పెట్టాడు. కుర్చీని టీవే వైపు తిప్పి, ఆన్ చేశాడు. టీవీలో శంకరాచార్య భాగోతం వస్తోంది. పోలీసులు అవన్నీ వార్డుకి తీసుకెళ్తున్నారు.

నీరమ్‌కి చాలా అసహనంగా ఉంది. రిటైరయాక, మనిషికున్న గౌరవం తగ్గిపోతుందని చెప్పటానికి ఇంతకన్నా రుజువేం కావాలి? తను ఆర్మీ ఆఫీసర్‌గా ఉన్నప్పుడు ఒక్క పోలీసులేమిటి, తదితర ప్రభుత్వోద్యోగులు కూడా తనముందు నోరెత్తేవారు కాదు. ఇంతలో ఇనస్పెక్టర్ అతని వైపు తిరిగి, "కెప్టెన్! మన హిందూ దేశం ఎటుపోతోంది? జనానికి పిచ్చి పట్టింది, లేకపోతే – మీరే చెప్పండి – శంకరాచార్యులంతటి వాడిని... ఐనా అంత పెద్దాయన ఈ వయసులో... ఒక ఆడదాన్ని... ఏమైనా చేస్తాడా? చెప్పండి!" అన్నాడు. 'ఏమైనా' అని అనేటప్పుడు ఇన్‌స్పెక్టరు కనుబొమ్మల్ని విచిత్రంగా కిందికీ పైకి ఆడించి పగలబడి నవ్వాడు. దానికి అక్కడున్న కానిస్టేబుల్లిద్దరూ 'హి..హి' అని పళ్లువికిలించారు.

ఇనస్పెక్టర్ మళ్లీ తన ఉపన్యాసం మొదలెట్టాడు. 'జనానికి మన మతం మీద బొత్తిగా గౌరవం లేకుండాపోయింది. దానిని కాపాడటానికి ఎవరైనా పూనుకుంటే వాళ్లని శత్రువుల కింద జమకడతారు. చూస్తూ ఉండండి, ఏదో ఉపద్రవం రాబోతోంది... మానభంగాలు పెరుగుతాయి. బాంబులు పేలుతాయి!... అందుకే మన బతుకులిలా ఉన్నాయి! సాధువులూ స్వాములార్లూ తప్ప ఎవరు కాపాడగలరు?" ఇలా అంటూ బల్లకిందున్న బెల్లుని బలమంతా ఉపయోగించి నొక్కాడు. వెంటనే ఇద్దరు పోలీసులు పరిగెత్తుకుంటూ వచ్చారు.

"ఇంకా ఆ జోకరుగాడు వచ్చి చావలేదా? రెణ్ణిమిషాల పనికి గంటపడుతోందే! ఈ దేశం ఇంక బాగుపడ్డట్టే... ఇదేం పోలీసుస్టేషన్ అనుకున్నాడా, వాడి అత్తవారిల్లు అనుకున్నాడా?" అని బండబూతులు లంకించుకున్నాడు ఇనస్పెక్టర్.

ఇంతలో ఒక బక్కచిక్కిన పోలీసు చేతిలో ఒక సంచితో లోపలికొచ్చాడు. వినయంగా బల్లమీద పెట్టి, దానిలోని వస్తువులని ఒకటోకటిగా బైటికి తియ్యసాగాడు. ఒక కొబ్బరికాయ, 'చునరీ' ధూపం సేకెట్, ప్రసాదం పేకెట్! జేబులోంచి యాభైరూపాయల నోటు కూడా తీసి ఇన్‌స్పెక్టర్ ముందుంచాడు పళ్ళికిలిస్తూ, "దాన్ని వాళ్ళు తీసుకోలేదు సార్! ఊరికినే ఇవన్నీ యిచ్చారు..." అన్నాడు. "మీ విషయం తప్పకుండా చూస్తాను, మేమున్నది మీ కోసమే! అందరికీ సేవ చెయ్యటమే మా ఉద్యోగం... ప్రస్తుతం దేవీ పీఠం వెలిసిన చోటికి వెళ్లాలి. ఉత్తచేతులతో ఎలా వెళ్లేది? నాకు డియస్పీ ప్రమోషన్ రావాలి ఆ దేవి అనుగ్రహం ఉంటే చాలు, వెంటనే వచ్చేస్తుంది.. కొత్తగా వెలిసింది కాబట్టి కాస్త తొందరగానే వినిపించుకుంటుంది! ఈ కలియుగంలో పోలీసులకన్నా దేవుళ్ల పనులే ఎక్కువ'' అని అంటున్నప్పుడు ఆ ఇన్‌స్పెక్టర్ మొహం మీద ఒక వింత వెలుగు కనిపించింది. నీరమ్ కోపంతో నోరు విప్పేలోగా, బల్లమీద ఫోన్ మోగింది. ఎంతో దర్పంగా ఫోనెత్తిన ఇన్‌స్పెక్టర్, అట్నుంచి వినబడిన గొంతు వింటునే ఎంతో అణుకువగా, "అలాగా... అలాగా సార్...సార్... తమరేం వర్రీ కాకండి... మేమున్నది ఎందుకు... ఆ విషయం మాకు వదిలేయండి..." అంటుంటే అవి నీరమ్‌కి భరింపశక్యం కానివిగా అనిపించాయి. పైగా మాట్లాడుతున్నంత సేపూ ఇన్‌స్పెక్టర్ అతనివైపే కళ్లార్పకుండా చూస్తూ ఉన్నాడు.

"అక్కడికే బయలుదేరుతున్నా సార్... మీ దర్శనం చేసుకుంటాను," ఇన్‌స్పెక్టర్ ఫోన్‌లో అన్న ఆఖరి మాటలు. బైట జీపు స్టార్ట్ అయి నల్లటి పొగవదుల్తూ వెళ్లిపోయింది.

నీరమ్‌కి ఏం చెయ్యాలో పాలుపోలేదు. అక్కడ ఒక్కక్షణం కూడా ఉండబుద్ధి కాలేదు. ఒక పోలీసు తను రాసిన అర్జీ తీసుకుని చూశాడు. "ఇంకెక్కడైనా ప్రయత్నించండి, సార్! ఇక్కడ అందరూ భగవాన్‌దాసు భక్తులే!" అని అంటూ లోపలికి వెళ్లిపోయాడు.

పెద్ద అవమానభారాన్ని తలమీద మోస్తున్నట్టుగా అతను అర్జీతో అక్కడినించి బైటపడ్డాడు. తిన్నగా జిల్లా అధికారి ఆఫీసుకి వెళ్లాడు. గది బైట వెలుగుతున్న ఎర్రలైటు, అధికారి ఖాళీగా లేడని తెలియజేసింది. వెయిటింగు రూమ్‌లో దాదాపు గంటసేపు వేచి చూశాడు. లోపలి నుంచి పిలుపురాలేదు. బైటికొచ్చిన ప్యూన్‌తో తన పని గురించి చెప్పాడు. మూగవాడిలా ఎర్ర దీపం కేసి సౌంజ్ఞ చేశాడు వాడు. నీరమ్ మళ్లీ కుర్చీలో కూలబడ్డాడు. ఇంకో అరగంట గడిచింది. అనుమతిలేకుండానే లోపలికి పోవాలనే నిశ్చయించుకుని, లేచి నిలబడ్డాడు. తలుపు దగ్గరకు చేరాడో లేదో ఆఫీసర్ తలుపు తోసుకుని బైటికొచ్చాడు. అతని వెంట ఇద్దరు సాధువులున్నారు. నీరమ్ కేసి చూసి, 'అరె కెప్టెన్, ఎలా ఉన్నావ్?' అని పలకరించి వెంటనే కదిలాడు.

"అర్జెంటుగా మీతో మాట్లాడాలి, సార్! కొంచెం టైమిస్తే..."



"తప్పకుండా.. తప్పకుండా! నీకు కాకపోతే ఎవరికి టైమిస్తాను? కానీ ప్రస్తుతం కాస్త తొందరపని మీద బైటకి వెళ్తున్నాను. స్వామిజీ శిష్యులు పొద్దున్నించీ నన్ను చుట్టుముట్టారు... ఇప్పుడు వీళ్లకి టైమివ్వక తప్పదు కదా? ముఖ్యమంత్రిగారు రెండ్రోజులలో దేవి పీఠానికి వెళ్లాల్సి ఉందాయె!" అలా మాట్లాడుతునే అతను బైటికి వెళ్లిపోయాడు.

నీరమ్ నిర్ఘాంతపోయాడు. మొహమంతా చెమట్లు పట్టాయి. రుమాలనుకొని జేబులోంచి అర్జీ కాయితం తీసి మొహానికి పట్టిన చెమటని తుడుచుకున్నాడు.

నింపాదిగా ఆలోచించి, ధైర్యం తెచ్చుకుని ముఖ్యమంత్రిని కలవాలని నిర్ణయించుకున్నాడు. ఇక యిదొక్కటే మార్గం అనిపించింది. నేరుగా సీయమ్ ఆఫీసుకు వెళ్లాడు. అతని ఐడెంటిటీ కార్డు అందుకు పనికొచ్చింది. గదిలో సూదిమొన మోపేందుకు కూడా చోటు లేకుండా జనం ఉన్నారు. కార్యదర్శి దగ్గరకు వెళ్లి తను వచ్చిన పని చెప్పాడు. ఇంతలో ఇంకో మంత్రి వచ్చి, "సీఎమ్ ఎవరితో మాట్లాడుమన్నారు?" అని అడిగాడు. స్వామి భగవాన్‌దాస్ ఆయన గదిలో ఉన్నారని జవాబు వచ్చింది. నీరమ్ తాచుపాముని చూసినట్టు గాభరాగా లేచి నిలబడ్డాడు.

"ఎక్కడికి వెళ్లినా ఈ భగవాన్‌దాస్ నన్ను వదలటం లేదు! ప్రతి చోటా, ప్రతి మనిషిలో... చివరకి ఇక్కడ కూడా.. మైగాడ్!" అని మనస్సులోనే గొణుక్కున్నాడు. మరుక్షణం బైటికి నడిచాడు నీరమ్.

ఈ చివరి ఆశ కూడా నిరాశే అయింది. ఇక్కడ కూడా ఓటమి చవి చూశాక అతని ఉత్సాహమూ, ఆవేశమూ పూర్తిగా చప్పగా చల్లారిపోయాయి. ముఖ్యమంత్రి దగ్గరికి వెళ్లేముందు, అతను కొన్ని పత్రికాఫీసులకి కూడా వెళ్లాడు.

కానీ వాళ్లు కూడా స్వామిజీ మాయలో పడినట్టు అతనికి అర్థం అయింది. కొందరు నిజం తెలిసినా దాన్ని ప్రచురించటానికి ఇష్టపడలేదు. ప్రభుత్వంతో వైరం తెచ్చుకోవటం కొరివితో తలగోక్కోవటమేగా! పత్రికల వాళ్లకి ప్రభుత్వం ఎన్ని రకాల సౌకర్యాలనిచ్చి పోషిస్తోందో అతనికి తెలియకపోలేదు. అయినా ఒక్కరైనా తన బాధని అర్థం చేసుకుని, పత్రికలో రాయకపోతారా అని అతను చాలా వెతికాడు.

పొద్దుగూకే వేళకి అతను ఇల్లు చేరుకున్నాడు. భార్యకీ, కొడుక్కీ ఎదురుపడే ధైర్యంలేక మెట్లమీదే చతికిలబడ్డాడు. కొంతసేపటికి అతన్ని చూసి వాళ్ళిద్దరూ పరిగెత్తుకొచ్చారు. పారబ్ తండ్రిని వాటేసుకుని, "నాన్నా! మన ఇల్లు కూలిపోతుందా? మన ఇంటికింద వాళ్లు తవ్వుతున్న సొరంగం చాలా పెద్దది కదా?" అన్నాడు దిగులుగా.

తన కొడుక్కీ విషయం ఎలా తెలిసిందా అని నీరమ్ ఆశ్చర్యపోయాడు. అతనికి కేలమ్ జవాబు చెప్పింది. "ఇవాళ స్కూలు పిల్లలందరినీ ఆ గుహ దగ్గరికి తీసుకెళ్లారు, పారబ్ వాళ్లతో వెళ్లాడు," అంది.

"కానీ కేలీ అక్కడ ఏమీ లేదే! ఆ దొంగ సన్యాసి వంద అడుగుల సొరంగం తవ్వుతానని కదూ అన్నాడు?"

"జనం ఎంత అమాయకులో నీకు తెలుసుగా నీల్! ఈ కొండల్లో ఏళ్ల తరబడి ఉంటున్న వీరికి దేవుళ్ల మీద ఎంతో నమ్మకం! ఇక ఆ దేవుడి ఏజంట్లంటే వీళ్లకి ఎక్కడలేని భయం భక్తీనూ!"

"ఇదో రెలిజయిస్ బ్లాక్‌మైలింగ్! జనానికున్న ధార్మిక భావనల్ని ఎగదోసి పబ్బం గడుపుకోవటం. ఇదొక వ్యాపారం, అంతే!" అన్నాడు నీరమ్

కేలమ్ నీరమ్ చెయ్యి పట్టుకుని లేపి కుర్చీలో కూర్చోపెట్టింది. లోపలికి వెళ్లి టీ చేసి తీసుకొచ్చి అతని చేతికిచ్చింది.

అతని విసుగు ఏమాత్రం తగ్గలేదు." ఏం లాభం లేదు కేలీ! మనం ఏమీ చెయ్యలేం. ఈ దొంగ వ్యాపారంలో అందరూ చేతులు కలిపారు... భయంకరమైన కుట్ర కేలీ!" అన్నాడు.

ఏదో జరుగుతుందని ఎదురు చూసిన కేలమ్‌కి నీరమ్ మాటలు సమ్మెట పోట్లలా తగిలాయి. ఇంతలో డోర్‌బెల్ మోగింది. తలుపు తీస్తే ముగ్గురు కుర్రాళ్లు ఏవో రసీదు పుస్తకాలతో నిలబడివున్నారు. తలకి ఎర్రగుడ్డలు చుట్టుకున్నారు." ఇవాళ రాత్రంతా వైష్ణోదేవి జాగరణ... దాని కోసమే!"

నీరమ్ కోపంతో ఏదో అనబోయాడు. కేలమ్ చేతులు జోడించి, "ప్లీజ్ నీర్.. ఏమీ అనవద్దు ప్లీజ్!" అంటూ యాభైనోటు కుర్రాళ్లకిచ్చింది. రసీదు రాయబోతుంటే వద్దని వారించింది. వారు వెళ్లాక తలుపులు మూసి చాలాసేపు వాటికి ఆనుకుని ఉండిపోయింది.

నీరమ్‌తో ఘర్షణ పడ్డాక స్వామిజీ కొంచెం భయపడ్డాడు. దేవుడి పేరు చెప్పి తనయిష్ట మొచ్చినట్టు ఆడటం కుదరదని తెలిసింది. నీరమ్ పోలీసుస్టేషన్‌లో, జిల్లా ఆఫీసుకీ వెళ్లే లోపల అక్కడి వాళ్లందరికీ అతను వార్నింగ్ ఇచ్చేశాడు. అందుకే నీరమ్ మాట ఎవరూ వినిపించుకోలేదు. పైవరకూ తనకి ఎందరో మిత్రులున్నప్పటికీ, సొరంగం తవ్వటం విషయంలో జాగ్రత్తగా ఉండమని శిష్యులకి చెప్పాడు. 'బ్లాస్టులు' ఆపేశారు కాని తవ్వకాలు జరుపుతునే ఉన్నారు. వంద

అడుగులకు బదులు అరవై అడుగులు మాత్రమే తవ్వి దేవి పీఠాలు అక్కడే దొరికాయని చెప్పాలని నిర్ణయించుకున్నాడు.

నీరమ్‌కి ఇప్పుడు హైకోర్టును ఆశ్రయించటం తప్ప వేరేదారి కనిపించలేదు. ఎందరో పేరున్న లాయర్లతో మాట్లాడి చూశాడు. కాని ఒకరు కూడా దేవుడి విషయంలో వాదించటానికి ముందుకు రాలేదు. ఆఖరి ప్రయత్నంగా అతను పారబ్ పేరుతో హైకోర్టుకి ఒక ఉత్తరం రాసి పంపాడు.

పారబ్‌కి తన తల్లిదండ్రులు పడుతున్న బాధ తెలుస్తూనే ఉంది.. తెలిసీ తెలియని వయసు. లోలోపల వాడు పడుతున్న భయం మొహంలో కనబడుతోంది. దీని ప్రభావం వాడి చదువుమీద, దినచర్య మీద కూడా పడుతోంది – క్లాసులో ఎవరితోనూ మాటామంతీ లేకుండా కూర్చోవటం, ఆటలు ఆడకపోవడం, సరిగ్గా చదవకపోవటం...

వార్తాపత్రికల్లోని ఒక వార్త చదివి నీరమ్, కేలమ్ మరింతగా ఆశ్చర్యపోయారు. "కొండ భూగర్భంలో దేవీ కృపతో మహా అద్భుతం! కొండరాళ్ల మధ్య నుంచి నీటిధార! భక్తులకు దేవీ చరణామృతం!" ఈ వార్త చదవగానే ఏమూలో వాళ్లిద్దరి మనసుల్లోనూ ఉన్న భక్తిభావం తలెత్తింది. ఇన్నాళ్లూ ఉన్న అపనమ్మకం ఒక్కదెబ్బతో మాయమైంది.

నీరమ్ దేవీ పీఠం ఉన్న గుహకేసి బయలుదేరాడు. జనం మైమరచి దేవి చరణామృతం కోసం తెల్లారగట్టేలేచి క్యూలో నిలబడ్డారు లాగుంది, రోడ్డు మీద చివరి వరకూ జనం ఉన్నారు. నీరమ్ కూడా భయ భక్తులతో క్యూలో వెనక చేరాడు. అతను సొరంగం చేరుకోవటానికి చాలా టైమ్ పట్టింది. ముఖద్వారానికి కొద్ది రూపంలోనే బొట్లు బొట్లుగా నీరు పడటం కనిపించింది. ఒక సాధువు పెద్దరాగి పాత్రలో ఆ నీటిబొట్లని పడుతున్నాడు. ఒక్కొక్కళ్లకి చెమ్చాతో ఆ నీళ్లు ఇస్తున్నాడు. దానిని కళ్లకద్దుకుని జనం తాగుతున్నారు.

నీరమ్ ఈ దృశ్యాన్ని చూస్తూ నిలబడ్డాడు. ఇప్పుడు లోన మందుగుండు వాసనలేదు, కాని గాలివాటున ఏదో కుళ్లువాసన వస్తున్నట్టు అతనికి అనిపించింది. సొరంగం చాలా లోపలి వరకు తవ్వినట్లు తెలుస్తోంది. ఊపిరి సలపనట్టు అనిపించి అతను బైటికి వచ్చేశాడు. సాధువు యిస్తున్న 'తీర్థా'న్ని తీసుకోవాలనిపించలేదు. బైటికొచ్చేసినా ఆ మురికివాసన అతన్ని వదలలేదు. గట్టిగా ముక్కు చీది, ఇంటిదారి పట్టాడు.

నీరమ్ ఇంటికింద, సరిగ్గా కొండగుహపైన, ఒక మురికినీటి ట్యాంకు ఉంది. ఊళ్లోని సగం ఇళ్లలోని మురికంతా వచ్చి అందులో చేరుతుంది. పైకి తన ఇంటి వైపు వెళ్లకుండా, అతను టాంకు ఉన్న చోటికి వెళ్లాడు. సొరంగంలో బ్లాస్టులు చెయ్యటంతో ట్యాంకు బీటలు వారింది. వాటిలోంచి మురికినీరు కారి, సన్నధారలా సరిగ్గా గుహపైన చేరి, రాళ్లలోంచి గుహలోనికి బొట్లు బొట్లుగా పడుతోంది. దేవి చేసిన అద్భుతమేమిటో అతనికి తెలిసిపోయింది. అతను తలపట్టుకుని అక్కడున్న రాయి మీద కూలబడ్డాడు, ఈ మురికినీటినా భక్తులు దేవి చరణామృతం అనుకుని సేవిస్తున్నారు? అని అనుకున్నాడు.

ఆరోజు రాత్రి పెద్ద వర్షం పట్టుకుంది – ఉరుములూ, మెరుపులతో ఎడతెరిపిలేకుండా భారీవర్షం! చిన్న చిన్న కాలువలు పొంగుతున్నాయి, అవి కొండల మీదనించి వేగంగా ప్రవహించి నదిలో కలుస్తున్నాయి.

ఆంజనేయస్వామి ఆలయంలో మోగే గంటలూ, కారుహార్లనూ బాగా పొద్దెక్కిందని తెలియజేస్తున్నా నల్లటి కారుమబ్బులు కమ్ముకుని ఇంకా చీకటిగానే ఉంది. ఇంతలో పేపరు కుర్రాడు తలుపు సందులోంచి పేపరు లోపల పడేసి వెళ్లాడు. పేపర్ చదువుతూ ఉలిక్కిపడ్డాడు నీరమ్.

పేపర్లో వార్తలు చాలానే ఉన్నాయి – "స్వామి భగవాన్‌దాస్ ఈ రోజు మధ్యాహ్నం నేలలోంచి దేవీ పీఠాన్ని వెలికితీస్తారు... అనుష్ఠానంలో ముఖ్యమంత్రి కూడా పాల్గొంటారు.." వీటితోబాటు బాక్స్ కట్టిన ఒక వార్త కూడా ఉంది, ఒక పిల్లవాడు రాసిన ఉత్తరానికి స్పందించి, హైకోర్టు సొరంగం పనిని ఆపమని ఆజ్ఞ జారీ చేసింది. అంతేగాక, జిల్లా పరిషత్తునీ, ప్రభుత్వాన్నీ సంజాయిషీ చెప్పుకోమని ఆదేశించింది. ఇక మూడోవార్త హెడ్‌లైన్సులో ఉంది. "అర్ధరాత్రి సొరంగం కూలింది, ఎంతో మంది సాధువులు, కూలీలు అందులో యిరుక్కుపోయినట్టు అంచనా..." నీరమ్ కుటుంబానికి ఇదే అన్నిటికన్నా ముఖ్యమైన వార్త! వాళ్లు ఒకళ్ల మొహాలు ఒకళ్లు చూస్తూ కూర్చున్నారు. ఇన్నాళ్లుగా వాళ్లు చేస్తున్న పోరాటం ఇలా విషాదాంతం అవుతుందని వాళ్లు ఊహించలేదు. పాపం! ఏ తప్పూ చెయ్యని ఆ సాధువులూ, కూలీలు రాళ్ల కింద నలిగిపోయుండవచ్చు అన్న వార్త కదిలించివేసింది వారిని.

నీరమ్ భారంగా లేచాడు. అతని ఒంట్లో ఒక రకమైన చైతన్యం తలెత్తింది. అల్మైరా తెరిచి, తన పాత ఆర్మీ యూనిఫారమ్ తీసి వేసుకున్నాడు, విపత్తులు జరిగినప్పుడు, ఆర్మీ ఆఫీసరుగా అతను వేసుకున్న దుస్తులు అవి! వెంటనే కొండ దిగి, గుహలో చిక్కుకున్న వాళ్లని వెలికితీసే పనిలో తనవంతు సాయం చెయ్యటానికి బైలుదేరాడు.

A


సాహిత్య ప్రస్థానం

లభించు చోట్లు

ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1/3, చిక్కడపల్లి,
హైదరాబాద్-20,
ఫోన్ : 27660013

రామకృష్ణ న్యూస్ ఏజెన్సీస్
అబిడ్స్, హైదరాబాద్.
దాని పంపిణీ కేంద్రాలలో,
ఇతర ప్రముఖ బుక్‌షాప్‌లలో

బ్రాంచీలు

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 27-19-14, వి.ఎన్.ఆర్. కాంప్లెక్స్, దుర్గయ్య వీథి, **విజయవాడ-2** ఫోన్ :2577533 | సుందరయ్యభవన్, బాలాజీనగర్ **ఖమ్మం-507 001** | 140, ప్రకాశం రోడ్, **తిరుపతి-517 502** ఫోన్ : 2260017 | 6-2-250, విజయటాకీస్ రోడ్, చౌరస్తా, **హన్మకొండ-506 001** ఫోన్ : 2544559 | సుందరయ్యభవన్ సుభాష్ విగ్రహం(ఎదుట) **నల్గొండ** ఫోన్ : 230525 | షాప్ నెం.10, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, ఆసీల్‌మెట్ట బస్టాప్, రామా టాకీస్ రోడ్ **విశాఖపట్నం** ఫోన్ : 2716355 | 2/7, బ్రాడీపేట్ **గుంటూరు** ఫోన్ : 277336 |

ఇంకా కావలసిన ఏజెంట్లు, సాహితీ మిత్రులు రాయండి

## విశ్లేషణ

# నాగావళి పల్లె కథ



**కథ చెప్పాలంటే చాలా తెలియాలన్నారు. పెద్దలు, ఇది గౌరునాయుడికి చాలా మంది కథకుల కంటే బాగా తెలుసు. కథ ఎలా ఉండకూడదో కూడా తెలుసు. పాత్ర, వర్ణన, సమస్య, వాతావరణం, సంభాషణ, సన్నివేశం, సందేశం ఇవేవీ గౌరునాయుణ్ణి దారి మళ్లించవు. మెలకువకు నిద్రకు మధ్య దారి తప్పిన కలలాంటి తన కథను కళగట్టించే నేర్పు ఒకటి అతనికి పట్టుబడింది. మరీ అవసరమైనప్పుడు దాని కళ్లెం కొంచెం బిగిస్తాడు, ఆ సరసాలలో వీరాచారిని, సెగల బంగారు నాయుడి కోడల్ని, 'భూమిపుండు'లో ఆదినాయుణ్ణి, 'ముంపు'లో వరహాలనాయుడు పెళ్లాన్ని చదివిన వారికి గౌరునాయుడి కథ అంటే ఏమిటో తెలుస్తుంది.**

**డా॥ యు.ఎ. నరసింహమూర్తి**

**నా**గావళి పారిన నేల తెలుగునాడుకు చిటారుకొమ్మలా ఉంటుంది. మా ఉళ్లో ఉన్న వాళ్లలో నల్లెం కన్నే ఎర్రోడు అన్నట్టుగా ఆ పరగణాలో అదే కాస్త నీటి తడి ఉన్న మట్టి, కొండ ఒడిలోను, అడవి అంచులోను కేరింతలాడే ప్రకృతి అది. నాగావళి, గుమ్మడిగెడ్డ, ఒట్టిగెడ్డ పొంగి పరవళ్లు త్రొక్కిన రోజుల్లో సముద్ర గర్భంలో కలిసిపోతాయి.

ఇప్పుడైతే అక్కడా ఇక్కడా అడ్డుకట్టలు కట్టడంతో నాగావళి సైతం వలసపోయిన కొడుకు దుఃఖంతో కుమిలి కుమిలి ఏడ్చే మూడు కాళ్ల ముసలి దాని ఎండిన బుగ్గల మీద కదలలేక కదలలేక జారిపడే చిన్న కన్నీటి చారలా ఒక చెంప నేలకు అంటుకొని పోయి కదలలేని స్థితిలో ఉన్న చిన్నపాయగా మిగిలింది. అయితే వరద కాకపోతే వరపు. పంట మునిగినా అది ఏమైనా రైతు ముంగిట మరిడమ్మ గజ్జెల మోత తప్ప ఇంకొకటి వినిపించదు. ఏనుగుల గుంపులు పరుగులు తీస్తూ మీద పడుతున్నట్టు పారడంతో ఆ ఏటికి నాగావళి అని పేరు వచ్చింది. ఆ సంగతి ఏమో గానీ ఇప్పటికీ నాగావళి ఒడ్డునున్న ఊళ్లమీద ఏనుగులు గుంపులు గుంపులుగా కదిలివచ్చి ఊళ్లన్నీ బెగ్గిలిపోయేట్టూ చేస్తూ ఉంటాయి. అందుకే సన్నాయి కనబడకపోతే అతడి తాత "ఏనుగుల కెదురెడి పోనాడేటో" అని బెంబేలు పడతాడు. పల్లె ప్రజలు చీకు – చింత లేకుండా బతకడానికి కావలసిన సంపద అంతా ఇక్కడ ఉంది. అమాయకత్వమే చేతగానితనమైతే ఇక్కడి ప్రజలు మిగిలిన ప్రాంతాల వాళ్ల కంటే చేతగాని వాళ్లనాలి. నీరు, నేల, గాలి, అడవి, కొండ అంతా వాళ్లదే. అయినా తాత ముత్తాతల నాటి నుండి కావలసినది మాత్రమే తీసుకోవడం వారికి అలవాటు. ఒంటిమీద బట్ట కూడా ఎంత ఉంటే సరిపోతుందో అంతే ఉంటుంది. వాళ్లకు అంతకు మించి దాచడం, అమ్మడం, సొమ్ము చెయ్యడం, తోటి వాళ్ల నోట్లో మట్టి కొట్టి అంతా తామే బుక్కెయ్యాలనుకోవడం తెలియదు. ఊరంతా వాళ్లకు ఒకటే ఇల్లు. కష్టమైనా, సుఖమైనా అందరూ కలసి పంచుకుంటారు. వరసలు పెట్టి పిలుచుకోవడానికి వాళ్లకు కులం, మతం అడ్డురాదు. కష్టపడి బతుకుతారు. ఇదంతా వెనుకబడిన తనమే అని ముద్రపడి దానిని వెనుకపడిన ప్రాంతం అన్నారు. ఉన్నవాడి దృష్టి ఎప్పుడూ లేనివాడి మీదే, తెలివి మీరిన పడమటి నేల దొరలు సత్తెకాలపు తూర్పు నేలకు తరలివచ్చి మాగాణి, మెట్ట, అడవి, కొండ అన్న తేడా లేకుండా ఇక్కడి సరుకును దోచుకుంటూ ఈ నేలను తరతరాలుగా నమ్ముకున్న జాతి బిడ్డలను బలవంతంగా వలస పిట్టలుగా మారుస్తున్నారు. కాపుబిడ్డ నుండి కడమ నున్న వారంతా గతం కత్తుల బోనుకోంచి సరాసరిగ వర్తమానం విషప్పురుగు నోట్లోకి నడిచి పోతున్నారు. "వచ్చెడిది బంగారు కాలము" అన్నాడొక కవి. పల్లె పాలిటికిది అంగార కాలం అయింది. అప్పుడు బుగతలు ఇప్పుడు దొరలు, ఒకప్పుడు ఉన్నదంతా బుగతలదే. మిగిలిన వారంతా వెట్టివారు కంబారులు, పాలేళ్లు, కౌలుదార్లు. కూర్చుని తినేవారు గుండెకాయ తినేవారు. కష్టించేవాళ్లు కాళ్లు తినేవారు. అయినా చెమటోడ్చిన వాళ్లకు తమదంటూ ఏదో ఒకటి మిగిలేది. నేల నీరు, గాలి వాళ్లవే. ఎన్నెన్నో 'ఇసాసకాలు' వాళ్లనంటి పెట్టుకుని ఉండేవి. ఎన్ని తరాలైనా ఆ మట్టిలోనే పుట్టి ఆ మట్టిలోనే పిడికెడు మట్టిగా మారిపోయేనారు ఎంత చెడ్డా బుగతలకు, ఇతరులకు మధ్య ఒక మమత, ఒక పేగు ఉండేవి. ఆ సరసాలు వాళ్ల అసెంబ్లీగా ఉండేది. పదీ ఎనిమిది వర్ణాల వారు ఒక చోట చేరి కష్టసుఖాలు కలబోసుకునేవారు. బాధలేనిదే బ్రతుకేలేదు అనేది బీద బిక్కి నొసట రాసిన తత్త్వమే అయినా అందుకోనే సిర్లు సంబరాలు ఎన్నో చేసుకొనే వారు. దొరలు వచ్చాక పల్లె వల్లకాడు అయింది.

బుగతల కాలం నాటి పల్లెకథలో మునసబు, కరణాలు, పురోహితులు, కులకక్షలు, షాపుకారు వడ్డీలు, దావాలు, కొట్లాటలు, అక్రమసంబంధాలు, లేచిపోవడాలు, లేపుకు పోవడాలు, అవిద్య, అజ్ఞానం, శ్రమదోపిడి వంటి విషయాలుండేవి. దొరల కాలంలో మునసబు, కరణాల స్థానంలో తిరుపతి నాయుడు, తవిటి నాయుడు, రామునాయుడు వంటి దళారీలు ప్రవేశించారు. కులం వెనుకబడింది, ఎవరూ తమ కులాన్ని వదులుకోవడానికి గాని, ఇంకొక కులాన్ని కలుపుకోవడానికి గాని సిద్ధంగా లేరు. కులం రాజకీయ పెట్టుబడిగా ఒక విలువను పెంచుకుంది. ఇప్పుడు కులం ఒక ఆస్తి. అనేక కథల్లో కులాల కుమ్ములాట ఉండదు. ఇప్పుడు పల్లెకైనా ప్రజకైనా ఒక కట్టుబాటు లేదు. ఆడ, మగ మధ్య ఉండే సంబంధాలు ఎటు తిరిగి ఎటు పోయినా ఎవరేం అంతగా పట్టించుకోవడం లేదు, అసలెవరికీ అది పట్టించుకొనేటంత తీరిక లేదు. తోవ ఎటువంటిదైనా డబ్బు సంపాదించడం ఒక్కటే ఇప్పటి నీతి, వ్యాపారం అనే విషం నరునకు నిలువెల్ల ఎక్కింది, 'అన్నీ అందరికి' అన్న విధానాన్ని ధిక్కరించి 'అంతా నా ఒక్కడికే' అన్న వ్యాపార సూత్రం మీద నడుస్తుంది. దొరల కాలం.

ఒక దొర పల్లె నేరాలని చెయ్యగలిగిన దుర్మార్గమంతా చేస్తున్నాడు. ఊరి ప్రజలనందరినీ బుక్కా పకీర్లను చేసి పట్టణాలకు వలసపోయేలా చేస్తున్నాడు. పోలీసులలో మాత్రం మార్పులేదు. వాళ్లు బుగతల కాలంలో బుగతల్నెలా కొమ్ముకాసారో దొరల కాలంలో దొరలకీ అలాగే కొమ్ము కాస్తున్నారు. దొరల కాలం వచ్చేటప్పటికి

పల్లెలో రెండు తరాలు కనిపించాయి. అతను పశువును, మట్టిని, మమతను ఒదులుకోలేక మధన పడుతూ ఉసురు రాలేకాలంలో ఊరును విడవలేని పాతతరం ఒకటి. కమికెడన్నం పెట్టని వృత్తినీ, ఊరునీ వదులుకొని మమతలన్నీ తెంపుకొని తాను, తన భార్య, తన బిడ్డలు వేరుపడి ఎక్కడ అన్నం దొరికితే అక్కడికి వలసపోయే తరం ఇంకొకటి. నరసింహులు ఉలి, బాడిద వదిలి తాపీ చేత బట్టి పార్వతీపురం ప్రక్కన ఉన్న నరిసిపురానికి నడిచిపోవడం, వీరాచారి ఉలి, బాడిద పట్టిన చేత్తో తాపీ పట్టలేక పట్టెడన్నం పెట్టలేని ఆసరసాలలో పాతుకుపోవడం ఇలాంటిదే నక్కు నాగలి కాడి పలుపులు మేకులు వదలుకొని మందుల కంపెనీలో పనికి కుదురుకొని భార్యను, బిడ్డను హైదరాబాదుకు బలి ఇచ్చి కొన ఊపిరితో పల్లెకు చేరుకున్న నారాయణ కథ ఇందులో ఇంకొకటి. మడిచెక్కలు కాపాడుకోవడం కోసం హైదరాబాదు వలస పోయినా అక్కడ తన భార్య మాన మర్యాదలను కాపాడుకొనే మార్గం లేక పల్లెకు తిరిగి వచ్చిన వరహాలునాయుడు కథ ఇంకొక తీరు. పల్లె కథల్లోని అత్తాకోడళ్లు, వదినె మరదళ్లు, ఇరుగుపొరుగమ్మల "ఇకటాల సొగటాలు'' అన్నీ పల్లెలో మానవతా సంబంధాలతో పాటు కుటుంబ సంబంధాలు కూడా గాయపడిన తీరు తెన్నులను విశదం చేస్తాయి. బతుకు ముందు మానవత్వమే కాదు బంధుత్వం, పేగుబంధం, రక్తసంబంధం అన్నీ ఓడిపోతున్న గొడ్డు కాలమిది. సీతమ్మవారి పేరంటాల గుండం, నాగులచవితి, నాగళ్ల పూజ – ఇలా పల్లెలోని విశ్వాసాలెన్నో వ్యాపారపు గునపం పోట్లకు మట్టిలో కలిసి పోతున్నాయి. శ్రమ ఏ రూపంలో ఉన్నా దోపిడీ చెయ్యడం వ్యాపార లక్షణం, అందుకే జముకుపాట కూడా దోపిడికి గురయింది. పాట కట్టినవాడు, వరసకూర్చినవాడు, గొంతెత్తి పాడిన వాడు పట్టెడన్నం లేక అడుక్కు తింటు ఉంటే ఆ పాటే వ్యాపారికి లక్షలు కుమ్మ రిస్తూంది. ఇదంతా దొరలనాటి పల్లెకథ తీరు.

శ్రీకాకుళ రైతాంగ పోరాటం పేరుతో నాలుగు దశాబ్దాలుగా పోరుబాటలో నలిరేగిన నేల నాగావళి ఒడ్డునే ఉంది. ఒకప్పుడది నెత్తురుటేరు. ఆ నేలంతా ఎర్రగడ్డ, సన్నాయి లాంటి మంచెనెక్కి పిట్టల్ని తోలుకొనే పసివాళ్లకు తుపాకి అక్కడ ఆట వస్తువయింది. పోరుబాటలో మలితరం నడుస్తుంది. రాజ్యానికి, ప్రజల రాజ్యానికి మధ్య పొగ

— — — — — * * * — — — — —

**నాగావళి ఒడ్డునున్న పల్లెకు, పంట భూములకు ముంపు వచ్చింది. అది జలయజ్ఞం కారణంగా వచ్చిన ముంపు మాత్రమే కాదు. అలవి మారినది, అవసరం లేనిది, అనర్థం కలిగించేదీ అయిన ఆధునిక నాగరికత అనే ముంపు, వ్యాపారం, నిర్లక్ష్యం, అవ్యవస్థ కలగలిసి మసిపూసి మారేడు కాయగా చేసిన విద్యా వ్యవస్థ వల్ల కలిగిన ముంపు**

— — — — — * * * — — — — —

రాజుకుంటూనే ఉంది. ఒక పల్లెతల్లికి ముగ్గురు కొడుకులున్నారు. ఒక కొడుకు మిలిటరీలోకి వెళ్లాడు, ఒక కొడుకు పోరుబాట పట్టాడు, పెద్ద కొడుకు వ్యవసాయం చెయ్యలేక పట్టణానికి వలస వెళ్లాడు. ఆ తల్లి వలస వెళ్లిన కొడుకు కోసవే బెగ్గిలి పోయింది. వలసపోవడం పల్లెకు ఎంతటి పీడగా మారిందో ఈ కథ చెప్తుంది. పశువులు తాగడానికి నీరు లేదు, మేతకు బీడు లేదు, దున్నడానికి పొలం లేదు."కడుపున పుట్టిన బిడ్డొకటి దొడ్డన బుట్టిన గొడ్డొకటీనా" అంటూ పశువును ప్రాణంగా చూసుకునే కాపు తన చేత్తోనే తన పశువును కబేళాకు పంపిస్తున్నాడు. పల్లె కూలీలను పొగాకు కట్టలు పొట్టన బెట్టుకొంటే పట్టణ కార్మికులను మందుల కంపెనీలు మట్టుపెడుతున్నాయి. ఎటు చూసినా విషమే. ఒకప్పుడు మూటకు విలువ. ఇప్పుడు మాటకు విలువ. పోరుబాటలో నడిచిన పోటుబంట్లు మనుమలను రాచబాటకు మళ్లిస్తున్నారు. ఇది నాగావళి ఒడ్డునున్న పల్లెకథ.

నాగావళి ఒడ్డునున్న పల్లెకు, పంట భూములకు ముంపు వచ్చింది. అది జలయజ్ఞం కారణంగా వచ్చిన ముంపు మాత్రమే కాదు. అలవి మారినది, అవసరం లేనిది, అనర్థం కలిగించేదీ అయిన ఆధునిక నాగరికత అనే ముంపు, వ్యాపారం, నిర్లక్ష్యం, అవ్యవస్థ కలగలిసి మసిపూసి మారేడు కాయగా చేసిన విద్యా వ్యవస్థ వల్ల కలిగిన ముంపు – ఇలాంటి ముంపులెన్నో ఇప్పుడు పల్లెను, పంట భూమిని ముంచి కాలగర్భంలో కలిపేస్తున్నాయి. గుంప సోమేశ్వరుడి యాత్రకు వచ్చిపోయే వారికి మజ్జిగ, ఉసిరికాయలు అందించి, ఆదరించిన పల్లెలలో ఇప్పుడు మంచినీళ్లు ఇచ్చే దాతలు లేరు. నీళ్లపొట్లం కొనుక్కోవాలి. నాగావళిలో నీటికి బదులు రాయఘడ పేపర్‌మిల్లు విడిచిన మొలాసిస్ మాలిన్యం పేరుకు పోయింది. తనకు లోకానికి పొత్తు కుదరని అయ్యవారు ఉరిపోసు కొంటున్నాడు. "పొలిటికల్ రాజకీయం" ఒక వీధి మనుషుల్ని ఇంకో వీధిలో అడుగుపెట్ట నీయకుండా చేస్తుంది. బలరామనాయుడనే కాపు నలమహారాజై శిబిచక్రవర్తై, ధర్మరాజై హరిశ్చంద్రుడై పల్లె వదలి తన మానము, ధనము, ప్రాణము అన్నీ వదిలి వలస పోతున్నాడు. అది తెలంగాణం కావచ్చు, రాయలసీమ కావచ్చు, కళింగం కావచ్చు. పల్లెబ్రతుకు లిలాగే ఉన్నాయి. అయినా ఏ పల్లె కథ ఆ పల్లెదే. ఎక్కడి కథ అక్కడే పుడుతుంది. దానిని ఆ మట్టి మీద పుట్టిన వాడే చెప్పాలి. ఆ నోటితోనే చెప్పాలి, ఏ నోట పడితే ఆ నోటితో పలుకకూడదు. పల్లె నీడనివ్వని పందిరిగా మారిన బతుకు పోరులో బడలిక తీర్చే చలువ పందిరిగా తన కంఠంతో ఊరట కల్పించి పల్లెకు కొత్త సత్తువ నివ్వడానికి కలమెత్తిన నాగావళి నల్లబిడ్డ గౌరునాయుడు, 'ఏటిపాట' కావచ్చు. 'ఒక రాత్రి రెండు స్వప్నాలు' కావచ్చు. ఆ సంపుటాల్లోని ఏ కథను ఎత్తి చదివినా నాలుగు దశాబ్దాల నేపథ్యంతో ఇప్పుడు నడుస్తూన్న బతుకుపోరు పల్లెతీరు అందులో కనిపిస్తుంది.

ఒక చేత్తో తుపాకి, ఇంకొక చేత్తో కలం పట్టుకొంటే గానీ ఈ ప్రాంతమంటే ఏమిటో ఇతర ప్రాంతాల తెలుగు వారికి తెలిసిరాలేదు. తుపాకి చప్పుళ్లు తగ్గిపోయినా అంతకంటే బలంగా కలం పోటు ఇప్పుడు ఇక్కడ కలవరం పుట్టిస్తుంది. కడతేరిపోతున్న ఒక వర్గంలో కలకలం రేకెత్తిస్తుంది. వర్తమానం ఉటోపియా, భవిష్యత్తు ఇథియోపియా అని గొంతెత్తి కేకపెడుతుంది. ఈ నేల ఇంకొక సోమాలియా, సూడాన్, ఇథియోపియాలుగా మారకుండా ఉండే మంత్రోపదేశం చేస్తూంది. తన పొలంలో తానే కూలివానిగా మారుతున్న కాపు దిగులు తీర్చడానికి నడుం కడుతుంది. నేలలో ఇంకిపోయిన నాగావళి తరగల చప్పుళ్లా నేల నాలుగు చెరగువా పెల్లుబికి హోరెత్తేలా చేస్తుంది. కనిపించని శత్రువును కడతేర్చే శబ్దవేధి గౌరునాయుడి కథ.

నాగావళి ఒడ్డునున్న దళాయిపేటలో గౌరునాయుడు పుట్టాడు. నాయుడు స్మృతులు మధురమైనవి. అనుభవాలు చేదైనవి. తండ్రి – నాయనమ్మ – జానపద గాయకుడు పైడయ్య, జానపద కథకుడు తమ్మయ్య, గురువు సత్యం – ఇలా

ఎందరో బాల్యంలోనే నాయుడికి కళాభిజ్ఞత కలిగించారు. జానపద కథకుడిగా, కవిగా, గీత రచయితగా, గాయకుడిగా నాయుడు ఎదిగి రావడానికి ఇదంతా భూమిక అయింది. కొండ అంచున అడవి గుమ్మంలో పుట్టి పెరిగిన కారణంగా నాయుడి కథకు మొదటే కొండగాలి సోకింది. అడవి సెగ అంటింది. భూషణం మాష్టారుతో భుజాలు రాసుకొని, కారా మాష్టారితో కత్తు కలిపిన కథ అతడిది. అందుకే ఆ కథను చూస్తూ ఉంటే నేతి మెరుగు పెట్టిన ఇతడి కట్టిబండిలా కనిపిస్తూ ఉంటుంది. తడిమి చూస్తే కట్లు పుటికిన గాదె తల్లి ఎముకల స్పర్శలా తగులు తూనే ఉంటుంది. నోట పెడితే కుమ్ములో కాల్చిన తాటి తేగలా చవులిస్తూనే ఉంటుంది. పీలుస్తున్న కొద్దీ నాగావళి నీట తడిసిన మట్టి వాసన వేస్తూనే ఉంటుంది. వింటూన్న కొద్దీ గుంప సోమేశ్వరుని యాత్రకో గాయపడ్డ పైడయ్య జముకు పాట వినిపిస్తూనే ఉంటుంది. మనసులో దూరిన కొద్దీ బాధలేనిదే బ్రతుకు లేదని మొర పెడుతూనే ఉంటుంది. జానపద కథ లక్షణాలు గౌరునాయుడికి బాగా పట్టుబడ్డాయి. అందుకే అందులో విసుర్లు విరుపులు వంపులు ఒగ్గులు ఒజ్జబంతులు ఒడలు విరుపులు ఆకృతి – అల్లిక శిల్పము-తత్వము – ఇలాంటివేమీ కనబడవు. అక్కడక్కడ కథ ఒసిపినట్లు, జాగురిల్లినట్లు కనిపించినా వెంటనే సర్దుకొని నికార్సుగా నిటారుగా నడుస్తుంది. బావిలో దూకినవాడు నేల అందక దమ్ము చాలక ఉక్కిరి బిక్కిరిగా ఒక్కక్షణం కాళ్లు చేతులు కొట్టుకున్నా ఒడుపుగా ఒడ్డుకు చేరే లాఘవం ఈ కథల్లో ఒకటి రెండు చోట్ల కనిపిస్తుంది. విరసం కథా చట్రాన్ని పూర్తిగా విరిచి పారెయ్యలేకపోయినా సడలింపజేసిన కథకుడు గౌరునాయుడు. కథకు, కథకుడికీ గుండెకోతే, అందుకే ఆ కథ రంగు, రుచి, వాసన నిడివి అంతా అచ్చం గౌరునాయుడి లాగే ఉంటుంది.

మధ్య తరగతి తెలుగు కథ కొంచెం ముందు వెనుకలుగా పుట్టాయి. మధ్యతరగతిలో పుట్టిన తెలుగు కథ పల్లెపట్టు చేరుకోడానికి, ఆ తరువాత ప్రాంతీయతకు కట్టుబడి ఉండడానికి చాలాకాలం పట్టింది. ఏ వర్గానికి చెందినవాడు ఆ వర్గం కథ రాయాలన్న ఆలోచనతో పాటు ఏ ప్రాంతానికి చెందినవాడు ఆ ప్రాంతం గురించి రాయాలన్నది తెలుగు కథా సాహిత్యంలో ఇటీవలి పరిణామం. అందుకే గౌరునాయుడు నాగావళి ఒడ్డునున్న కాపువారికి ప్రతినిధిగా

— — — — — * * * — — — —

**మధ్య తరగతి తెలుగు కథ కొంచెం ముందు వెనుకలుగా పుట్టాయి. మధ్యతరగతిలో పుట్టిన తెలుగు కథ పల్లెపట్టు చేరుకోడానికి, ఆ తరువాత ప్రాంతీయతకు కట్టుబడి ఉండడానికి చాలాకాలం పట్టింది. ఏ వర్గానికి చెందినవాడు ఆ వర్గం కథ రాయాలన్న ఆలోచనతో పాటు ఏ ప్రాంతానికి చెందినవాడు ఆ ప్రాంతం గురించి రాయాలన్నది తెలుగు కథా సాహిత్యంలో ఇటీవలి పరిణామం.**

— — — — — * * * — — — —

కథ అందుకున్నాడు. ఇప్పుడది కేవలం వలస కథ. ప్రతిరోజూ సాయంత్రం రాయగడ నుండి విజయవాడకు ఒక పాసింజరు రైలు నడుస్తుంది. అందులో ఏ బోగీలో చూసినా 'సెగ' నుండి 'ముంపు' దాకా ఉన్న కథలన్నీ కట్టగట్టుకొని ఉంటాయి. ఒక్కొక్క పల్లె ఒక్కొక్క బోగీలో ఉంటుంది. ఒకటి రెండు మడిచెక్కలున్న సన్నకారు రైతు నుండి పాతికెకరాల ఆ సామీల వరకు అందులో కనిపిస్తారు. కొందరు ఉన్న మడిచెక్కలను కాపాడు కోవాలని రైలెక్కితే మరికొందరు అన్నీ వదలుకొని అజ్ఞాతవాసానికి తరలిపోతూ ఉంటారు. గోదావరి, కృష్ణాజిల్లాలకు, హైదరాబాదు, చైన్నె, సూరత్ లాంటి పట్టణాలకు వలసపోయినా వీరందరూ అక్కడ ఒక చోట చేరి ఒక కాలనీగా మారి ఆ కాలనీకి తమ ఊరి పేరు పెట్టుకుంటూ ఉంటారు. ఏ దొరలు తమను వలస పక్షులుగా చేసారో ఆ దొరల నేలకే కూలీలుగా పోతారు. దేవాంగుల బల్లయ్య, కుమ్మరి పెంటయ్య, కంసాలి వీరాచారి, కాపు శ్రీరాములు నాయుడు క్రమంగా వలస పక్షులయారు. బంగారు నాయుడు, ఫకీరు నాయుడు, పేటలోని అచ్చయ్య, ఆదినాయుడు, నారాయణ, బలరామ నాయుడు, సన్నాయి, వరహాల నాయుడు – ఇలా ఎవరెవరూ ఎలా వలస పక్షులయారో చెప్పడమే గౌరునాయుడు కథకు లక్ష్యం. 'సన్నాయి' అనే బాలుడు పోరుబాట వదలి రాచబాట పట్టడం కూడా వలసపోవడం కిందే చూపించాడు కథకుడు, ఇందులో ఏ కథకూ గౌరునాయుడు చుక్కాని పట్టడు. వ్యాఖ్యాతగా వ్యవహరించడు. తన కళ్లజోడు తగిలించడు. తిరుపతి నాయుడు, తవిటి నాయుడు, రాము నాయుడు వంటి దళారులు దొరల సెగ సంకటాన్ని అంటించుకుని ఊరంతటికీ అంటించడానికి చేసే ప్రయత్నంలో కూడా కథకుడి జోక్యం కనిపించదు.

కథ చెప్పాలంటే చాలా తెలియాలన్నారు. పెద్దలు, ఇది గౌరునాయుడికి చాలా మంది కథకుల కంటే బాగా తెలుసు. కథ ఎలా ఉండకూడదో కూడా తెలుసు. పాత్ర, వర్ణన, సమస్య, వాతావరణం, సంభాషణ, సన్నివేశం, సందేశం ఇవేవీ గౌరునాయుణ్ణి దారి మళ్లించవు. మెలకువకు నిద్రకు మధ్య దారి తప్పిన కలలాంటి తన కథను కళగట్టించే నేర్పు ఒకటి అతనికి పట్టుబడింది. మరీ అవసరమైనప్పుడు దాని కళ్లెం కొంచెం బిగిస్తాడు, ఆ సరసాలలో వీరాచారిని, సెగల బంగారు నాయుడి కోడల్ని, 'భూమిపుండు' లో ఆదినాయుణ్ణి, 'ముంపు'లో వరహాలనాయుడు పెళ్లాన్ని చదివిన వారికి గౌరునాయుడి కథ అంటే ఏమిటో తెలుస్తుంది. ఆ సరసాల ప్రపంచభాషలో ఏ భాషలోకి అనువదించినా తెలుగు కథ సత్తా ఏమిటో చాటి చెప్పగలదు, సెగ, నాణెం కింద చీమవంటి కథల ముగింపులో మాత్రం గౌరునాయుడు విరసం ముద్ర వేసి సంతకం చేసినట్టు కనిపిస్తుంది.

కథకుడిగా పుట్టి కవిగా ఎదిగి గేయరచయితగా పరిణితి చెందుతున్న సాహిత్యకారుడు గౌరునాయుడు, కథ కేవలం కథగా ఉంటుంది. లేదా కవిత్వంతో నిండి ఉంటుంది, లేదా పాటలా సాగిపోతుంది. ఇందులో ఏదైనా మేలే, కానీ ఇందులో ఏ ఒక్క లక్షణమైనా ఇంకొక లక్షణంతో కలిస్తే ఏదో వికృతి వెంట నడుస్తూన్నట్లు ఉంటుంది. గౌరునాయుడు ఈ లక్షణం నుండి తన కథను కాపాడుకోగలిగితే ఎన్నదగిన కథకుడుగా నిలుస్తాడు. 'ఆర్తి', 'ఒకరాత్రి – రెండు కలలు', 'జీవన్మతులు' వంటి కథలు మారట నోటితో పలికినట్టు ఉంటాయి. ఇందులో నాగావళి మట్టి వాసన సోకదు. ఇవి పల్లె కథలుగా కాక ప్రయోగవాదంతో కూడిన ఆధునిక కథలుగా కనిపిస్తాయి. అందుచేత ఇవి మంచి కథలే అయినా ఈ సంపుటిలో చేర్చదగినవి కావు. 'జీవన్మృతులు' వంటి శీర్షికలకు బదులుగా "నడపీనుగలు' వంటి శీర్షికలను కథకుడు ఎంపిక చేసుకోవలసి ఉంటుంది. 'అరువుసొమ్ము బరువు చేటు', అన్న సామెత గౌరునాయుడికి గుర్తువస్తే 'జీవన్మృతులు' కథ శ్రీశ్రీ బరువులతో నిండి ఉండేది కాదు, శ్రీశ్రీ మనకు ఆరాధ్యుడు కావచ్చును, కథకు బరువు కాకూడదు, గౌరు నాయుడు కథ అంటే "ఇలపింటి మొగుణ్ణి ఇలమీద సూణ్ణేరు" అన్నట్టు ఉండాలి, అటూ ఇటూ ఒసలకూడదు.

## దీర్ఘ కవిత



# అందని చందమామ

డా॥ కాసుల లింగారెడ్డి

(9)

ఇనుప బోనులో మనిషిని పెట్టి
మరణం కోసం వేచి చూడడం ఎంత దౌర్భాగ్యం?
దరిద్ర దేవత నెత్తిమీద కూర్చుంటె
చెత్తకుప్పల వెంట, కుక్కల కోట్లాట-
'సుజలాం, సుఫలాం' గొంతు చించుకుంటున్న వీధుల్లో
సంపూర్ణ స్వేచ్ఛ ఊరి కుక్కలకే-
ఐదేళ్ళకోసారి మొరిగే ఊరకుక్కలకే
'భారత భాగ్య విధాతల'కు
కుక్కకాట్లు
చెప్పు దెబ్బలు-
ఎయిరోఫోబియా, హైడ్రోఫోబియా
హండ్రెడ్ పర్సెంట్ మోర్టాలిటి డిసీజ్ రేబిస్-
కెమెరా కన్నుతో బొడ్డులో తృప్తిని వెదుక్కునే జాతికి
బొడ్డు చుట్టూ పొడిపించుకునే సూదుల్లోనే మోక్షం-
అనుకోని అతిథి
ఆహ్వానం లేని అతిథి
కనురెప్పల తలుపుల్ని తోసుకుని
కంటి గడపల్ల కాలువెడ్తె
ట్రకోమా అసలు సిసలు అంధత్వానికి చిరునామా-
కాటుకదిద్ది సింగారించిన నేత్రసౌధం దర్వాజా
జీవితకాలానికి లాకయిపోతుంది-
అంధత్వ నివారణ పథకం
తుప్పుపట్టిన గ్రామఫోను-
అధికారుల పాలిటి ఎవ్వీటైం మనీ-
పశుపోషణ చేసే జాతికి
పరిసరాలు మరణశాసనం-
నేలలో మిగిలిన విత్తనం
నాడీమండలంల మొలకలు వెడ్తది-

ఒక గాయం, ఒక ప్రసవం
ఒక మాయ
చెవిలో జోరీగ
ధనుర్వాతం కండరాల కాటేస్తది-
ఊడిపోయిన బొడ్డుమీద
పెండద్దే అనాచారం
టెటనస్ నియోనాటోరమ్
ఎనిమిది దినాలకు నిండు నేరేళ్ళు-
రోడ్డు పొడుగునా గిద్రల, పీటమీద
బిచ్చమెత్తుతున్న మొండిచేతుల జాతి-
దేవుడి కోపమో
అదుక్కొచ్చుకున్న శాపమో
గతజన్మ ఫలప్రదానమో
కట్టుకథల మంత్రజాలంతో
పీడితుల సంఘబహిష్కరణ-
కార్యకారణ సంబంధాల విశదీకరించి
మైకోబాక్టీరియమ్ లెప్రెని బహిర్గతపరిచి
ఒకటింపావు శతాబ్దం కరిగిపోయినా
కోటానుకోట్ల ప్రాణాలు ఒరిగిపోయినా
లెప్రసీ మిషన్ శతాబ్దాల మైలురాళ్ళు దాటినా
వందల సంస్థలు మందుల మెరుపులు విరజిమ్మినా
అర్థశతాబ్ది కుష్ఠురోగ నివారణ
రజతోత్సవ కుష్ఠురోగ నిర్మూలన
కొడిగట్టిన దీపాలు
కొండెక్కిన జనం ఆశలు-
Health for all by 2000 Ad
ఒక అందని చందమామ

కథ

# బీభత్సం



**హైదరాబాదు మహానగరం అబిడ్స్ సెంటరు, చీకటిపడింది. ఆకాశం నుండి లాక్కొచ్చిన నక్షత్రాలను ఎత్తైన స్తంభాలపై అతికించినట్లు కాంతిపుంజాల్లా వెలిగిపోతున్నాయి వీధిలైట్లు. అల్లాఉద్దీన్ అద్భుత దీపాలతో అలంకరించినట్లు విలాసమైన షాపులు వింత దర్బారుల్లా మాయాబజారుల్లా ధగధగ లాడుతున్నాయి.**

**చక్రపాణి**

రద్దీగా ఉన్న రోడ్డు మధ్య చిన్న పార్కు. పార్కులో ఎత్తైన దిమ్మపై శాంత గంభీరంగా నిలుచుని లోక శాంతికై కపోతాన్ని ఎగుర వేస్తున్న నెహ్రూజీ విగ్రహం, మెడలో పూల దండలు, ఆ ప్రక్కనే జాతీయ పర్వదినాల్లో విగ్రహాలకు దండలు వేయడానికి ఉపయోగించే అల్యూమినియమ్ నిచ్చెన స్టాండు.

ఆ విగ్రహానికి కేఫ్ ముందర రోడ్డుకు ఫుట్‌పాత్‌కు హద్దుగా నాటిన ఇనుప రెయిలింగును ఆనుకుని నిలుచుని ఉంది ఓ స్త్రీ. చింపిరితల, జిడ్డుకారుతున్న ముఖం, లోతైన కనుగుంటల్లో మినుకు మినుకు మంటున్న ఆశతో జనంలోకి చూస్తోంది. చిరుగుల బట్టల పోగులను వంటికి చుట్టుకుని తన మానం కాపాడుకోవటానికి  ఓ ఆచ్చాదన ఏర్పాటు చేసుకొంది.

చెత్తకుండి పురుడు పోసిన ముక్కుపచ్చలారని పసి కందుని అరచేతుల్లో దాచుకుని గుండెలకు అదుముకుంటూ అటూ ఇటూ చూస్తోంది. దీనాతిదీనమైన ఆమెను చూస్తే ఎవరికైనా జాలివేయాలి కాని జాలిగుండె ఉన్నవారందరూ ఆమెను చూడకుండానే దాటి వెళుతున్నారు.

సమయం గడుస్తున్న కొద్దీ ఆమెలో కలవరం హెచ్చసాగింది. కాలే కడుపుతో నిలుచున్నప్పుడు ఎప్పుడు ఇంతసేపు ఎదురు చూడలేదు. కడుపులో జీవపదార్థం పెరుగుతున్నప్పుడు అంతగా పడిగాపులు కాయలేదు. పసిబిడ్డ తన ఒడిలో ఉంటే తన దగ్గరికి ఎవరూ రారేమో అని అనుమానం రాసాగింది. ఈ మహానగరంలోని తనలాంటి దానికోసం కూడా వచ్చేవారు ఒక్కసారిగా మంచివారుగా మారిపోయారా అని ఆమెకు భయం వేయసాగింది. గుండె ఝల్లుమంది.

అయినా ఏదో నమ్మకం....

ఈ లోకం తనకు బాగా తెలుసు. తను గుర్తుపట్టగల ఈ ముఖాల కోసం పరి పరి విధాలు పోతూ చూడసాగింది ఆమె...

ఆమె...

అక్కరలేని తప్పుడు గర్భమో

విచ్ఛిత్తికి వీలు కాని కక్కుర్తి కలయికో

భారతాన ఆడబిడ్డంటే వివక్షో
వంశాంకురమన్న మగబిడ్డపై ఆపేక్షో
ఒక చీకటి రాత్రిన
రక్తపు మరకల వస్త్రపు మడతలో
చుట్ట చుట్టుకుపోయింది ఆమె పుట్టుక
మోరీలోకి విసిరివేయ బడింది ఆడజన్మం
మట్టి కొట్టుకుపోయింది వీధిలో బాల్యం
కొల్లగొట్టుకపోయింది మొగ్గలో యవ్వనం.

అయినా ఏరీ... వారందరూ. ఒక్కరూ రారేమి. ఈ మహా నగరపు అరుగులపై ఫుట్‌పాత్‌లపై చల్లని చీకట్లలో ఆకలి రాత్రుళ్ళలో తన బ్రతుకును తూట్లు పొడిచి నాలుగు డబ్బులు పారేసి పోయిన వారందరు ఏరి. పబ్లిక్ పార్కుల్లో, రైల్వేయార్డుల్లో, రైలు డబ్బాల్లో ఒంటరిగా, సామూహికంగా తనపై లైంగిక విన్యాసాలు, ఆంగిక అత్యాచారాలు జరుపుతూ కాలే కడుపుకు కాసిని డబ్బులు వేస్తూ ఆదుకుంటూ వస్తోన్న ఆ బాబులేరి.... అందరూ మంచివారుగా మారిపోయారా.



కార్లల్లో తిరిగే ధనికులు, కోట్లు వెనకేసుకు బీదలకు హామీలిచ్చే నాయకులు, కెమేరాల ఫ్లాష్ ముందు చప్పట్లహోరులో వేదికలెక్కి అవార్డులందుకునే సంస్కర్తలు, దేవుడి హుండీలో గుప్తదానం చేసేవారు, గుళ్ళముందరి బిక్షగాళ్ళకి ధర్మం వేసేవారు ఆమె ఆకలి మంటలకు చలించరు.

అడవిలో దారి తప్పిన మృగాల మధ్య చిక్కుకు పోయిన కుందేలు పిల్లా దిగాలు పడిపోతూ కళ్ళ నిండిన దుఖంతో గొంతు నిండిన కన్నీటితో అంతటి జనారణ్యంలో దిగులుగా ఒంటరిగా నిలుచుంది.

మొన్నటిదాకా నిండుగా బరువుగా సృష్టిలయతో కదలాడిన ఆమె కడుపులో ఆకలి మంటల దావానలం కార్చిచ్చులై భగ భగ మండుతోంది. సొమ్మసిల్లి తూలి ఫుట్‌పాత్ రెయిలింగ్ కమ్మీకి చేరగిలపడింది, ఇంతలో...

పొట్టిగా స్థూలకాయం ఆయిలు దాగులలో హాఫ్‌షర్టు, మోకాలు దాటిన ఖాకీ నిక్కరు, ముఖంపై, చేతులకు గ్రీజు మరకలు, కొబ్బరిపీచులా అక్కడక్కడా నెరిసిన జుట్టు, కాటుక కళ్ళు చిట్లించిన ముఖం, ఒక చేతిలో పాతపాంటుతో కుట్టిన చే సంచి, మరో చెయ్యి జేబులో దూర్చి నింపాదిగా ఆమెకు ఎదురుగా నిలుచున్నాడు. ఆపాద మస్తకం పరీక్షిస్తూ తలవంకిస్తున్నాడు.

ఆమె అతన్ని చూసింది... ఆ చూపులను గుర్తించింది. జారిన దవడల్లోంచి కిసుక్కున నవ్వాడు అతను.

ఆమెకు ఆశతో ప్రాణం లేచి వచ్చింది. ఒక్క అడుగు ముందుకు వేసింది.'కిసుక్కున' నవ్వాడు... 'వత్తావా' అడిగాడు.

'వస్తాను' అన్నట్లు తల ఊపింది. డబ్బుల కోసం చేయి చాచింది

ఐదు రూపాయల నోటును చేత పట్టుకుని ఆమెకు ఇవ్వబోతున్నట్టుగా ముందుకు చాచాడు.

ఆమె నోటును అందుకోబోయింది.

దొంగాట ఆడుతున్నట్టు గబుక్కున నోటును జేబులో పెట్టుకున్నాడు, 'కిసుక్కున' నవ్వాడు.

ఆ నోటు తీసుకుని ఏదన్నా కొనుక్కుని ఆకలి తీర్చుకోవాలని ఉబలాట పడింది. ఈ సృష్టి అంకురానికి జీవధారలు అందించే పాల ధారలు ఆకలి మంటల భగ భగలకు ఆవిరై, గుక్కెడు పాలు లేక తన బిడ్డ నక నక లాడుతోందని చెప్పాలనుకుంది. ఎలా చెప్పగలదు మాటలు రావు పదాలను కూడబలుక్కోలేదు. వీధి బాల్యంపై మగ పంజా జరిపిన అమానుషానికి మ్రాన్పడిపోయింది. ఆమె మస్తిష్కం. అర్ధనగ్నంగా చిరుగుల పోగులతో పిచ్చిదానిలా వేదాంతిలా నవ్వుకుంటూ తిరుగుతూ నాంపల్లి స్టేషను కాడ. రూపాయా పావలానా తెలీదు ఆఖరికి కూల్‌డ్రింక్ సీసాల మూతల్ని సైతం ఆమె మానానికి వెలగా పడేసి వెళ్ళారు.

పాతుకుపోయిన రాయిలా నిలుచున్నాడు బెట్టుగా చూస్తున్నాడు

తల ఊపింది తన వెంటే రమ్మని సైగ చేసింది అడుగులో అడుగువేసుకుంటూ రాకాసి బాకాల్లా 'బొయ్ బొయ్' మంటూ వెళుతున్న కార్లను బస్సులను తప్పించుకుని రోడ్డు దాటింది. బిగ్ బజార్ వైపు బిగ్‌బజార్ పక్కషాపుల్ని కూల్చేసి పెద్ద షాపింగ్ మాల్ నిర్మాణం సాగుతోంది.

ఎత్తయిన వాసాలు నాటి వాటికి తడికలను కట్టారు మరుగుగా. కూలీలు చాయ్, బీడీలకు, పాన్ గుట్కాలకు బయటకు రావటానికి తడికకు మనిషి దూరే అంతటి కన్నం. ఆ కన్నం నుంచి అవతలకు వెళ్ళింది.

తడికలకు అవతలి వైపున చీకటి లోకంలా ఉంది ఇసుక రాశులు కంకర గుట్టలు ఇటుకల వరుసలు పోసి ఉన్నాయి. పెద్ద పెద్ద కందకాల నుండి పైకి లేస్తున్న పిల్లర్లు రాకాసి పుట్టగొడుగు అంగళ్ళా ఉన్నాయి.

కూటికోసం పగలంతా శ్రమించిన కూలీలు నిష్క్రమించారు. కూటికోసమే పరిశ్రమించటానికి, నిర్మానుష్యంగా స్తంభించిన నిశ్శబ్ద చీకటిలోకి, పురిటి కందుని హృదయానికి హత్తుకుని కరకు లోకపు కాఠిన్యాన్ని తలుచుకుంటూ కనుగుడ్లలో నిండిన కన్నీటిని చీల్చుకోజాలని, చూపులను సారించి గుచ్చి గుచ్చి చూస్తోంది, చదునైన నేల కోసం. తడికల సందుల్లోంచి చీకటిలోకి ప్రసరిస్తున్న వీధిలైట్లు వెలుతురులో అతను వంకర టింకరగా తూలుతూ వస్తుంటే, అతని వక్రించిన నీడ అతని కంటే పెద్దదిగా రాకాసి బల్లిలా వెనక్కు ముందుకు సాగుతుండగా, ఆమెకు దగ్గరగా చేరుకున్నాడు. కళ్ళలోకి చూస్తూ ఆమె రెండు భుజాలు పట్టుకుని ఊపాడు. ఆమె పచ్చి దేహపు నవనాడులు జివ్వుమన్నాయి. ఈ చిన్న తాకిడికే తట్టుకోలేని బాలింతదేహం చింత నిప్పుల్లా కాలుతున్న, అతని దెయ్యపు కళ్ళ వెనక రేగుతున్న మంటల కోర్కెలను తలుచుకున్న ఆమె గుండెలు జారిపోయాయి.

నెమ్మదిగా అతని ఉడుంపట్టు విడిపించుకుని తల పంకించింది. ఇసుకలో తన బిడ్డను పడుకోపెట్టింది. చేరువలో తనూ వెల్లకిలా పడుకుంది. తన ఆకలి తీర్చుకోవటానికి ఇతరుల కోర్కెలు తీరటానికి ఈ 60 సంవత్సరాల స్వతంత్ర భారతదేశం ఆమెకు చూపిన ఏకైక మార్గాన్ని అతనికి చూపింది. అతను ఆమె పక్కనే మోకరిల్లాడు.

సారా తాగి సిగం ఊగే ఉన్మాదిలా నల్లమందు మింగి మంటల్లో నడిచే మాయగానిలా నరబలిని సమకూర్చుకున్న మాయల ఫకీరులా 'కిసుక్కుమని' తెరలు తెరలుగా నవ్వుతూ ఆమె వంటి పైన చిరుగులను వలచబోయాడు.

అదిరి పడింది లేచి కూర్చుంది.

వద్దు బాబు అన్నట్లు బతిమాలుతూ చేతుల్ని అడ్డంగా ఊపింది. భంగపడిన మాంత్రికునిలా దిగ్గుమని లేచాడు. 'ఓస్ బోడిముండా నీలాంటోరు శానా ముందుండారు ఈ ఐద్రాబాదులో ఎంత టెక్కే నీయవ్వా' పోతాను అన్నట్టు చూస్తున్నాడు.

అంతటిపనికి ఒప్పుకోవద్దని ఆమె బాలింత దేహం హెచ్చరించింది. కాని ఆకలి, ఆమెలోని మాతృత్వంతో చేయి కలిపి పై తిరుగుబాటు చేసింది.

ఆశోకవనంలో అగ్ని పరీక్షకి ఒప్పుకున్న సీతలా తలపంకించి మానానికి చుట్టుకున్న చిరుగులను తొలగించుకుని ఉండలా చుట్టి పక్కనే పెట్టుకుంది. చేయి చాచింది ఐదు రూపాయిల కాగితం చేతిలో పడింది. వెన్ను చలిబారి వణుకుతుంటే వళ్ళు జలదరించుకుంటూ కళ్ళు మూసుకుంది.



ఐదు రూపాయల కాగితాన్ని ధైర్యంగా పట్టుకుని ఆ బిగువు ఆసరాతో తీరబోయే ఆకలిని, పక్కనే పడి వున్న బిడ్డను తలుచుకుంటూ అతని పిశాచపు చేష్టలను భరిస్తూ కంపిస్తూ ఇసుకలోకి కూరుకు పోయింది.

పీడకల నుండి మేలుకున్న పసిబిడ్డలా ఉలిక్కిపడింది. మెలకువ వచ్చి దుఃఖపు ఎక్కిళ్ళు వచ్చినై, రాక్షస రతిలో దేహం చిమ్మిన చెమటలో తడిసి బరువెక్కిన ఐదు రూపాయల కాగితం ఆమెకు ఈ లోకంలోకి నిలుచోపెట్టింది.

బిడ్డను ఎత్తుకుని గుండెలకు అదుముకుని నెమ్మదిగా క్రింద పడుకోపెట్టింది. తన చిరుగు బట్టల కోసం చూసుకుంది. పెట్టిన చోట లేవు. అటూ ఇటూ కలయగ చూసింది. కనిపించలేదు.

‘ కిసుక్కున నవ్వు ఆ చీకట్లో గుడ్లగూబ అరుపులా కీచుమంది. చూసింది అటువైపు.

దూరంగా పిల్లరుపై కూర్చున్నాడు. నోట్లో కాలుతున్న బీడీ ఎర్ర ఎర్రగా మండుతోంది. మంటల కీటకంలా గుప్పు గుప్పుమని పొగలు ఊదుతున్నాడు. అతని చేతిలో బంతిలా ఆమె చిరుగుల బట్టలు. ఆమె నవనాడులు కృంగిపోయాయి.

అయ్యా నా బట్టలు నాకియ్యి అన్నట్లు చేతులు చాచి సైగలు చేసింది.

అతను అడ్డంగా తల ఊపుతూ రాజ్యాలు గెలిచిన గజనీలా కిసుక్కున నవ్వాడు.

'ఏయ్ ముండా నా డబ్బులు నా కిచ్చావా సరి, లేదా నీ బట్టలు తీసుకుని ఉడాయిస్తా' అంటూ ఆమె చిరుగుల ఉండను చంకలో పెట్టుకుని వెళ్ళడానికి ఉద్యుక్తుడయ్యాడు.

ప్రకృతి చక్రం తన ఒంటినంతా రిగ్గులతో తూట్లు పొడుస్తుంటే సృష్టి ధర్మం నిర్వహిస్తూ మండుతున్న ఎర్రటి పిండం తన నుండి చీల్చుకొచ్చినప్పటి బాధ కంటే సర్వస్వం అదిరిపడి విలవిలలాడింది.

తన బట్టలివ్వనంటండా అంతోటి నరమేధానికి ఓర్చి సంపాదించిన డబ్బుని తన మానానికి ఫణంగా అడుగుతున్నాడా, అయ్యో…..

అచేతనంగా పడి వున్న బిడ్డను ఎత్తుకుని హృదయానికి హత్తుకుంది. గుండెనిండిన దుఃఖం ఆమె గొంతుకు గండ్లు పెట్టింది, గొంతెత్తి ఏడ్చింది. వరదలై పారుతున్న దుఃఖాన్ని ఎక్కిళ్ళ కట్టతో ఆపుకుంది.

బట్టలు లేకుండా జనంలోకి ఎలా వెళ్ళగలదు. ఇక్కడే ఉంటే ఆకలి ఎలా తీరేది చంటి బిడ్డను చూసుకుంది. వెళ్ళాలి కష్టమయినా మళ్ళీ సంపాదించాలి. ఐదు రూపాయల కాగితాన్ని అతనివైపు పడవేసింది. ఆ కాగితాన్ని అందుకున్న అతను ఎగిరి గంతేసాడు. ఆ చిరుగుల మూటను ఆమె మీదకు విసిరి కొట్టాడు. కాటేసిన కాలనాగులా కిస కిస నవ్వుకుంటూ బిరబిరని తడిక కన్నంలోంచి జనంలోకి కలసిపోయాడు. ఆకలిపోరాటంలో దగాపడి వంటికి దక్కిన గాయాలను మననుతో తడుముకుంటూ తనను తాను ఓదార్చుకుంది. చంటి బిడ్డను ఎత్తుకుని గుండెకు అదుముకుంది. త్వరగా చిరుగుల పోగులను చుట్టుకుని జనంలోకి వెళ్ళాలనుకుంది. ఆ ఉబలాటంలో బిడ్డను కిందపడుకోబెట్ట పోయింది.

ప్రాణం వీడిన చంటిబిడ్డ మృత కళేబరం మంచుఖడ్గంలా ఆమె గుండెకు చురుక్కుమని కాటు పెట్టింది. ఉలిక్కిపడింది. ముఖంలో ముఖం పెట్టి చూసింది. అటూ ఇటూ ఊపి చూసింది, చలనంలేదు, చెవి దగ్గరగా పెట్టుకుంది. ముక్కు దగ్గరగా పెట్టుకుంది. అనుమానంగా ముద్దుపెట్టుకుంది. ఆమెకు అర్థమయింది, ఆకలి చాచిన మంటల నాలుక తన బిడ్డ జీవాన్ని దహించుకుపోయిందని.

ఒక్కసారిగా గొంతెత్తి ఏడ్చింది, పిచ్చికేకలు వేసింది, పరిగెత్తింది, అడ్డం వచ్చిన ఇసుకను, ఇటుకలను తన్నింది. కాలి వేళ్ళు చిట్లిపోయి రక్తాలు చిమ్ముతుండగా గుండ్రంగా ఉరుకుతోంది. చేతిలోని బిడ్డను పైకి లేపింది. చిన్నబోయిన నక్షత్రాలకు చూపుతోంది. మూగబోయిన ఆకాశాన్ని అడుగుతోంది, అందని దిక్కులను పట్టుకుని నిలదీయాలని నలుదిక్కులా ఉరుకుతోంది. మొన్నటి దాకా తన గర్భకుహరంలో కదలాడుతూ చక్కిలిగింతలు పెడుతూ పిచ్చిమాలోకంలో బతుకుతున్న తనకు అర్థం కాని మాతృత్వపు మమకారాలు నేర్పిన బిడ్డ ఈ పాడులోకంలోకి వచ్చాకా ఎందుకిలా జీవచ్ఛవంలా నిశ్చలంగా అయిందో తెలియచెప్పమని గతి తప్పిన తాండవంతో గెంతుతోంది. ఒక్కసారిగా ఆగిపోయింది. గాయపడిన కాలి వ్రేళ్ళకు ఏదో తగిలింది. బంతిలా కదిలింది. చూసింది, తన చిరుగుల బట్టల ఉండ. ఒక్కసారిగా తూలింది తలలో పిడుగుపాటు… అంతదాక అక్కడ సాగిన ఈ దారుణ మానవ దానవ హోమాన్ని నరమేధాన్ని చూస్తూ మూగ సాక్షిభూతంలా వ్రేలాడిన అంధకారభాండం తాళలేక బ్రద్దలైంది. ఆమె చెవి గెడలపై కత్తులను కోస్తున్న కీచు ఘోషలు చూస్తోంది. తన చిరుగుల ఉండను ఒక్కసారిగా బా.. అంటూ ఏడ్చింది అయ్యో ఏముంది ఈ బట్టల్లో వీటి కోసమా తను అంతగా హింసపడి సంపాదించిన డబ్బును వదులుకున్నది. ఈ చిరుగుల కోసమా… కాదు… చిరుగులు కాదు..

మానం కోసం... ఎవరి మానం తన మానమా... పిచ్చి నవ్వు నవ్వింది. తనకు మానమా... కాదు కాదు... ఎవరి మానం చీకటి గుహల్లో ఎగిరాడుతోన్న గబ్బిలాల అస్తవ్యస్తపు ఆరాటంలా ఆమె ఎదలో ఎగిసి పడుతున్నాయి. ఉచ్ఛ్వాస నిశ్వాసల్తో... ఆలోచనలు...మానం... తను బట్టలు లేకుండా నడిస్తే ముఖాలు తిప్పుకుని ఎడ మొఖం పెడ మొఖాలు పెడుతూ జనాలు సిగ్గు పడతారనేగా... చంటి బిడ్డను ఎత్తుకుని ఇంతటి హైద్రాబాదులో నడిబజారులో నిలుచుని ఆకలికి కేకలు వేస్తే తోటి మనిషి ఆక్రందనలు ఆలకించకుండా శవాల దిబ్బలో సమాధుల్లా మిన్నకుండా పోయిన ఈ నాగరికుల సిగ్గుపోతుందనా తన మానం కాపాడుకుంది...ధూ... ధూ... పళ్ళు పట పట కొరికింది.

అగ్ని పర్వతపు బిలం తలాన కుత కుత ఉడుకుతున్న లావాలా ఆమె గుండెల్లో మండిన రక్తం కళ్ళల్లోకి ఉబికి చింతనిప్పుల్లా ఎర్రబారాయి. గుడ్లురుముతూ ఎడం కాలు ఎత్తింది. ఉండచుట్టుకు పోయిన చిరుగుల బట్టల మాటున దాగిన దగా చేసిన నాగరికతను ఒక్క తన్ను తన్నింది. పైకి ఎగిరి ఆమెకు కనిపించనంత దూరం పడింది నాగరికత.

అబిడ్స్ సెంటర్... ఎత్తైన దిమ్మపై నెహ్రూజీ విగ్రహం ప్రక్కనే విగ్రహాలకు దండలు వేసేందుకుపయోగించే నిచ్చెన స్టాండు.

ఆ స్టాండు పై ఓ నగ్న స్త్రీ నిలుచుని ఉంది. దేవతల అస్త్రాలను కరిగించి పోత పోసిన విగ్రహంలా వింత లోహపు వెలుగులతో సోడియం ఆక్సైడు వీధి లైట్ల కాంతిలో ధగ ధగ లాడుతోంది ఆ నగ్నదేహం. చుట్టూ ఇసక వేస్తే రాలని జనం ట్రాఫిక్ జామ్... వాగ్దానాల కూతలు కూస్తూ సైరన్ల మోతలతో చాంతాడులా వచ్చింది మంత్రి గారి కాన్వాయ్... జనాల మధ్యన కదలలేక ఆగిపోయింది. అందరూ ఆమె వైపు విస్మయంగా తలలు వంచుకు చూస్తున్నారు.

ఆమె చేతిలో మృతశిశువు. నిర్జీవంగా వ్రేలాడుతున్న కాళ్ళు చేతులు.. ఆ శిశువుని శివుని చేతిలో ఢమరుకంలా ఢమ ఢమ లాడిస్తూ త్రిప్పుతోంది. ఆకలికి ప్రాణం పోయిందిరా అంటూ సైగలు చేస్తోంది. చూడండిరా నా కాలే కడుపు... చూడండి నా వంటిపై ఈ రక్కులు గాయాలు లబ లబ లబని శబ్దం చేస్తూ ఛాతీని బాదుకుంటోంది. మీ కోసం మీ నాగరికత సిగ్గుపోతుందని, మీ మానం పోతుందని... తన మానం ఎంతగా గాయపడిందీ. చూపెడుతోంది. అంగాంగాలను ఎత్తి చూపెడుతోంది. మర్మం లేకుండా చుట్టూ తిరుగుతూ ఎద్దేవా చేస్తోంది ఒక్కొక్కరినే చూస్తూ... ధూ... ధూ... అంటూ ఛీ కొడుతోంది....

నెహ్రూజీ శాంతి కపోతాన్ని ఎగురవేస్తున్న భంగిమలో తన మృత శిశువుని కొడవలిగా ఎత్తి కళ్ళ నుండి అరుణారుణ కాంతులు చిమ్ముతుండగా కలకత్తా కాళికలా నాలుక చాచి, ఆకాశంలోకి ఎదుగుతున్న వామనునిలా, ఎగసి పడుతోన్న ఉక్రోషంలా, స్వయంభూవిగ్రహంలా? స్థిరంగా నిలుచుండి పోయింది. జనాలు తలలువంచుకు మ్రాన్పడిపోయారు.

---

# జీవన పోరాటం

**పూసల లింగాగౌడ్**

యెందరో వచ్చారు యెందరో వెళ్ళారు
యెందరో వున్నారు మరెందరో పోయారు
యెవరు పోయినా యెవరు వచ్చినా
యెతలవెతల బతుకుల బదుగుబండి మొరాయిస్తూనే ఉంది
మసకబారిన మనుషుల్లో వెతలు నిండిన బతుకుల్లో
మాసిన మట్టిమనుషుల జీవన పోరాటం
అధికారం ఉన్నవాడు అంతా నాదంటుంటే
అగాధంలో ఉన్నవాడు ఇంకా అగమవుతున్నడు
పేదల భూములు పెద్దల పరమవుతుంటే
పెత్తనం చేసే తెల్ల గద్దలు పగలబడి నవ్వుతున్నయ్
పంటలుండి ధరలు లేక పంటలెండి బ్రతుకలేక
పగలు రాత్రి గంజిలేక పురుగుల మందే పరమాన్నమవుతుంది
బీదా బిక్కి జనం దండు వోలె నడుస్తుంటే
కందువాల మాటున బందూకులు జూస్తున్నయ్
ఎంగిలి గద్దెనెక్కినోళ్ళు కాటిని కూడా కబళిస్తుంటే
ఎగిసి పడే ఆకలిమంటల్లోంచి పిడికిళ్ళు బిగుస్తున్నయ్
తూరుపున తెలవారుతుంది!!
జీవన పోరాటానికి రమ్మంది!

---

# తొలి మనిషి

**ఎం.ఆర్. అరుణకుమారి**

అందరూ అంటున్నారు
నిజమేనా ప్రియా!
ఒత్తయిన నీ నల్లని వుంగరాల జుట్టు
వెండి తీగల బట్టతలయిందని!
ముత్యాల పలువరస పకపకలు
బోసినవ్వుల జల్లయిందని
దేగ తీక్షణ చూపులకు
సోడాబుడ్డి జోడు తోడయిందని
పాము చెవులు
సీసయంత్రాలు కోరుతున్నాయని
కందిరీగ నడుము వంగిపోయిందని
కండలు పిండి చేసే
కండలు కరిగిపోయాయని
నిగనిగల చర్మం ముడతలు
గీతల ముడుతలై వేలాడుతున్నాయని
సింహ - రాజఠీవి నడకకు
మూడో కాలు వూతమయిందని
పౌరుష ఉచ్ఛ్వాసలు నీరసించి పోయాయని!
నిన్న గాక మొన్ననే కదా మనం కలుసుకొన్నది
అంతలోనే యింత మార్పా!
ఇవాళ కూడా నిన్ను చూశాను కదా!
నా కివన్నీ అ(క)న్పించనే లేదు
నీ ముగ్ధ మనోహర రూపం తప్ప!
రేపు, ఎల్లుండి, ఎప్పటికీ చెక్కు చెదరదు
నా తొలి చూపులో నీ రూపు
నా గుండెలో నీపై తొలి వలపు
కాలంతో తరిగే అందచందాలు శారీరకం
కాలంతో పెరిగే ప్రేమానురాగాలు మానసికం
మనిషి 'మనీషి'గా మిగలడమే అమరం
నీ భౌతిక కీర్తి శోషించినా
నీ మానవీయత - ఆర్తుల హృదయాల్లో
స్మరణీయ సశేషమే!
విస్మరించలేని విశేషమే!!

## పురస్కారాలు



# డోరిస్ లెస్సింగ్‌కు నోబుల్ బహుమతి

ఈ సంవత్సరం ప్రతిష్టాకరమైన నోబుల్ సాహిత్య బహుమతిని బ్రిటిష్ రచయిత్రి డోరిస్ లెస్సింగ్ దక్కించుకున్నారు. ఈ పురస్కారానికి ఎంపిక చేసిన స్వీడిష్ నోబుల్ అకాడమీ ఈ రచయిత్రి గురించి "మొగ్గతొడుగుతున్న స్త్రీవాద ఉద్యమం ఈమె సాహిత్య కృషిని దిక్సూచిలా భావించింది. ఈ రచయిత్రి రాసిన పుస్తకాలు స్త్రీ, పురుష సంబంధాలపై 20వ శతాబ్దం యొక్క దృష్టిని వ్యక్తం చేస్తాయి" అని వ్యాఖ్యానించింది. ఈ నెల 22వ తేదీతో 88 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న డోరిస్ లెస్సింగ్ నోబుల్ సాహిత్య బహుమతి అందుకున్న మహిళలలో అతి పెద్ద వయస్కురాలు. నోబుల్ సాహిత్య బహుమతి ప్రారంభమైన 1901 వ సంవత్సరం నుండి ఇప్పటికి 106 మంది ఈ బహుమతి పొందారు. వీరిలో మహిళలు 11మంది. ఈ బహుమతి పొందిన బ్రిటన్ దేశీయులు ఇప్పటి వరకు కేవలం ఇద్దరే. ఒకరు 2003లో బహుమతి పొందిన, వామపక్ష భావజాల రచయితగా పేరొందిన హెరాల్డ్ ప్రింటర్. మరొకరు ప్రస్తుత డోరిస్ లెస్సింగ్. ఈ బహుమతి పొందిన మొదటి బ్రిటన్ మహిళ కూడా ఈమే అవుతుంది. డోరిస్ లెస్సింగ్‌వి 80కి పైగా పుస్తకాలు వచ్చాయి. వీటిలో అత్యధికం నవలలే. తన మొదటి నవల 'ద గ్రాస్ ఈజ్ సింగింగ్".

"విడిపోయివున్న నాగరిక సమాజాన్ని సందేహంగా, నిప్పులా, దార్శనిక శక్తితో సూక్ష్మ పరిశీలన చేసిన స్త్రీల అనుభవపు సర్వజ్ఞురాలు" అని తను ప్రదానం చేయబోయే సైటేషన్‌లో స్వీడిష్ నోబుల్ అకాడమీ డోరిస్ లెస్సింగ్‌ను అభివర్ణించింది.



తన బాల్యాన్ని ఆఫ్రికాలో గడిపిన డోరిస్ లెస్సింగ్ తన సాహిత్యంలో ఎక్కువ భాగం ఆఫ్రికన్ జీవన పరిస్థితులనే చిత్రించారు. శ్వేత జాతీయుల ఆధిపత్యంలో ఉన్న ఆఫ్రికా దేశాలలో జాతి వివక్షను ప్రధాన సమస్యగా డోరిస్ గమనించింది. అదే ఇతివృత్తంగా తన మొదటి నవలను రాశారు. శ్వేత జాతీయురాలైన ఒక రైతు భార్య నల్ల జాతీయుడైన తన సర్వెంట్‌తో సంబంధం పెట్టుకోవడం నవలాంశం. కలువలేని జాతుల సంఘర్షణల్ని, సంబంధాల్ని విషాదపూరితంగా, ప్రతిభావంతంగా ఈ నవలలో డోరిస్ ఆవిష్కరించారని విమర్శకుల అభిప్రాయం.

డోరిస్ లెస్సింగ్‌కు ఖ్యాతి తెచ్చిన నవలలు 'ద గోల్డెన్ నోట్ బుక్', 'మెమొరీస్ ఆఫ్ సర్వైవర్', 'ద సమ్మర్ బిఫోర్ ద డార్క్'. వీటిలో స్త్రీవాద భావజాలాన్ని వెదజల్లి సంచలనం కలిగించిన పుస్తకం– 'ద గోల్డెన్ నోట్ బుక్' నవల. 1962లో రాసిన ఈ నవలలోని ప్రధాన పాత్ర అన్నా వుల్ఫ్‌లో రచయిత్రి మమేకమై రాశారు. ఈ పాత్ర నాలుగు రకాల నోటు పుస్తకాలలో తన ఆలోచనలను రాస్తుంటుంది. నాటి రాజకీయ, సామాజిక, మానసిక, లైంగిక అంశాలను ఏమాత్రం హిపోక్రసీ లేకుండా వ్యక్తం చేయడం ఆనాటి సంచలనానికి కేంద్ర బిందువైంది. మొదటిసారిగా ప్రయోగాత్మకంగా రాయబడిన ఈ నవల స్త్రీ కోణాన్ని నూతనంగా ఆవిష్కరించడమే కాకుండా నవలా సాహిత్యంలో ఓ కొత్త ఒరవడిని ప్రవేశపెట్టింది.

డోరిస్ లెస్సింగ్ తన ఆత్మకథను రెండు భాగాలుగా ప్రచురించారు. మొదటిది 'అండర్ మై స్కిన్ 1994', రెండవ భాగం 'వాకింగ్ ఇన్ ద షేడ్(1997)'. నిజానికి ఈమె నవలలన్నీ కూడా ఆత్మకథలను పోలి ఉంటాయనే అభిప్రాయముంది. స్త్రీ వాదానికి ప్రేరణ కలిగించిన ఈమె క్రమంగా దానికి దూరమయ్యారు. ప్రస్తుతం సైన్సు ఫిక్షన్ రాయడంలో నిమగ్నమయ్యారు. తాజాగా 2007లో తాను రాసిన సైన్సు ఫిక్షన్ నవల 'ద క్లెఫ్ట్' ను తానే కఠినంగా విమర్శిస్తున్నారు.

### ఆసక్తి కలిగించే డోరిస్ వ్యక్తిగత జీవితం

రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంలో ఉన్న పర్షియా (ఇప్పటి ఇరాన్)లో కెర్మాన్‌షా అనే చోట 1919 అక్టోబర్ 22న డోరిస్ లెస్సింగ్ జన్మించారు. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో లెస్సింగ్

**సాహిత్యంలో నోబుల్ బహుమతి పొందిన మహిళలు**

| | | |
|---|---|---|
| 1909 | సెల్మా లాగెరోఫ్ | స్వీడన్ |
| 1926 | గ్రజియా డెలెడ్డా | ఇటలీ |
| 1928 | సిగ్రిడ్ అండ్‌సెట్ | నార్వే |
| 1938 | పియర్ల్‌బక్ | అమెరికా |
| 1945 | గాబ్రియెలా మిస్ట్రల్ | చిలీ |
| 1966 | నెల్లీ సక్స్ | స్వీడన్ |
| 1991 | నాడైన్ గార్డిమర్ | దక్షిణాఫ్రికా |
| 1993 | టోని మారిసన్ | అమెరికా |
| 1996 | విస్లావా జింబోర్‌స్కా | పోలండ్ |
| 2004 | ఎల్‌ఫ్రైడే జెలినెక్ | ఆస్ట్రియా |
| 2007 | డోరిస్ లెస్సింగ్ | బ్రిటన్ |






# 'ద గ్యాదరింగ్' నవలకు బుకర్ బహుమతి

ఐరిస్ రచయిత్రి అన్నె ఎన్‌రైట్ కు 2007 సంవత్సరపు 'ది మ్యాన్ బుకర్ బహుమతి' లభించింది. అక్టోబర్ 16న లండన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో బుకర్ ప్రైజ్ న్యాయనిర్ణేతల కమిటీ ఛైర్మన్ హవార్డ్ డెవిస్ ఈ బహుమతి ప్రకటించారు. కాల్పనిక సాహిత్యంలో ప్రతియేటా ఇచ్చే బుకర్ ప్రైజ్‌కు ప్రపంచవ్యాప్త ప్రాచుర్యం ఉంది. ఐర్లండు దేశానికి చెందిన 45 యేళ్ళ అన్నె ఎన్‌రైట్ 1993 నుండి పూర్తి కాలం రచయిత్రిగా కొనసాగుతున్నారు. గతంలో ఈమె టివి నిర్మాతగా పనిచేశారు. 1962 అక్టోబర్ 11 న ఐర్లండ్‌లోని డుబ్లిన్ అన్నె ఎన్‌రైట్ జన్మస్థలం. ఐర్లండ్ దేశంలో ఈ బహుమతి పొందిన వారిలో అన్నె ఎన్‌రైట్ రెండవ వారు . ఐరిష్ దేశపు కుటుంబ వ్యవస్థను చాలా శక్తివంతంగా చిత్రించిన 'ద గ్యాదరింగ్' నవలకు ఈ బహుమతి లభించింది. చెదిరిపోయిన కుటుంబమంతా ఆత్మహత్య చేసుకున్న తమ్ముడు అంత్యక్రియలకు ఒక చోటుకు చేరడం నవలాంశం. ఈ నవలలో కుటుంబ రహస్యాలు, సెక్స్ సంబంధాలు, వేదనలు, త్రాగుడు, వలస పోవడం, చెడు సంబంధాలు వంటి విషయాలు అత్యంత ప్రతిభావంతంగా చిత్రించబడ్డాయి. ఈ యేటి బుకర్ బహుమతి పోటీకి మొత్తం 110 పుస్తకాలు వచ్చాయి. వాటిలో 92 పుస్తకాలు పంపించబడగా, 18 పుస్తకాలను బుకర్ కమిటీ తెప్పించుకొంది. వీటినుండి వెలికితీసిన స్వల్ప జాబితా పట్ల కూడా సాహిత్యాభిమానులు ప్రత్యేక ఆసక్తి కనబరుస్తారు. బ్రిటన్ కు చెందిన మెక్‌ఇవాన్ 'ఆన్ ఛిజెల్ బీచ్', న్యూజిలాండ్‌కు చెందిన జోన్స్ 'మిస్టర్ పిప్', భారతదేశపు ఇంద్రసిన్హా 'ఏనిమల్ పీపుల్', బ్రిటన్‌కు చెందిన నికోల బార్కర్ 'డార్క్‌మ్యాన్స్' బ్రిటన్‌లో స్థిరపడిన పాకిస్థాన్‌కు చెందిన మొహిసిన్ హమీద్ 'ద రిలక్టంట్ ఫండమెంటలిస్ట్' పుస్తకాలు ఈ జాబితాలో ఉన్నాయి. బుకర్ బహుమతి మొత్తం 50,000 బ్రిటీష్ పౌండ్లు, మన కరెన్సీలో సుమారు 20 లక్షల రూపాయలు. స్వల్పజాబితాలోకి చేరిన మిగతా ఐదుగురికి కూడా 2500 ఫౌండ్లు(2 లక్షల రూపాయలు) బహుమతిగా ఇస్తారు.అన్నె ఎన్‌రైట్ బహుమతి గెలుచుకున్న 'ద గ్యాదరింగ్' నవలతో పాటు కలిపి నాలుగు నవలలు మాత్రమే రాశారు. ఒక కథా సంపుటి, కొన్ని వ్యాసాలు ప్రచురించారు. ఈ రచయిత్రి రాసిన ఇతర నవలలు 'ద విగ్ మై ఫాదర్ వోర్', 'వాట్ ఆర్ యు లైక్?', 'ద ప్లెజర్ ఆఫ్ ఇలిజా లింక్'. ఈమె రాసిన కథల సంపుటి 'ద పోర్టేబుల్ వర్జిన్'. వ్యాసాల సంపుటి 'మేకింగ్ బేబీస్: స్టంబ్లింగ్ ఇంటూ మదర్‌హుడ్'.




**(ద మ్యాన్ బుకర్‌ప్రైజ్ వెబ్‌సైట్ ఆధారంగా...)**

తండ్రి బ్రిటీష్ ఆర్మీలో కెప్టెన్ హోదాలో ఇంపీరియల్ బ్యాంక్ అధికారిగా అక్కడ విధులు నిర్వర్తించేవారు. ఆ తరువాత ఆదాయాన్ని పెంచుకునే నిమిత్తం ఆఫ్రికా ఖండంలోని దక్షిణ రొడీషియా(ఇప్పటి జింబాబ్వే) ప్రాంతానికి కుటుంబాన్ని తరలించారు. డోరిస్ పాఠశాలకు వెళ్ళడం అక్కడే ప్రారంభమయ్యింది. పూర్తి బాల్యాన్ని అక్కడే గడిపిన డోరిస్ తన 14 యేళ్ళ ప్రాయంలో స్వతంత్ర ఆలోచనతో చదువుకు స్వస్తి చెప్పింది. స్టెనోగ్రాఫర్, ఆఫీస్ క్లర్క్, నర్స్, జర్నలిస్టు వంటి ఉద్యోగాలు చేసింది. ఆ సమయంలోనే కొన్ని కథలు రాసి పత్రికలకు అమ్మేది. తన 20వ యేట ఫ్రాంక్ చార్లెస్ విజ్‌డమ్‌ను వివాహం చేసు కుంది. ఆ దంపతులకి కొడుకు, కూతురు సంతానం కలిగిన తరువాత విభేదాలు వచ్చి విడాకులు తీసుకున్నారు. జాతుల సమస్య పై కృషిచేసిన మార్క్సిస్టు బృందంతో కలిసి పనిచేసిన డోరిస్ ఆ బృంద నాయకుడు జర్మన్ శరణార్థి గాట్‌ఫ్రైడ్‌ను వివాహమాడింది. అతనితో కూడా విభేదాలు వచ్చి విడాకులు పొందింది.

## 1949 నుండి లండన్‌లోనే...

గాట్‌ఫ్రైడ్‌తో కలిగిన సంతానం పీటర్‌ను తీసుకుని రచయిత్రిగా స్థిరపడాలని 1949లో లండన్ చేరుకుంది. 1952 నుండి 1956 వరకు బ్రిటీష్ కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలిగా ఉన్న డోరిస్ అణ్వాయుధాల వ్యతిరేక ప్రచారంలో చురుగ్గా పాల్గొంది. ఆ తరువాత విభేదించి పార్టీనుండి వైదొలిగింది. దక్షిణాఫ్రికాలోని శ్వేతజాతీయుల పాలనపై విమర్శలు గుప్పించిన కారణంగా 1956లో డోరిస్ ఆ దేశం ప్రవేశించకుండా నిషేధం ప్రకటించబడింది. స్వస్థలంగా భావించే దక్షిణ రొడీషియా పర్యటనకు వెళ్ళిన డోరింగ్‌కు అక్కడ కూడా అదే కారణం చూపి ఆ దేశ ప్రవేశంపై కూడా నిషేధం విధించారు. నిషేధం విధించిన నలభై యేళ్ళ తరువాత డోరిస్ తన కూతురిని, మనవళ్ళని చూడటానికి దక్షిణ రొడీషియా(జింబాబ్వే) వెళ్ళారు. మారిన పరిస్థితుల మధ్య ఆ దేశం డోరిస్‌కి హృదయపూర్వక ఆహ్వానం పలికింది. వలస విధానం, జాతుల సమస్య, పర్యావరణ విధ్వంసం, ప్రధానంగా స్త్రీల అణిచివేత సమస్యల వంటి విషయాలపై తన కలం ఎక్కుపెట్టిన లెస్సింగ్‌కు యూరప్‌లోని అత్యున్నత అవార్డులు అన్నీ దక్కాయి. చరమాంకంలో అత్యంత ప్రతిష్టాత్మక నోబుల్ సాహిత్య బహుమతి రావడం డోరిస్‌ను ఆనందంలో ముంచెత్తింది. స్వీడిష్ కరెన్సీలో 10,000 మిలియన్ క్రోణార్‌ల విలువగల నగదు బహుమతితో పాటు మెడల్, సైటేషన్‌లను డిసెంబరు నెలలో స్వీడన్ రాజధాని స్టాక్‌హోంలో జరిగే కార్యక్రమంలో డోరిస్ లెస్సింగ్ అందుకుంటారు. నోబుల్ బహుమతి ప్రకటనతో ప్రపంచంలోని సాహిత్యాభిమానులంతా డోరిస్ రచనలపై ఆసక్తిని చూపిస్తారు. డోరిస్ రచనల పరిచయం లేని పాఠకులకు ముందుగా తనవి ఏ రచనలు చదివితే బావుంటుందో కూడా చెప్పారావిడ. నోబుల్‌ప్రైజెస్ డాట్ కామ్ ఎడిటర్-ఇన్ చీఫ్, డోరిస్‌ను వెబ్‌సైట్ కోసం చేసిన ఇంటర్వ్యూలో ఆమె 'ద ఫిఫ్త్ ఛైల్డ్', 'మారా అండ్ డానా', 'ద గ్రాస్ ఈజ్ సింగింగ్' నవలలను పాఠకులకు ఆమె సూచించారు. విభిన్న ప్రక్రియలలో విస్తారమైన సాహిత్యాన్ని సృజించిన డోరిస్ లెస్సింగ్‌కు ఈ యేడాది నోబుల్ సాహిత్య పురస్కారం రావడం సముచితం అనే అభిప్రాయం ఎక్కువ మంది సాహిత్య అభిమానులు, విమర్శకుల్లో వ్యక్తం అయ్యింది.

# నా రైలు ప్రయాణం



**మా అన్నయ్య వాళ్లింట్లో నాలుగు రోజులుందామని వచ్చిన నేను అర్జంటుగా వాపస్ హైదరాబాద్ బయలుదేరాల్సి వచ్చింది. జాబ్ కొరకు కాల్ లెటర్ వచ్చిందనీ రేపు ఉదయానికల్లా హైదరాబాద్ రమ్మని మావారి ఫోన్. అందుకు నాలుగు రోజులుందామనుకున్న నేను రెండు రోజులకే వెళ్లాల్సి వస్తుంది. అన్నయ్యనేమో ఆఫీసుకెళ్లాడు. నాకు బొంబాయి తెలియదు. హిందీ అంతగా రాదు. వదినకేమో జ్వరం. తప్పనిసరై రిజర్వేషన్ చేయించుకుందామని బయలుదేరాను.**

**'తాయమ్మ' కరుణ**

ట్రైన్ ఎన్ని గంటలకో తెలియదు. రిజర్వేషన్ దొరుకుతదో లేదో తెలియదు. మన ప్రయత్నం మనం చేయాలిగా, రిజర్వేషన్ ఆఫీసుకెళ్లి చూస్తే ఇంకో ఐదుగంటల టైముంది ట్రైన్ బయలుదేరడానికి, ఫామ్ నింపి లైన్లో నిలుచున్నా, "వెయిటింగ్ లిస్ట్ నూట ముప్పైతొమ్మిది ఇమ్మంటారా" అనడిగాడు. 'సరే' ఇమ్మన్నాను. కనీసం స్లీపర్ క్లాస్ లోకి దూరగలిగితే టి.సిని రిక్వెస్ట్ చేసి బెర్త్ సంపాయించుకోవచ్చని చిన్న ఆశ. బెర్త్ దొరకకపోయినా కింద పేపర్స్ వేసుకుని పడుకోవచ్చు.

హాయిగా బస్సులో వెళ్లవచ్చు. ఎందుకోగానీ బస్సు ప్రయాణం అంతగా ఇష్టముండదు. ఒంటరిగా, కట్టేసినట్టుగా గంటల తరబడి కూచుని వెళ్లాలి. ఎవరూ ఇంకొకరిని పలకరించరు. ట్రైన్ ప్రయాణం ఇంట్లో వున్నట్టుగా వుంటది నాకు. మనను ఎవరూ పలకరించకపోయినా అవతలివాళ్లు మాట్లాడుకునేవి వినవచ్చు. మా వారికీ ట్రైన్ ప్రయాణం అంటే ఎంతో ఇష్టం. బహుశా ఆయన సహచర్యం, ఆయనతో ప్రయాణించడం వల్లనే నాకూ ట్రైన్ ప్రయాణం అంటే ఇష్టం ఏర్పడింది. ట్రైన్, బస్సు ప్రయాణాల్లోని తేడా అనుభవంలోకి వచ్చింది. నా మట్టుకు నాకు ట్రైన్ ప్రయాణం పల్లెల్లోని ఇరుగు పొరుగు పలకరింపులా అనిపిస్తుంది. బస్సు ప్రయాణం ఇప్పటి పట్టణాల్లోని మనుషుల్లా ఒంటరిగా అనిపిస్తది.

సాయంత్రం ట్రైన్ బయలు దేరడానికి ఒక అరగంట ముందే స్టేషన్‌కు చేరుకున్నాను. ఒక పొట్టి టి.సి. కన్పించాడు. ఆయనకు ఒక నమస్కారం పెట్టి, టికెట్ చూపుతూ "సర్ వెయిటింగ్ లిస్ట్ వన్ థర్టీనైన్, బెర్త్ మిలేగా సర్" అన్నాను. "నహీ మిలేగా దేఖాయేకిత్‌నా లోగ్‌హై" అంటు చుట్టూ వున్నవాళ్లని చూపించి ఖరాఖండితంగా చెప్పేసి వెళ్లిపోయాడు. నేను పట్టించుకోలేదుగానీ చాలా మందే 'సర్, సర్' అంటూ టి.సి వెనకాలే తిరుగుతున్నారు. చేసేదేమీ లేక నిలుచుండిపోయాను. ఒకబ్బాయి మాత్రం టి.సి. వెనకాలే నడుస్తూ కన్పించాడు. నేను కూడా పరిగెత్తాను. ఒంటరిగా వున్నప్పుడు అడిగితే 'ట్రై' చేస్తారు కదాని. లేడీస్ అని కొంత దయ తలుస్తారేమో అని కూడా వుంది. ఆ అబ్బాయి "సర్, డబ్బులిస్తాను" అన్నాడు.

టి.సి లేవన్నాడు. కానీ 'లేవు' అనడంలోని ఢీలాతనం అర్థమై "నేను కూడా డబ్బులిస్తాను సర్" అన్నాను. నా వేపు ఓసారి చూసి ఊరుకున్నాడు. సీటు దొరికిందనుకున్నాను. ధీమాగా వెళ్లి మహిళలు ఎక్కువమంది వున్న కంపార్ట్‌మెంట్ చూసుకుని కూచున్నాను. ఆ కంపార్టుమెంటులో ఒకవేపు ముగ్గురు మహిళలు, ఇంకోవేపు ఒక భార్యాభర్తల జంట, నేను వున్నాము, ఒకబ్బాయి

పై బెర్త్‌లో నిద్రపోతున్నాడు. దారి పక్కనున్న రెండు బెర్త్‌ల్లోనూ ఇద్దరు మహిళలు, వారితోపాటు ఇద్దరు చిన్నపిల్లలు.

ఆ కంపార్టుమెంటులో ఎక్కువగా మహిళలున్నందుకు సంతోషించాను – ఒకవేళ బెర్త్ దొరక్కపోయినా కిందపేపర్స్ వేసుకుని పడుకోవచ్చుని.

నా ఎదురుగా కూచున్న ముగ్గురు మహిళలల్లో కిటికీ పక్కన కూచుని వున్న అమ్మాయి బాగా చదువుకున్న దానిలా వుంది, సింపుల్‌గా చేతికి వాచీ తప్ప ఏ అలంకరణ లేకుండా చుడీదార్, చున్నీ వేసుకుని ఇరవైదు సంవత్సరాల వయసు కల్గినదానిలా నా చూపులకు అన్పించింది. ఆమె పక్కనే జీవితం పట్ల అవగాహన, తను జీవించే విధానంపట్ల సంతృప్తివున్నట్టుగా గంభీరతతో ఈమె కూడా ఏ అలంకరణ లేకుండా కాటన్ చుడీదార్, కళ్లద్దాలతో సింపుల్‌గా దాదాపు నలభైఐదు సంవత్సరాల వయసు కల్గిన మహిళ. ఆమె పక్కనే టైట్ జీన్‌ప్యాంటు, టైట్, పొట్టి, పెద్ద చెక్స్ వున్న వైట్ షర్ట్, కాలి రెండు వేళ్లకు సన్నని తీగతో చుట్టినట్టు వున్న పెద్ద వెండి మెట్టెలు, ఒక చేతికి వాచీ, ఇంకో చేతికి గాజు గాజులు, బంగారు గాజులు, వేళ్లకు ఉంగరాలు, మెడలో రెండు వరుసల బంగారు నల్లపూసల తాడు, ఇంకొక పెద్ద లాకెట్ వున్న చైను, చెవులకు పెద్ద జుంకాలు కలిగిన ఇరవై ఐదు సంవత్సరాల వయసు కల్గినట్టుగా కన్పిస్తున్న బాగా అలంకరించుకున్న అమ్మాయి వున్నారు. నా పక్కనే వున్న భార్యాభర్తల జంట ముప్పైఐదు నుంచి నలభై మధ్యలో వున్నారనుకుంటా.



ఎవరెవరు ఎక్కడికి వెళుతున్నారు, ఏఏ బెర్తులు పరిచయాలయ్యాయి. నా గురించీ చెప్పాను. "ఫర్వాలేదు. పడుకునే వరకు కూచోండి. ఈలోగా 'టి.సి వస్తే ప్రయత్నించండి" అన్నది తను జీవించే విధానం పట్ల సంతృప్తిగల కళ్లద్దాల పెద్దావిడ. నేను భార్యాభర్తల జంట మీదుగా కాసేపు, కుడిపక్క నుంచి కాసేపు కిటికీలోంచి చూస్తూ కూచున్నాను. ఆ బాగా చదువుకున్న, సింపుల్‌గా అమ్మాయి, జీవించే విధానం పట్ల సంతృప్తి గల కళ్లద్దాల పెద్దావిడ ఇంగ్లీష్‌లో చాలా చాలా మాట్లాడుకుంటున్నారు. నేను వినడానికి చెవులు కూడా పారేయలేక పోయాను. ఏవేవో ఆలోచనలతో వుండిపోయాను. ఒకోసారి జీవితంపట్ల చెప్పలేని వైరాగ్యం ఆవరిస్తాయి నన్ను. అదీగాక శ్రద్ధగా వింటేనేగానీ ఇంగ్లీషు అర్థం కాదు నాకు. అందుకు కూడా నేను వినలేదనుకుంటూ పబ్లిక్ మాట్లాడుకునేవాళ్లు అవతలివాళ్లు ఇన్నా ఫర్వాలేదనే జనరల్ టాపిక్స్ మాట్లాడుకుంటూ వుంటారు కదా. ఒకోసారి ఇతర్లు మాట్లాడేవి మనం అంతగా పట్టించుకోకపోయినా మనని అటువేపులాగుతాయి.

నేను ఇలాగే ఒకసారి ట్రైన్ ప్రయాణిస్తూ కిటికీలోంచి కదిలిపోయే ప్రకృతిని ఆస్వాదిస్తూ కూచున్న అరవైకి దగ్గరగా వున్న ముసలావిడ పక్కనున్న ఆమెతో (బహుశా చుట్టం అవుతదేమో) చెప్తూంది. ఆ మాటలు నాకు తెలియకుండానే నా చెవుల్లో దూరిపోయాయి. తను ఎంతో కష్టపడి వ్యవసాయం చేసి, ఇద్దరు కొడుకులను పెంచి పెద్ద చేసిందట. భర్త తాగుబోతు అయ్యి ఇంటిని పట్టించుకోనప్పటికీ. భర్త బాగా తాగి పట్టాలు దాటుతుండగా ట్రైన్ వచ్చి గుద్దిందట. ఆ యాక్సిడెంట్‌లో బాగా గాయాలయి రైల్వే దవఖానాలోనే ఇరవై రోజులకు చనిపోయాడట. అట్లా భర్త చనిపోయిన ఐదు నెలలకు ఒక లాయర్ వీళ్ల అడ్రస్ వెతుక్కుంటూ వచ్చాడట. ట్రైన్ యాక్సిడెంట్ వల్ల భర్త చనిపోయాడు కనుక నష్టపరిహారం ఇప్పించాలనీ రైల్వేశాఖ మీద కేసు వేయాలనీ, కేసు గెలిస్తే నాలుగు లక్షల రూపాయలు వస్తాయనీ చెప్పాడట. 'ఆకేసులు, ఆ కోర్టులు నాకు తెల్వదు నాయిన. సచ్చినోడు సచ్చిండు. కోర్టుల చుట్టూ, లాయర్ల చుట్టూ తిరుక్కుంట డబ్బులాడ ఖర్చు పెడుదును' అన్నదట ఈ ముసలావిడ. అవన్నీ నేను చూసుకుంటాను. నువ్వు కేసు పెట్టు. కేసు గెలిస్తే వచ్చిన డబ్బుల్లో చెరిసగం అన్నాడట. ఈ ముసలామె సరేనన్నదట. ఇప్పుడు ఆ కేసు గెలిచి, అందులో వచ్చిన డబ్బులు తీసుకోవడానికే వెళుతుందట. లాయర్‌కు రెండు లక్షలట, తనకు రెండు లక్షలట. విని ఆశ్చర్యపోయాను. ఇలాంటి లాయర్స్ కూడా వుంటారా అని.

ఎవరి గొడవలో వాళ్లుండగా 'పొట్టి' టి.సి వచ్చాడు. అందరి టికెట్లు చెక్ చేసాడు. చాలా ధీనంగా మొఖం పెట్టి "సర్" అన్నాను. "ఆజ్‌రాత్ నహీ మిలేగా మేడం" గట్టిగా అన్నాడు. అంటే నన్ను గుర్తు పెట్టుకున్నాడు అనుకున్నాను. గుర్తు పెట్టుకుని మరీ అంత గట్టిగా చెప్పడంతో బెర్త్ దొరుకుతుందనుకున్న ధీమా కాస్తా 'ఉఫ్' మని ఎగిరిపోయింది. అయినా ఏ మూలనో ఇస్తాడనీ వుంది. బాగా అలంకరించుకున్న పెళ్లైన అమ్మాయి రెండు టికెట్లు టిసికి ఇచ్చింది. అతను ఒక దాని మీద టిక్‌పెట్టి ఇంకొకటి దగ్గరుంచుకొమ్మని ఇచ్చాడు. అంతసేపూ టి.సి వెనకాల ఏడెనిమిది మంది నిలబడి వున్నారు – బెర్త్ కొరకే వాళ్లనేమీ పట్టించుకోకుండా టి.సి తన పనిమీద తనున్నాడు. తర్వాతి కంపార్టుమెంటులోకి వెళ్లాడు.

ఈ బాగా అలంకరించుకున్న అమ్మాయి "ఏమండీ, నా దగ్గర రెండు టికెట్లు వున్నాయి. టి.సి ఒక్కదాని మీదే టిక్ పెట్టాడు. ఏమీ కాదాండీ" అంది. "రెండు టికెట్లు ఎందుకు తీసుకున్నావు" అని అడిగాను అర్థం గాక, ఆవిడ తెలుగమ్మాయే.

"మా నాన్నగారు బొంబాయి నుండి వైజాగ్ ఒక టికెట్ తీసారండీ. అది వెయిటింగ్ లిస్ట్ థర్టీనైన్ వచ్చిందండి. రెండు నైట్లు ప్రయాణం కదాని మావారు టి.సిని రిక్వెస్ట్ చేస్తే 'సికింద్రాబాద్ వరకు సీటు దొరుకుద్ది కానీ, మరొక టికెట్ తీసుకోవాలని చెప్పారండి. అందుకని మావారు బొంబాయి నుంచి సికింద్రాబాద్ ఇంకొక టికెట్ తీసారండి. ఏమీ కాదు కదాండీ" అని మళ్లీ అడిగింది. గొంతులో ఏదో తట్టుకుంటున్నట్టు, చాలా నెమ్మదిగా, తెలుగు నేర్చుకుని మాట్లాడుతున్న తెలుగమ్మాయిలా మాట్లాడింది.

రెండు టికెట్లు చూడ్డానికి ఇమ్మని అడిగాను. బ్యాగుకున్న పది జిప్పులూ తీసి చూసింది. అయినా దొరకలేదు. చివరికి ప్యాంటు జేబులో వెతికితే దొరికింది. తీసుకుని చూసాను. ఆ అమ్మాయి చెప్పినట్టుగానే బొంబాయి – సికింద్రాబాద్ ఒక టికెట్టు బొంబాయి – వైజాగ్ ఇంకో టికెట్ వున్నాయి. బొంబాయి – సికింద్రాబాద్ టికెట్

మీద టిక్ మార్క్ పెట్టాడు. "మీకేమీ కాదు. మిమ్మల్ని ఎవరూ ఏమీ అనరు. సికింద్రాబాద్ వెళ్లక వేరొక టికెట్ చూపించండి" అన్నాను. అయినా మళ్లీ "ఏమీ కాదు కదాండీ" అన్నది. "మీవే ఎక్కువ డబ్బులు ఖర్చయ్యాయి. మీకేమీ అవదు" అని భరోసా ఇచ్చాను. "బొంబాయి - సికింద్రాబాద్ ఒకటి, సికింద్రాబాద్ - వైజాగ్ ఇంకొకటి తీసుకోవాల్సింది" అని ఒక ఉచిత సలహా కూడా పడేసాను.

భార్యాభర్తల జంట ఆ కంపార్టుమెంటులో తామిద్దరమే వున్నామనుకుంటున్నారనుకుంటా. ఒకరి నొకరు కొట్టుకోవడం, మీద పడడం చేసుకుంటున్నారు. మరాఠీలో ఏమిటేమిటో మాట్లాడుకుని నవ్వుకుంటున్నారు, గిల్లుకుంటున్నారు. చివరికి తల కిటికీవేపు, కాళ్లు ఆమె ఒడిలో పెట్టి పడుకున్నాడు.

ఇంతలో టి.సి. హడివుడిగా వచ్చి "ఏదమ్మా నీ టికెట్ ఇవ్వు" అంటూనే "ఎక్కడికెళ్లాలన్నావ్" అన్నాడు "సికింద్రాబాద్ సర్" అన్నాను. పక్క కంపార్టుమెంటులో బెర్త్ ఇచ్చాడు. లోయర్ బెర్త్. 'హమ్మయ్య' అనుకున్నాను. వెంటనే యాభై రూపాయలు తీసి ఇచ్చాను. తీసుకుని జేబులో పెట్టుకుని వెళుతూ "ఎనిమిది గంటలకు వాళ్లు దిగిపోతారు. అప్పటి వరకు ఇక్కడే వుండి, తర్వాత నీ బెర్త్ దగ్గరకు వెళ్లండి" అని చెప్పాడు. "ఒకే సర్" అన్నాను.



టి.సి. వెళ్లాక బాగా అలంకరించుకున్న అమ్మాయి నా కాలు మీద తట్టింది. ఏమిటన్నట్టు చూసాను. 'తను పిలుస్తుంది' అన్నట్టుగా జీవించే విధానం పట్ల సంతృప్తి గల కళ్లద్దాల పెద్దావిడ వేపు చూపింది. ''ఖ్యాజి'' అన్నాను. ''టి.సి డబ్బులు అడిగాడా?మీకు మీరుగా ఇచ్చారా" అని అడిగింది. "నేనే ఇచ్చాను. ట్రైన్ ఎక్కేముందు సీట్ వుంటే చూడండి. డబ్బులిస్తానన్నాను. అందుకే ఇప్పుడు ఇచ్చాడు" అన్నాను.

"లంచగొండితనం మీరే నేర్పుతున్నారు. మీకు డబ్బులున్నాయి, కాబట్టి ఇస్తున్నారు. డబ్బులు ఇవ్వలేనివాళ్ల స్థితి ఏంటి? ఇక నుంచి డబ్బులిచ్చిన వాళ్లకే సీటు ఇస్తాడు. అతనికి వుద్యోగం వుంది. సాలరీ వస్తది. అతనికిచ్చే బదులు బీదవాళ్లకు ఇచ్చినా ఇంత తింటారు" అని పెద్ద లెక్చర్ దంచింది. తను మాట్లాడుతున్నంత సేపు గమ్మున వింటూ వుండిపోయా.

"ఎవరు ముందుగా వెళితే వాళ్లకు సీటు ఇవ్వాలి. కానీ గవర్నమెంట్ 'తత్కాల్' పేరుతో ఎక్కువ డబ్బులు తీసుకుంటూ పెద్ద దందా నడుపుతోంది. గవర్నమెంటుకు నూటయాభై ఇచ్చే బదులు టి.సి.కి యాభైరూపాయలు ఇచ్చి బెర్త్ సంపాయించుకున్నాను. డబ్బులున్న వాళ్లు ఎక్కువ డబ్బు చెల్లించి 'తత్కాల్'లో వెనకాల వచ్చి కూడా సీటు కొనుక్కుంటారు. మాలాంటి మిడిల్‌క్లాస్, బీదవాళ్లే కద నష్టపోయేది". నేనూ లెక్చర్ ఇచ్చాను.

మొత్తానికి గమ్మున వుండిపోయింది. కళ్లద్దాలు పైకి అనుకుంటూ, మిగతా వాళ్లంతా వింటూ వుండిపోయారు. మరి నా హిందీ ఎంతవరకు అర్థమైందో!

సాయంత్రం ఆరుగంటలవుతుందనుకుంటూ టీ కొనుక్కున్నాను. బాగా అలంకరించుకున్న ఇరవై అయిదేళ్ల అమ్మాయి కూడా టీ తీసుకుంది. బ్యాగుకున్న జిప్‌లన్నీ వెతికి చిల్లర డబ్బులు అతనికిచ్చేలోగా నేను టీ తాగడమూ అయిపోయింది. డబ్బులు అతనికి ఇచ్చేసి, పట్టుకొమ్మని టీ గ్లాసు నాకు ఇచ్చింది. టాబ్లెట్ ఏమన్నా వేసుకుంటదేమోనని నేను గ్లాస్ అందుకున్నాను. తీరిగ్గా మళ్ళీ ఒకసారి బ్యాగు జిప్‌లన్నీ తెరిచి ఒక్కొక్క అరలోంచి ఒక్కొక్కటి తీసి మొఖానికి క్రీము, పౌడర్ వేసుకుంది. ఇంకా ఏవిటేవిటో రాసుకుంది. తల దువ్వుకుంది. సైడ్‌పిన్స్ పెట్టుకుంది. తలను అటూ ఇటూ తిప్పి ఒకటికి రెండుసార్లు అద్దంలో చూసుకుంది. నాకు విసుగొచ్చి టీ గ్లాసును బెర్త్ మీద పెట్టాను. దాదాపుగా టీ చల్లారిపోయింది. "టీ ఏదండీ" అని అడిగింది. ఇచ్చాను. "టీ తాగుతూ "లిప్‌స్టిక్ తేవడం మర్చిపోయానండీ" అంది. "బాగానే వున్నారుగా. అవి లేకున్నా నడుస్తది" అన్నాను.

"అది కాదండీ, మా అన్నయ్య ఫ్రెండ్ వచ్చే స్టేషన్‌లో కలుస్తాడండీ" అంది. "అలాగా" అన్నాను. మళ్ళీ తనే "మాదీ, అతనిదీ ఒకే క్యాస్టండీ" అన్నది. "క్యాస్ట్ గురించి ఎవరు పట్టించుకుంటున్నారండీ. మనుషులు మంచివాళ్ళు కావాలిగానీ" అన్నాను. "అతను నన్ను ఇష్టపడి, పెళ్ళి చేసుకుంటానన్నాడండీ, నాకే నచ్చలే. చేసుకోనని చెప్పాను" అంది.

'అదా సంగతి' అనుకున్నాను. నచ్చలేదని చేసుకోలేదు. బాగానే వుంది. కానీ ఇప్పుడు పెళ్ళయి వుండీ ఆ అబ్బాయి వస్తున్నాడని ఇంత మేకప్ అవుతుంది. ఏమిటో ఈ మనుషుల మనస్తత్వాలు! తనని 'మిస్' అయినందుకు అతను బాధపడాలనేమో బహుశా!

ఈసారి ఇంకొక 'పొడుగు' టి.సి. వచ్చాడు. టికెట్లు చెక్ చేయడానికి. అతను మా కంపార్టుమెంట్‌లో చూడకుండా వెళుతుంటే జీవించే విధానం పట్ల సంతృప్తి గల కళ్ళద్దాల పెద్దావిడ "సర్" అని పిలిచింది. 'పొడుగు' టిసి 'ఏంటని' అడిగాడు. బాగా అలంకరించుకున్న ఇరవై అయిదేళ్ళ అమ్మాయిని టికెట్ ఇమ్మని అడిగింది. మరొకసారి ప్యాంటు జేబులు, బ్యాగ్ జిప్‌లన్నీ తెరిచి చూసి, పర్స్‌లోంచి టికెట్ తీసి ఇచ్చింది. జీవించే విధానం పట్ల సంతృప్తి గల కళ్ళద్దాల పెద్దావిడ "సర్, వీళ్ళన్నయ్య కూడా టిసినే. తను రెండు టికెట్లు తీసుకుంది. ఒక టికెట్ క్యాన్సిల్ చేసి డబ్బులు వాపస్ ఇప్పించగలరా?" అని అడిగింది. అలా కుదరదని 'పొడుగు' టిసి చెప్పాడు. "ఎందుకు కుదరదు సర్. రెండు టికెట్ల మీద సేమ్ నేమ్, సేమ్ ఏజ్, సేమ్ ఎడ్రస్ వున్నాయి. కావాలంటే మేము సాక్ష్యం చెప్తాము" అంది. 'పొడుగు' టిసి డైలామాలో పడ్డాడు. ఇంతలో 'పొట్టి' టిసి వచ్చాడు. "ఒక టికెట్ డబ్బులు వాపస్ ఇప్పించగలమా?" అని 'పొట్టి' టిసిని 'పొడుగు' టిసి అడిగాడు. వెంటనే పొట్టి టిసి "కావాలంటే ఒకటి క్యాన్సిల్ చేసి ఇస్తాము. కానీ మీది (బొంబాయి - వైజాగ్ టికెట్) వెయిటింగ్‌లో వుంది. దొరికితే ఆర్ఏసిలో సీటు దొరుకుద్ది. బెర్త్ వున్న బొంబాయి - సికింద్రాబాద్ కాన్సిల్ చేయమంటే చేస్తాను" అన్నాడు. "సీటు కొరకే కద సర్ తను ఇంకో టికెట్ తీసుకుంది" జీవించే విధానం పట్ల సంతృప్తి గల కళ్లద్దాల పెద్దావిడ అంది. "ఈవిడది వెయిటింగ్ లిస్ట్. ముప్పై తొమ్మిది. బెర్త్

దొరకడం కష్టమండీ" అన్నాడు 'పొట్టి' టిసి. ఇక మాట్లాడటం వేస్టనుకుని గమ్మున వుండిపోయారు.

నాదీ వెయిటింగ్ లిస్టే. మళ్ళా అది నూట ముప్పై తొమ్మిది. నేను ఈ రోజు రిజర్వ్ చేయించుకున్నాను. ఆ అమ్మాయి వారం కిందట చేయించుకుంది. నాకు బెర్త్ ఇచ్చాడు. ఎంత నిస్సిగ్గుగా మా అందరి ముందే ముప్పై తొమ్మిది వెయిటింగ్ లిస్ట్‌కు బెర్త్ దొరకదని చెప్తున్నాడు. అసలు ఈ పాటికి ఎవరికో ఒకరికి ఆ బెర్త్‌ను అమ్మేసుకుని వుండి వుంటాడు.

టీసీలిద్దరు వెళ్ళిపోయారు. "మీకులాగా డబ్బులిస్తే సీటు ఇచ్చేవాడు" అంది జీవించే విధానం పట్ల సంతృప్తి గల కళ్ళద్దాల పెద్దావిడ. నేను నవ్వి "అవును" అన్నాను.

నిజంగా అబద్ధాలు ఆడటానికే ఎక్కువ గుండె ధైర్యం వుండాలేమో అన్పిస్తుంది నాకు – అంతకంటే సిగ్గులేనితనం కూడా వుండాలేమో అని కూడా అన్పించింది నాకు. లేపోతే ఆ 'పొట్టి' టీసీ ఎంత నిస్సిగ్గుగా వారం కిందే రిజర్వేషన్ చేయించుకున్న, నాకన్నా తక్కువ వెయిటింగ్ లిస్ట్ నెంబరు వున్న ఆ అమ్మాయికి బెర్త్ దొరకదని చెప్తున్నాడు. 'కొంచెం' తెలివైనది అయితే ఆ బాగా అలంకరించుకున్న ఇరవై ఐదేళ్ళ అమ్మాయి ట్రైన్ ఎక్కేముందే లిస్ట్‌లో చూసుకుంటే కన్‌ఫామ్ అయి వున్నదేమో తెలిసేది. ఇలాంటి మోసకారితనం గల వాళ్ళను, నిస్సిగ్గు గల వాళ్ళను చూసి ఎప్పటికప్పుడు ఆశ్చర్యపోతూనే భయపడుతూ కూడా వుంటాను.



అరగంటో, గంటో ఎవరి ఆలోచనల్లో వాళ్ళం వుండిపోయాం. ఇంతలో స్టేషన్ వచ్చింది. ట్రైన్ ఆగింది. 'పొట్టి' టీసీ కిటికీలోంచి నన్ను పిలిచి మరీ 'జాయియే ఆప్ కే బెర్త్ కా పాస్. నహీ హై తో కోయీ భీ ఆక్యుపై కరేగే" అని నాకు చెప్పి "కాదాండీ" అని జీవించే విధానం పట్ల సంతృప్తి గల కళ్ళద్దాల పెద్దావిడ వేపు కూడా చూసి చెప్పాడు. "ఠీక్ హై సర్" అన్నాను. "వెళ్ళొస్తాను" అని మరొకసారి చెప్పి వెళ్ళిపోయాడు 'పొట్టి' టీసి. డ్యూటీ దిగి వెళుతున్నాడనుకుంటా.

ఆ పొట్టి టీసీ అంతగా నాకు చెప్పడం చూస్తే నేను ఇచ్చిన ఆ యాభై రూపాయలు మొదటి లంచమైనా అయి వుండాలి లేదా మధ్య తరగతి కుటుంబీకుడై కొత్తగా లంచాలు పుచ్చుకుంటున్నవాడైనా అయి వుండాలి అన్పించింది. దొంగతనాలకు, దోపిడీ, దౌర్జన్యాలు చేసే వాళ్ళు దర్జాగా రాజదర్పంతో జబర్దస్తీగా చేసుకుపోతున్నారు. చూస్తూ మనం నోళ్ళువెళ్ళబెట్టవలసిందే. ఇలా ఈ పొట్టి టీసీలాగా అతి వినయం ఎవరూ చూపరు అని కూడా అన్పించింది నా మట్టుకు నాకు.

చెప్పొద్దు లంచగొండితనం మనమే నేర్పుతున్నామా అని ఒకింత మనసు మూలలో అన్పించింది. కానీ, వెంటనే కొట్టిపడేసాననుకోండి. ప్రభుత్వానికి తత్కాల్ పేరుతో నూటయాభై రూపాయలు చెల్లించే స్తోమత నాకు లేదు. అలా చెల్లించకపోతే, ఇలా పొట్టి టీసీకి యాభై రూపాయలు 'లంచం' ఇచ్చుకోకపోతే నేడు నేను స్లీపర్ క్లాస్‌లో అమ్మా, అయ్యా అని కింది బెర్త్‌ల వాళ్ళను రిక్వెస్టులు చేసి మీకు ఇబ్బంది కల్గిస్తున్నానని అతి వినయం ప్రదర్శించి ఒక రకంగా దేబిరించుకుని ఒకవేళ ఛీత్కారంగా చూసినా, ఏమైనా మాటలన్నా భరించి కింద పడుకోవాల్సి వచ్చేది. గవర్నమెంట్ వారు సక్రమంగా వుంటే నాకీ లంచగొండితనం అలవాటు చేసే గతీ తప్పేది కదా అని కూడా వాపోయాను నాలో నేను.

నా ఆలోచనల్లో నేనుండగా ఎప్పుడు వచ్చాడో ఆ బాగా అలంకరించుకున్న ఇరవై ఐదేళ్ళ అమ్మాయి యొక్క అన్నయ్య ఫ్రెండ్ తను పెళ్ళి చేసుకోనని 'రిజెక్ట్' చేసిన అతను వచ్చాడు. మొదట ఎలా పలకరించుకున్నారో నేను చూడలేకపోయాను (నేను చూడనందుకు మీరు బాధపడకండి).

ఈ అమ్మాయి ఐస్‌క్రీం తింటూ (బహుశా అతనే తెచ్చి ఇచ్చాడనుకుంటా) వున్నది. అతను కొద్దిసేపు చూసి "ఏం మాట్లాడవేంటి" అన్నాడు. "ఏం మాట్లాడేదీ. పావుగంటలో వెళ్ళిపోతానని ముందే బెదరగొడ్తుంటేనూ నువ్వూ" అంది ఐస్‌క్రీం తింటూనే.

ఏమయ్యా ఐస్‌క్రీం చేతికిచ్చి మాట్లాడమంటే ఎవరైనా ఎలా మాట్లాడతారండీ?

మాట్లాడుతూ కూచుంటే ఐస్‌క్రీం కరిగిపోదా...!? ఆ మాత్రం అర్థం చేసుకోరు మనుషులు. ఏంటో!

"సరే, సరే చెప్పు. అయినా ట్రైన్ కదిలితే నేను ఎలా వుండగలను?" అన్నాడు. పావుగంట మాత్రమే ట్రైన్ ఆ స్టేషన్‌లో ఆగుతుంది. ట్రైన్ కదలగానే అతను ఎలాగూ వెళతాడు. ఆ బాగా అలంకరించుకున్న ఇరవై ఐదేళ్ళ అమ్మాయిని ఏదో బెదిరించినట్టుగా పావుగంటలో వెళ్ళిపోతానని అతని బెదిరింపునూ, ఈవిడ బెదరడమూనూ. అయ్యో! మనుషులూ.

వాళ్ళు ఏమి మాట్లాడుకుంటారో వినాలనే క్యూరియాసిటీ కన్నా, అలా వినడం సభ్యత కాదని నేను నాకు ఇచ్చిన బెర్త్ దగ్గరకు నా బ్యాగు తీసుకుని ఆ కంపార్ట్‌మెంట్ నుండి వెళ్ళిపోయాను. అదండీ నా రైలు ప్రయాణ అనుభవం.

---

# గమనం

**వి. సూర్యారావు**



వాడు
ఆకలి బాధకి
ఇల్లు గడవని స్థితికి
జేబులు కొట్టి
మెళ్ళో గొలుసులు తెంపి
దొంగ
ఐతే, కొట్టండి, కట్టండి, చంపండి –
ఆమె
వంచన సమాజానికి
ఆర్థిక పరిస్థితికి చితికి
బలిగా
పడుపు వృత్తిలోకి
ఐతే, జర్మనా కట్టించి
జైల్లో పెట్టండి –
వాళ్ళు
స్కాముల్లో కోట్లు తిన్నారు
భూ కబ్జాల్లో ఎకరాలు మింగారు
ఇండియన్ పీనల్ కోడ్ లొసుగుల్ని
తమ అడ్డాగా మార్చుకున్నారు
ఐతే, జేజేలు పలకండి
అడుగులకి మడుగులొత్తండి

## నచ్చిన పుస్తకం

# గుండె తడినీ, కంటి చెమ్మనీ దాచుకోలేని కథకుడు



**డాక్టర్ కాకుమాని శ్రీనివాసరావు**

చలం తన రచనల గురించి చెబుతూ "అది నేను, నా రక్తం, నా గడచిన జీవితపు ఛాయ'' అంటాడు. గొరుసు జగదీశ్వరరెడ్డి కథలు చదువుతున్నప్పుడు ఇవే మాటలు గుర్తుకు వస్తాయి. ఈ కథల్లో రచయిత ఆత్మీయతే కాదు, రక్తమాంసాలూ వున్నాయి. కథా శిల్పం పట్ల గొప్ప అవగాహన, నైపుణ్యం ఉన్న కథకుడు కావడం వల్లే ఇప్పటిదాకా అతను రాసినవి ముప్పైలోపే. అందులోంచే అత్యుత్తమ కథలు పది ఎంచి "గజ ఈతరాలు" పేరుతో ఎస్.కె. పబ్లికేషన్ సంకలనం చేసింది.

జీవితంలోని ప్రతి అనివార్యతనూ ఆధునికం అనుకుని రాజీ ధోరణితో సరిపెట్టుకుని మన స్వీయ జీవిత నేలమాళిగలోకి దూరిపోయే మానవ జీవిత పరంపరలో, నిష్క్రియాత్మకంగా అలసత్వంతో బిగుసుకుపోయిన మానవ సంబంధాల గురించీ, సకల మానవ వైఫల్యాల గురించి రచయిత మరమ్మతుకు పూనుకుంటాడు ఈ కథల్లో. చదివే వారిలో ఏదో చేయాలనే క్రియాశీలకత్వాన్ని మేల్కొల్పే కథలివి.

దాదాపు అన్ని కథల్లోను మానవ జీవన వైఫల్యాలు, సరళీకృత ఆర్థిక విధానాలు, వాటి పరిణామాలు చేసిన మానని గాయాలు కనిపిస్తాయి. కథలన్నీ చదివాక మనం ఏది కోల్పోయామో గుర్తు చేసుకునే హృదయం పెనుగులాడుతుంది. ముందుమాటలో చెప్పినట్లు ఈ రచయిత "కొట్టినా తట్టుకోగలడు కానీ ప్రేమిస్తే తట్టుకోలేడు, గుండె తడినీ, కంటి చెమ్మనీ దాచుకోలేడు.''మానవాళి పట్ల అపారమైన ప్రేమ గలిగిన రచయిత, కథలో తాను సంపూర్ణంగా ప్రతిఫలించాలనే ఆర్తి చేత తనివితీరా కథ చెబుతాడు. కథ చెప్పాక కూడా తాను ప్రేమించే పాఠకుడికి ఇంకా దగ్గరవ్వాలనే తపనతో ప్రతి కథ చివరా దాకా నేపథ్యాన్ని గురించి చెబుతాడు.

ఈ సంకలనంలోని మొత్తం పది కథల్లో ఉత్తమ పురుషతో చెప్పిన కథలు ఎనిమిది. "నేను" అని చెప్పే కథలు రాయటం ఎంత తేలికో అంత కష్టం కూడా. బలమైన కథా వస్తువుతో పాఠకుడికి బాగా దగ్గరవ్వాలన్న తపన కలిగిన రచయితే ఈ మార్గం ఎన్నుకుంటాడు. చిన్న చిన్న కథా గతాంశాల్ని కూడా నేర్పుతో తీర్చిదిద్దటం, కథలో వాటిని ప్రధానాంశాలకు బలాన్నిచ్చేవిగా మలచటంలో రచయిత పనితనం, నేర్పు మెచ్చుకోదగ్గవి. రచనాపరంగా ఒక విశేషమేమిటంటే కథల్లో పెద్ద పెద్ద పేరాగ్రాఫులుండవు. చిన్న చిన్న వాక్యాలతో రెండు, మూడు లైనులతో విరిగి పోయే చిన్న పేరాలే ఉంటాయి. దీని మూలంగా పఠిత కథలో తన అనుభవ సాంద్రతను పెంచుకుంటాడు. ఈ కథకుడు ఎక్కువ దృశ్య శకలాల్ని ఈ రకంగా నేర్పుతో అల్లడం ద్వారా మొత్తం కథను విసుగులేకుండా సునాయాసంగా పాఠకుడి చేత అనుభవింప చేస్తాడు.

పాలమూరు పేదలు గల్లంతైన జీవితాలు మూటగట్టుకొని వలస కూలీలుగా విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్మాణంలో పడి ధ్వంసమై పోయిన విషాదాన్ని, కనుమరుగవుతున్న పల్లెలను, గ్రామీణ జీవన సౌరభాన్ని గుర్తుకు తెచ్చే కథల వలస పక్షులు, కళ్ళముందే ప్రపంచాలు మారిపోవడం ఈ కథలో చూడొచ్చు. శ్రమజీవుల మధ్య మానవ సంబంధాల్ని వర్ణించిన అరుదైన కథ ఇది. ఈ కథ చివరలో పాఠకుడు గొప్ప ఉద్వేగాన్ని పొందుతాడు.

జగదీశ్వరరెడ్డిలోని అత్యుత్తమ కథకుడిని బహిర్గతం చేసిన కథ 'చీడ'. తన మనసుకు దగ్గరగా ఉన్న వస్తువుని తీసుకొని తనకు తాను తెలుసుకుంటూ సాగిన కథ 'చీడ'. మానవుని దుఃఖానికి – జీవన వైఫల్యాలకు గల వాస్తవ మూలాలను అంతర్లీనంగా చూపెట్టిన కథ ఇది. కథ చదివాక పుట్టెడు దుఃఖాన్ని దిగుల్ని ఒడిలో పెట్టుకుని తల్లడిల్లిపోతాం. కళ్ళముందే పచ్చటి జీవితాలు చీడపట్టి పోతుంటే ఏమీ చేయలేక చూస్తూ ఉన్న చేతుల్లేని సమాజంలోని "మంచికి" సంపంగి ప్రతీక. అందమైన పూలతీగల్లాంటి బాల్యం ఆర్థిక ఆదరువు కోల్పోయిన కుటుంబాల్లో ఛిద్రమవుతుంటే ప్రకృతి ఆక్రోశం మానవ మనస్తత్వ మూలాల్ని మార్చే ప్రయత్నం చేస్తుంది. అందమైన జీవనం తిరిగి అందరూ పొందాలనే రచయిత తపనకే అద్దం పదుతుందీ కథ.

ఈ కథలోని గాఢమైన ప్రకృతి పరిశీలన మెచ్చుకోదగిన మరొక అంశం. ఎన్నో రకాలైన పూలమొక్కలతో మమేకమైన ఒక అద్భుత జీవనశైలిని రచయిత గుర్తుకుతెస్తాడు. మొక్కల ఆకులపై రాత్రుళ్ళు రాలిన మంచుబిందువులను పిచుకలు ముక్కుల్తో పొడిచి నీరు తాగుతుంటే వాటికి కితకితలు పెట్టినట్లుగా రచయిత రాయడం మనల్ని పులకరింపచేస్తుంది. అర్ధరాత్రి ఆకాశంలో గొరు కొయ్యలు ప్రయాణించడం మనలో ఎంతమందిమి చూసి ఉంటాం. అన్ని కథల్లోకంటే ఈ కథలో రచయిత ఆత్మీయతను పాఠకుడు ఎక్కువగా ఇష్టపడతాడు.

సమాజంలోని "మంచి" యొక్క నిస్సహాయతను చీడ కథలో చూస్తే దానికి ఆగ్రహం వచ్చినట్లు "జగదాంబ జంక్షన్"లో రచయిత చూపెడతాడు. ఉదయం నుంచీ

సాయంత్రం దాకా ఒక శ్రమైక జీవి జీవన సౌందర్యాన్ని ముచ్చటగొలిపే విశాఖ మాండలికపు సొగసుతో అద్దె ఈకథలో మన ముందుంచుతాడు. సత్యానికి అసహనం, అగ్రహం వచ్చినపుడు అది కొట్టే చెంపదెబ్బలాగ గురమ్మ గుర్తుండిపోతుంది. రావిశాస్త్రి కథల్లోని సూకాలమ్మ, ముత్యాలమ్మల్లాగా చిరకాలం మిగిలిపోయే పాత్ర గురమ్మ. కథ చదివాక చదువుకోవాల్సిన వయసులో పాడుకుంటూ అడుక్కుని జీవనం వెళ్ళదిస్తున్న బాల్యం పట్ల విపరీతమైన దయ, సానుభూతి, వారిని దగ్గరకు తీయాలనే ఆలోచన కలుగుతుంది. భద్రంగా బతికే జీవితాల్లో ఉండే సుఖం, లాలస పేదల జీవితాలకు దూరమై ఊరించడం గమనించాల్సిన మరొక అంశం.

తనకు చిన్నప్పటినుండీ తెలిసిన గజ ఈతరాలు పూర్ణమ్మ కాళ్ళకు తాళ్ళతో బండరాయి కట్టుకొని బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకోవటం విని గుండెలో ముల్లుగుచ్చుకొన్నట్లు అనుభవించిన విషాదాన్ని మనలో పలికించడానికి తన బాల్యాన్ని ఆలంబనం చేసుకొని గొప్ప పనితనంతో చెక్కిన కథాశిల్పం "గజ ఈతరాలు"

కథలో కనపడే రచయిత అభిరుచికీ తన అభిరుచికీ చక్కటి సంవాదం కుదరడం ద్వారా కథనంలో పూర్తిగా పాఠకుడు లీనమవుతాడు. అడవిలోని రకరకాల చెట్లు, పండ్లు, పిల్లల ఆటలు, వాటి వివరాలు, ఆహ్లాదకరమైన హాస్యం. చక్కటి పనితనం మొదలైన అంశాలతో ఈ కథ ఎంతో కాలం గుర్తుండిపోతుంది.

ఆల్విన్ వాచ్ కంపెనీ మూత పడటంతో జీవచ్ఛవాలుగా మారిన, రోడ్డున పడ్డ కూలీల కార్మికుల ఆత్మఘోషను వినిపించే కథ బతుకు గోస, వైవిధ్యమైన టెక్నిక్‌తో మనల్ని కూడా ఆత్మతో పాటు కథంతా తిప్పుతాడు. "గోస్ట్" అనే సినిమాలోని ఈ టెక్నిక్‌ను అనుసరించానని రచయితే చెప్పుకున్నాడు.

రచయితే చెప్పినట్లు ''పుడమి పుటల్లోంచి పుంఖానుపుంఖాలుగా పుట్టుకొచ్చిన అల్పాయుష్షు ఉసుళ్ళ వంటి మనుషులు ఆకలి మంటలో పడి జీవనార్పణ చేసుకొనే విధ్వంసం ఉసుళ్ళు కథలో కనిపిస్తుంది. రకరకాల ఆకళ్ళతో నిండిన సమాజం అన్నెం పున్నెం ఎరుగని యాదమ్మలాంటి అడుక్కుతినే బాలికలను బలిచేయటం పాఠకుని రక్తాన్ని ఉడికిస్తుంది. మన హృదయ కవాటాల దగ్గర ఆ అల్పప్రాణి "ఓ దొర్సానీ! మూడ్దినాల నుండి బువ్వదింలే. సచ్చి నీ కడుపుల పుడ్త. జెరంత..." అని ఎలుగెత్తి పిలిచే ఆకలి కేకలు మార్మోగుతాయి.

కాలం గీసిన మరొక కరుకు చిత్రం వాల్తేరత్త కథ. గొప్పగా, దర్జాగా బతికిన వాల్తేరత్త చివరి రోజుల్లో అనుభవిస్తున్న దుఃఖం, వ్యథ మనకి దిగులు పుట్టిస్తుంది. పాత్రల్ని, వాతావరణాన్ని సంపూర్ణంగా మన అనుభవంలోకి తీసుకొని రాగల నైపుణ్యం ఈ కథకుడిలో నిండుగా వుంది. కళ్ళొత్తించే మానవ సంబంధాల చిత్రణ పఠిత హృదయ క్షాళన చేస్తాయి. దాదాపు అన్ని కథల్లోను పాటల్ని, గేయాలని సందర్భోచితంగా వాడటం ఈ కథకుడి ప్రత్యేకత. దీనివల్ల నిండైన కళానుభవం, సాంస్కృతికానుభవం కలుగుతుంది. చరిత్ర, సామాజిక శాస్త్రాలు కలిగించలేని ప్రయోజనాలను ఈ సంకలనం కలిగించగలిగింది.

ఈ కథలోని ఈస్తటిక్స్ గురించి ప్రత్యేకంగా చెప్పాలి. సంపెంగ వృక్షాల్ని చూసినప్పుడల్లా సింహాచలం కొండ గుర్తుకు రావడం, బాల్య స్నేహితులిద్దరూ దొంగతనంగా తెచ్చిన జీడికాయల్ని కాల్చుతున్నప్పుడు అవి రసం కక్కుతూ ఫట్ ఫట్ మని శబ్దం చేస్తూ ఎగిరిపడటం, కాల్చుతున్నప్పుడు వాటి నుండొచ్చే ఒక విధమైన వాసన పఠితలో నిద్రాణంగా ఉన్న "అభిరుచి"ని మేల్కొలుపు తుంది. రచన పట్ల, రచయిత పట్ల ఒక విధమైన ఇష్టం, ఆప్యాయత కలుగుతుంది. సౌందర్యానుభవం ఎలా కలిగించాలో తెలిసిన కళా మర్మజ్ఞుడు గొరుసు.

భవిష్యత్ సమాజాన్ని మోయాల్సిన నవతరం మానవ సంబంధాల్ని భుజాన వేసుకుని, ప్రేమానురాగాలను, ఆప్యాయతలను గుర్తుంచుకోగలిగే ప్రజలైనపుడు ప్రపంచం పట్ల ఆశ పుడుతుంది. అలాంటి గొప్ప ఆశావహ దృష్టిని కలిగించే కథ వాచ్‌మెన్. అపార్టుమెంట్‌లోని అందరూ మాకెందుకని వాచ్‌మెన్ శవాన్ని వదిలించుకోవాలని చూసినపుడు నిజాయితీతో యువతరం దహన సంస్కారానికి ముందుకు రావడం మనం కోల్పోతున్న మానవతను, ప్రేమను తెలియపరుస్తుంది.

వ్యవస్థలో అమలవుతున్న దోపిడీ వెనుక ఉన్న దోపిడీని చెప్పిన కథ జలగల వార్డు. వైద్యం ఖరీదైన వస్తువుగా మారిన సామాజిక సందర్భంలో పేద ప్రజలకు ప్రభుత్వ హాస్పిటళ్ళే దిక్కుగా మారుతున్నాయి. అక్కడి పేద రోగుల జీవితాల్లోని ఆకలి తాండవాన్ని అన్ని కోణాల్లోను చూపెట్టిన కథ ఇది. పేదవాడినే దోచుకునే పేదవాడి జీవితపు చీకటి కోణం, ఆర్థిక అవసరం మనిషిని ఏ స్థాయికి దిగజారుస్తుందో ఈ కథలో తెలుసుకొని హతాశులమవుతాం.

ప్రపంచీకరణ చేసిన గాయాల్ని బలంగా ఒక దశాబ్దం క్రితమే చెప్పిన కథ "ఖాయిలా బతుకులు". పూర్తి ఆర్థికపరమైన సామాజిక వస్తువును కథగా మారుస్తున్నపుడు ఈ కథకుడు ఆర్ద్రమైన జీవన స్పర్శను మరచిపోడు. సిద్ధాంతాలు, ఉపన్యాసాలు లేకుండా బతుకు చిత్రణలోంచీ ఒక చారిత్రక వాస్తవాన్ని కళాత్మకంగా మలిచి చెబుతాడు. ప్రభుత్వరంగ సంస్థల మూసివేత వెనకనున్న కుట్రను సాక్ష్యాధారాలతో గొప్ప సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తూ రికార్డు చేసిన కథ ఖాయిలా బతుకులు.

పుస్తకం చివరికొచ్చేటప్పటికి మంచి స్నేహితుడిని మిస్ అవుతున్నట్లు హృదయం రెపరెపలాడి పోతుంది. చేతివేళ్ళు అప్రయత్నంగా మళ్ళీ పేజీలను ఆర్ద్రంగా తడుముతాయి. కథలన్నీ మనం పోగొట్టుకున్న జీవన సౌందర్యాన్ని గురించి చెబుతూ, మళ్ళీ దాన్ని అందుకోవాలన్న ఆశను కల్పిస్తూ సాగడం వల్ల ఈ కథా సంకలనం సాహిత్య ప్రయోజనాన్ని సాధించగలిగింది.



## పరిశోధకురాలు, రచయిత్రి పి.యశోదారెడ్డి మృతి

అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షురాలు, సాహితీ విమర్శకురాలు పి. యశోదారెడ్డి అక్టోబర్ 7న మృతి చెందారు. 78 సంవత్సరాల యశోదారెడ్డి సంస్కృత భాషా పరిశోధకురాలిగా, తెలుగు సాహితీ విమర్శకురాలిగా, వక్తగా విశేష ప్రతిభా సామర్థ్యాలు కలిగినవారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధిపతిగా, సారస్వత పరిషత్ కార్యవర్గ సభ్యురాలిగా సాహిత్య కృషి చేసిన యశోదారెడ్డి సాహిత్య అకాడమీ అవార్డుతో పాటు పలు గౌరవాలు అందుకున్నారు. ఆకాశవాణిలో కూడా పనిచేసిన వీరు 20కి పైగా పుస్తకాలు రాశారు. యశోదారెడ్డి భర్త ప్రముఖ చిత్రకారులు పి.టి.రెడ్డి.

## కవితలు

# చిన్నోడు



### కటుకోఝ్వల రమేష్

వయసెంత మీదపడ్డా
ఈ మెదట్లో
చిన్నోడి గుసగుసలే
ఎంత నిద్రపుచ్చినా
మేల్కొనే వుంటాడు
మారాం చేస్తూనే వుంటాడు
రోజూ... బుజ్జగింపే...!

నెరసిన వెంట్రుకలు
ముడతలు పడ్డ చర్మ
నిలువెత్తు పెద్దరికం
అంతా భౌతికమే

లోలోన లోలకంలా
అటూ ఇటూ
ప్రతీ క్షణం
పొగడ్తల చప్పట్లూ

బహుమతుల దుప్పట్లూ
నిత్యం చప్పరించడానికి
తీయని కీర్తి చాకిలేట్లు
అబ్బ! ఇవన్నీ
వాడికెంత యిష్టమో...!

ఎప్పుడూ...
ఏది తక్కువైనా
చిన్నబుచ్చుకుంటాడు
మొఖమంతా
ముడుచుకుంటాడు

ఎంత ఈసడించుకున్నా
ఈ మనసును పట్టుకునే
యాళ్ళాడతాడు

ఏదో విమర్శతో..
కృంగి పోతాడు
ఓ ప్రశంసతో...
శిఖరమైపోతాడు
ఉనికి కోసం...
ఎల్లప్పుడూ పాకులాడుతాడు

అనుభవం
వృద్ధాప్యంలోకి జారినా
వాడు మాత్రం పెరగడు
పెద్దోడు కాడు
బోన్‌సాయిలా...!

చిన్ని చిన్ని ఆశల్ని
పోగేసుకుంటూ
చిట్టి పొట్టి చేష్టల్తో
ఈ దేహానికే
అతుక్కు పోతాడు

ఎన్ని ధర్మాలు
నూరి పోసి పొమ్మన్నా
నాతోటే వాడూ...
కాలధర్మం వరకూనూ...

# శిథిల స్వప్నం



### పి. లక్ష్మణ్‌రావ్

బతుకు మీద ఆశ
అంతరిక్షయానం చేసి
నగరం నడిబొడ్డులో
శిలావిగ్రహం నెత్తిమీద వాలి
జామ్ అయిన ట్రాఫిక్‌లో
ఇంధనం ఇగిరిన బండి అవుతుంది
జీవితం
సగం కాలిన దేహమై
కమురు కంపు కొడుతూ
బతుకు చిత్రాన్ని
కాలుష్యపు కోరలకు
బలిచేస్తుంది
వలస బతుకుల్లో మిగిలిన దుఃఖం
దిగులు మబ్బై
ఎదల ఎడారిపై కురుస్తుంటే
ఉనికి ప్రశ్నార్థకమై
కాళ్ళకింద మట్టిని
తొలిచేస్తుంది
నగర జీవనమంటే
నిలువునా దగ్ధమౌతూ
అగ్ని కీలలతో ఎగిసిపడి
బూడిదై కుప్పకూలడమే!
శిథిల స్వప్నమై నిట్టూర్చడమే

# జనాగ్రహం

### పడాల బ్రహ్మాచారి

జనాగ్రహానికి ఆహుతియైన
నాయకులెవరూ బ్రతికి
బట్టకట్టలేరు
కట్టలు తెంచుకున్న
ఆగ్రహావేశాలు ఎవ్వరు ఆపలేరు
పిడికిలి బిగిసిందంటే
బలిసిన వాడి పతనం ఖరారు
ఊసురోమని ఊరుకున్న
వానిపైన కర్ర పడితే
ఉవ్వెత్తున లేచే కెరటం అవుతుంది
జల సమాధి చేస్తుంది
ముక్కుకి ముగుతాడు వేసి
చెర్నాకోల ఝుళిపిస్తుంది
ఛెల్‌మనిపిస్తుంది
ముదిగొండలో ఎరుపురంగుపై
దాడి చేసినవాని భరతం పడుతుంది
ఘర్షణ ఘర్షణ సంఘర్షణయై
బీదవాని మానాన్ని ప్రాణాన్ని
తీసుకున్న వైనాన్ని
చూస్తూ ఊరుకోలేం
భవిష్యత్తు లేకుండా చేస్తాం
తుదకు ప్రజలదే పై చేయియని
నిరూపిస్తాం

# ఉద్యమ యాగం నడిపించు...!

### తాతోలు దుర్గాచారి

ఏం జరుగుతోందిక్కడ....?
నువ్వు స్పృహలో లేకపోతే
చాలా చాలా గతించిపోతాయి
ఒక చెంప మీద కొడితే
రెండో చెంప చూపించిన
మహాత్ముడు పుట్టిన దేశంలో
నేడు రెండో చెంప చూపేలోపే
నీ బ్రతుకు బాట మీదే దెబ్బ కొడతాడు
నాటి తెల్లవాడికీ,
నేటి మనవాడికీ అంత తేడా...
నిన్ను నువ్వు సంస్కరించుకుంటూనే
పక్కనున్న సమాజాన్ని గమనించు...!
ఏ ఒక్కడి నిస్వార్థమూ...
ఈ సంఘాన్ని ఉద్ధరించలేదు –
నీ ఆకలి కేకలు, ఆర్తనాదాలూ
ఈ జాతిని తట్టి లేపలేవు
బలుపుగా పెరిగిన
కలుపు మొక్కలకేం తెలుసు?
నీ అభాగ్యపు ఘోష...?
అందుకే,
ఓ పోరాట ధీరుడా...!
వాడవాడలా చైతన్యాన్ని రగిలించు!
దశ దిశలా నీ గుండె చప్పుళ్ళు వినిపించు!!
అభ్యుదయ సమాజానికై
ఉద్యమ యాగం నడిపించు!!

## దృశ్యం

# మనమూ, మన "ఆట"గాళ్ళూ



**రోవగ్రక్**

అవునండీ వీళ్ళంతా మన "హీరో"లు, అదిగో క్రికెట్ ప్రపంచ కప్పు తెచ్చేస్తాం చూడండి, అందర్నీ ఫటాఫట్ బాది అన్నారు ధీమాగా. వెళ్ళేప్పుడు మనమంతా యిచ్చాం ఘనమైన వీడ్కోలే, వీళ్ళకి తగినట్టుగా, అక్కడికెళ్ళేం చేశారు, చతికిలబడ్డారు, ఏ ఏడో "రేంకో" వున్న దేశంతో.

యిట్లా ఎందుకైందయ్యా అంటే ఎవరైనా మా ముఖ్యమైన "ఆట"గాళ్ళంతా "ఫాం"లో లేరంటారు, అసలు యీ "ఫాం" అంటే ఏమిటో, అది క్రికెట్టాటకే యెందుకు వర్తిస్తుందో తెలీదెవరికీ, అడగదెవ్వరూ. "ఫాం"లో లేడంటే, వ్యాయామం చెయ్యడనా, నియమితంగా "ప్రాక్టీసు" చెయ్యడనా?

ఇక్కడ వో విషయం గుర్తొస్తుంది. మన కార్తికేయన్ ("ఫార్ములావన్" రేసర్) వోసారి ఉదయం అయిందిటికే "జిమ్"కి వెళ్ళే, అంతకుముందే అక్కడ రెండు గంటల ముందే వొచ్చి వ్యాయామం చేస్తున్నాట్ట. మైకేల్ షూమాకర్ అనితర సాధ్యమైన విజయ సాధకుడు. "ఫార్ములావన్" రేసుల్లో. మరి

మన "సచి"న్నడగండి. ముప్పైయో పైనో నాలుగైదో "వంద" అంతకుముందే "కొట్టి" వయసుడిగిన "బ్రాడ్‌మన్"తో సెభాసనిపించుకున్నాడు చాలు. ఇక చెయ్యక పోతేనేం ఏ "ప్రాక్టీసూ?" గెలవకపోతేనేం. ఏ "మ్యాచ్"లూ. కాలుమీద కాలు వేసుకొని గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్నా అలవోకగా.

సంపాయిస్తాడు ముప్పై, నలభై కోట్ల రూపాయలలో ఏడాదిలో. ఈ టీవీల (No Run) పుణ్యమాని, "బూస్టు" తాగు "సచిన్" వంతటి వాడివవుతావనీ చెప్పే ప్రకటనదార్లున్నంత కాలం, యీ మొబైల్ ఫోనే వాడు, జీవితంలో ముందుకెళతావంటూ వీళ్ళ ముఖాల్నీ హావభావాల్నీ వాడుకునే కంపెనీలున్నంత కాలం. నా చిన్నప్పుడెప్పుడో "అబీబ్ బికిబీ" అనే అతను ఇథియోపియా దేశానికి చెందినతను కాళ్ళకు జోళ్ళైనా లేకుండా ఒలింపిక్ "మారథాన్" పరుగెత్తి గెలిచాడనీ, మళ్ళీ నాలుగు సంవత్సరాల తర్వాతా అదే "మారథాన్" గెలిచాడని వినీ, చదివీ ఒళ్ళు గగుర్పొడిచేది. పైగా అతను రోజులో మూడోవంతు గడిపేవాట్ట ఇథియోపియా రాజుకు అంగరక్షకుడిగా, చాలీచాలని జీతంతో. ఇథియోపియన్లు మొత్తం మన దేశవాసుల్లో ఎన్నోవంతో మీకు నేను లెక్కలు వేసి చెప్పక్కర్లేదు, మీకు తెలుసు. అదీ మన వరస.

క్రికెట్‌ని గురించంటారా? ఆ ఆటకి పుట్టిల్లయిన ఇంగ్లండ్‌కే చెందిన పేరుగల రచైత బెర్నార్డ్ షా మాటలు "ఎ లెవెన్ ఫూల్స్ ప్లేయింగ్... వగైరాలు మీకు గుర్తు చేయనక్కర్లేదుగా. అయినా యిదొక్కటేనా ఆట. మన "జాతీయ ఆట"గా గుర్తింపు పొందిన "హాకీ" ఏమైందండీ?

హాకీ ఆటగాళ్ళు నిధుల కొరతతో చెట్టుకొకడు, పుట్టకొకడుగా అయినాడు. ఒలింపిక్స్‌లో మనం వరసగా ఆరు (అవును ఆరు, అంటే ఇరవై నాలుగు సంవత్సరాలు) సార్లు స్వర్ణ పతకాలు గెల్చుకున్నామనే విషయం బహుశా యీ "జనరేషన్" వాళ్ళ కెవరికీ తెలీదు. క్రీడా చరిత్రకారులకి తప్ప.

మన హాకీ ఆటగాళ్ళ దుస్థితి చూసి, సమాధి క్రింది "ధ్యాన్‌చంద్" ధ్యానంలో పడిపోయి వుంటాడు. అతనే లేచి రాగలిగితే ఏ మిరకిల్ అయినా జరిగి చెట్టుకోళ్ళుగా బాది బాది వెంటాడుతూ యీ సెహ్వాగ్లనీ, ధోనీల్నీ, సచిల్నీ,? గొప్ప ఆటగాళ్ళే వీళ్ళు మరి, కాకపోతే అందరి ముందు ఆడటం నామోషీ.

కండలు కరిగించి, కష్టపడి, నిత్య వ్యాయామం చేసి తన భుజబలంతో బరువులెత్తిన కరణం మల్లీశ్వరి కనీసం ఏ "వివా"కైనా, "హార్లిక్స్"కైనా ఏ ప్రకటనా యివ్వ లేదా? "అచ్ఛా" ఆమె ముఖం "ఫొటోజెనిక్" కాదంటారేమో. ఆమె మనకి అపూర్వంగా ఒలింపిక్స్‌లో కాంస్య పతకం తెచ్చినా? కాకపోతే "మారాజు"లో ప్లాటో, ఇల్లో ఇచ్చినట్టున్నారామెకి. మనకి "స్పోర్ట్స్"కీ, "గేమ్స్"కీ తేడా సరిగ్గా తెలీని "స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ ఇండియా" వుందని విన్నామా. వీళ్ళు నిజంగా "స్పోర్ట్స్"కి ఎంత ఖర్చు చేస్తున్నారో ఎవరికీ తెలీదు. అన్నీ దిగమింగడాలు అయింతర్వాతైనా. సరిగ్గా వెతికి వెలికి తీయండి మన్లోనూ "కార్ల్‌లూయీ"లూ.

మైకేల్ షూమాకర్‌లూ, అబీబ్ బికిలాలూ దొరుకుతారు ఎంతోమంది. వంద కోట్లని దాటింది మన జనాభా మరవకండి, మన్లో వందో వంతూ లేని దేశాల్నించి వొస్తున్నారు, ప్రపంచ ఛాంపియన్లూ, వీరులూ, ధీరులూ, మగవాళ్ళల్లోనూ, ఆడవారిలోనూ, వాళ్ళని ముందుకు తెండి. రాజకీయాల కతీతంగా నిజాయితీగా వాళ్ళకిప్పించండి శిక్షణ, చిన్నప్పట్నుంచీ చైనావాళ్ళలా (వాళ్ళకి "జిమ్నాస్టిక్స్" మూడో ఏటి నుంచే నేర్పుతారు తెలుసా మీకు) అయినా మనదొక శైలి (పని మనం తప్పుగా నీచంగా అనుకునే) వాళ్ళ పిల్లలోంచే పుట్టుకు రాగలరు జిమ్నాస్టిక్ ఛాంపియన్లు.

ఇకనైనా వొదిలెయ్యండి సచిన్ల, సెహ్వాగ్‌ల, ధోనీల మీది పిచ్చి. సరియైన దార్లో ఆలోచించండి, ఆలోచింపచెయ్యండి ప్రభుతనీ, ప్రజల్నీ.

# శ్రీశ్రీ తాత్వికాలోచనలు : ఒక పరిశీలన



**శ్రీశ్రీలో ప్రధానమైనది కవితా చైతన్యం.దాన్ని అనేక దశల్లో అనేక విధాలుగా వినియోగించి ఉండవచ్చు. ప్రధానంగా మార్క్సియతత్వానికి కవిత్వం ద్వారా ప్రజల్లో ప్రాధాన్యం కలిగించడంలో శ్రీశ్రీ తాత్వికత తెలుగు సాహిత్యంలో ఒక చారిత్రక దశని రూపొందించింది. రాజకీయాది విషయాల్లో చాలాసార్లు శ్రీశ్రీ విరుద్ధ ప్రకటనలు చేశాడు గాని, సాహిత్యం గురించి, తాను ఏర్పరచుకున్న భావాల్ని ఎప్పుడూ మార్చుకోలేదు. ప్రాచీన సాహిత్యం గురించి ప్రసక్తి వచ్చినా, 30లలో చెప్పినట్లే 80లలోనూ చెప్పాడు.**

**డాక్టర్ అద్దేపల్లి రామమోహనరావు**

ఒక గొప్ప ఆలోచనాపరుడు, తనలోని తన సంవేదనలకి సమాజం తనపై ముద్రించే సంవేదనలకీ కలిగిన అనేక కోణాల సామరస్యంనుంచీ, సంఘర్షణలనుంచీ, తనదైన తాత్విక చింతనను అభివృద్ధి చేసుకుంటాడు. కొందరి విషయంలో అనేక పరిస్థితుల వలన ఈ చింతనలో పరిణామాలు కూడా కనిపిస్తాయి. శ్రీశ్రీ అత్యంత చైతన్యవంతుడైన కవి. కవిత్వమే అతని ప్రధానమైన జీవ లక్షణం. 1930 నుండి 1980 దాకా కవిత్వాన్ని రాసి, సమాజాన్ని ప్రభావితం చేసిన గొప్ప కవి. 30 నుండి 80 దాకా తెలుగు సమాజంలో, మొత్తం ప్రపంచంలో అతి వేగవంతమైన ఎన్నో మార్పులు జరిగినై. వీటన్నటి యెడలా మేలుకొని ఉండి, సమాజ గమనంతో పాటు, తన భావాల్లో కూడా పరిణామం పొందిన వారు శ్రీశ్రీ. సమాజంలో జరిగిన మార్పుల్నీ, శ్రీశ్రీలో పరిణమించిన చైతన్యాన్నీ దృష్టిలో పెట్టుకుని, అతని తాత్వికాలోచనల్ని అంచనా వెయ్యడానికి ఉద్దేశించింది ఈ వ్యాసం.

## 1

శ్రీశ్రీ 1910లో జన్మించాడు. 16 ఏళ్ళ వయస్సుకే పూర్వాంధ్ర సాహిత్యాన్నీ, ఆంగ్ల సాహిత్యాన్నీ హృదయపూర్వంగా చదివినవాడు. 1927 నుండి 33 వరకు శ్రీశ్రీలో ఒక స్పష్టమైన దశని గమనించవచ్చు. అది 'ప్రభవ' పద్యాలు రాసిన దశ. అప్పుడప్పుడు పద్యాలు, తన జీవితాంతం రాసినట్లు కనిపిస్తుంది గాని, పూర్తి భావ కవిత్వ దశ 27-33 మధ్య ప్రగాఢంగా వుంది. భావకవుల్లో వ్యక్తి స్వేచ్ఛ, ప్రాకృతిక లీనత్వం, ఆత్మాశ్రయత్వం, ప్రణయం మొదలైన ఎన్నో లక్షణాలున్నైగాని, వారెవరూ ప్రాచీన కవిత్వాన్ని ద్వేషించలేదు. మొదటి దశలో శ్రీశ్రీ కూడా సంప్రదాయ ప్రేమికుడే. 'అంతస్సమాధి' అనే ఖండికలో కృష్ణరాయల కాలాన్ని తలచుకుని ఇలా అంటాడు :

'ఆ వైభవమ్ము / అప్పటి ధరా రమణ గౌరవాతిశయము / ఆ దినమ్ముల సౌఖ్యానుమోదరక్తి / నాటి సంపత్సమృద్ధి ఏనాటికైన / ఆంధ్ర నిర్భాగ్య ధాత్రికి నలవడునొకొ!' (1928)

ప్రభవ పద్యాల నిండా విశ్వనాథ, కృష్ణశాస్త్రిల ప్రభావం అతి స్పష్టంగా కనిపిస్తుంది. సంప్రదాయ దృక్పథంలోని మానవత, శాంతి ఆ రోజుల్లో శ్రీశ్రీని ఆకర్షించిన తాత్వికాంశాలు. 'బౌద్ధ తేజస్సు' అనే ఖండికలో ఒక పద్యం ఇది.

'ఒక్క కరుణార్ద్ర నయన కవోష్ణధార / గగన నది కెరటాలుడుకనే దహించు / ఒక్క యెడ ప్రేమచే మ్రోయునోచరాచ / రాత్మకము విశ్వహృదియె విహ్వలత కంచు'

'స్వేచ్ఛ' భావకవిత్వంలోని ప్రధాన ప్రేరణ. పూర్వ సమాజంలో మనిషి ఏదో విధమైన సమాజ ఆధిపత్యంలో సొంత గొంతును కోల్పోతాడు. ఆ గొంతు కోసమే భావకవిత్వం తపించింది. కృష్ణశాస్త్రిలా శ్రీశ్రీ స్వేచ్ఛ గురించి పద్యాలు రాశాడు. మానవత, స్వేచ్ఛ, శాంతి - అనే మూడు తత్వాలు, మొదటి దశలో శ్రీశ్రీలో స్ఫుటంగా కనిపిస్తై. శాంతి గురించి 'నా సొద - నా రొద' అనే ఖండికలో రాస్తాడు. ముందుగా శాంతి కోసం పద్యాల నాశ్రయించాడు. అక్కడ శాంతి దొరకలేదు. ఏకాంత ప్రదేశంలో సంగీతాన్ని ఆశ్రయించాడు. అక్కడా శాంతి లభించలేదు. గుహల్లోకి వెళ్ళి, శోకతప్తుడై ఘోషించాడు.

'శాంతి సామ్రాజ్య సంస్థాపన కోరి/ భోరున కెరవివాపోయెద నేను' అని ముగించాడు. అంటే శాంతి అక్కడా లభించ లేదు. స్వేచ్ఛ గాని శాంతిగాని భావ కవులందరూ చెప్పి ఉండివచ్చుగాని, శ్రీశ్రీలో ఒక ఆవేదనాపూర్వకమైన అసంతృప్తి ఉంది. అందుకే 'శాంతి' ఎక్కడో ఒకచోట లభించిందని చెప్పలేదు. ఏదో ఏదో అందుకోవాలనే తపన అతణ్ణి ముందుకు నడిపించింది. తర్వాత మరో పరిణితిలోకి వెళ్ళాడు. ఈ నేపథ్యంలో అతని అసంతృప్తి, పురోగమన కాంక్ష కొన్ని పద్యాల్లో వ్యక్తమవుతుంది. 'శ్రీశ్రీ విలాస వీధులు' అని నాలుగు గేయాలు రాశాడు. అందులో చివరి గేయం ఇది.

' 'ఆ విలాస పథాల కనవరతమీయాత్మ / తలపులో చవిత విహ్వలితమై పలవించు / కాలావధులు దాటి కకు బంతములు దాటి / ఆ విలాస పథాలా వరించదలంచు"

'కాలావధులు దాటి, కకు బంతములు దాటి' అన్నప్పుడు తనకు తానే తన హద్దులు దాటి పోవాలనే కాంక్ష కనిపిస్తుంది. భావకవులందరూ అక్కడే ఆగిపోతే, శ్రీశ్రీ మాత్రం మార్పు పొంది, సామాజిక చైతన్య తత్వంలోకి ప్రయాణించాడు. మానవత, స్వేచ్ఛ, శాంతి అనే మూడు తత్వాల అవగాహనలో ఆయనలో గొప్ప పరిణతి వచ్చింది. ఆ సమయంలో వచ్చినవే 'మహాప్రస్థానం' కవితలు.

## 2

1933 నుండి 1941 దాకా 'మహా ప్రస్థానం'లోని కవితలు రాయబడినై. 'ప్రభవ' తర్వాత తాత్వికంగా శ్రీశ్రీలో పెనుమార్పు వచ్చిన దశ యిది. 30ల నుంచి శ్రీశ్రీలా పరిణమించిన ఆలోచనలకు మూలం రెండు భావధారలు. మొదటిది గురజాడ రచనల ద్వారా కలిగిన నవీన తత్వం. రెండోది

పాశ్చాత్య సాహిత్య ప్రభావం వల్ల కలిగిన తిరుగుబాటుతత్వం. ఇంతకుముందు శ్రీశ్రీది తన లోపలికి చూసుకున్న ఆత్మాశ్రయ ధోరణి. ఇప్పుడు సమాజపు ఒరిపిడి రాయిపై తనను ఘర్షింపచేసుకున్న సామాజిక భావన. గురజాడ ఆధిక్యానికి కారణాలు చెప్తూ శ్రీశ్రీ అంటాడు.

'... వీటిలో ముఖ్యమైనదీ మొట్టమొదట చెప్పుకోవలసిందీ ఏమిటంటే, ఏ కవికైనా సరే, అతని చుట్టూ ఒక సమాజం, ఆ సమాజానికొక చరిత్ర, ఆ చరిత్రకొక పరిణామం ఉంటాయి. సామాజిక చారిత్రక పరిణామ గమనంలో కవి యొక్క సాహిత్య స్థానం నిర్ణీతమవుతుంది. కవి ప్రగతిశీలీ, ప్రతిభాశాలీ అయితే ఆ గమనాన్ని అతడు మరింత వేగవంతం చేస్తాడు. సామాజిక పరిణామానికి విప్లవ పంథాలో వేగం సాధించిన మహాకవిగా గురజాడ అప్పారావుకి నేను నమస్కరిస్తున్నాను!

శ్రీశ్రీ మనస్సు వ్యక్తి నుండి సమాజానికి విస్తరిస్తుంది. భావ కవిత్వ దశ నుండి సామాజిక వికాస దశకు మళ్ళిన సంధికాల సూచన 'జయభేరి' కవితలో కనిపిస్తుంది.

'నేనొకణ్ణే / నిలిచిపోతే / చంద్రగాడ్పులు, వానమబ్బులు, మంచుసోనలు / భూమి మీదా భగ్నమౌతాయి / నింగి నుండీ తొంగి చూసే / రంగు రంగుల చుక్కలన్నీ / రాలి నెత్తురు కక్కుకుంటూ / పేలిపోతాయి.'

అన్న భావన 'నేను' అనే ఆత్మ ప్రత్యయానికి సంబంధించినదే. కాని, కవిత చివరలోని భావ చిత్రాలు సామాజిక చైతన్య పరిణామాన్ని సూచిస్తై.

'నేను సైతం ప్రపంచాబ్జపు / తెల్లరేకై పల్లవిస్తాను / నేను సైతం విశ్వవీణకు / తంత్రినై మూర్ఛనలు పోతాను / నేను సైతం భువన భవనపు / బావుటానై పైకి లేస్తాను.

"నేను ఈ విశాల ప్రపంచంలో ఒక చిన్న భాగాన్ని సమాజ సంపూర్ణ గమనానికి నా సహకారం నేను, ఎంత అల్పంగానైనా సరే నెరవేరుస్తాను" అనే భావన తనను తాను సమాజంలో లీనం చేసుకోవడమే. ప్రపంచమనే పద్మానికి తనొక రేకు. ప్రపంచమనే వీణకు తనో తీగ. తన బాధ్యతను నెరవేరిస్తే, ప్రపంచపు మేడ మీద జెండాగా ఎగురగలడు. 'నేను సైతం' అనడంలోనే ఆత్మప్రత్యయం, వినయశీలంగా మారిన వైనం కనిపిస్తుంది.

గురజాడ నుండి శ్రీశ్రీ ప్రధానంగా నేర్చుకున్నది ఆధునికత. గురజాడకు పూర్వం ఉన్న రాచరిక భూస్వామ్య వ్యవస్థలోని అసమానతా భావాన్ని తొలగించి, సమదృష్టి నేపథ్యంలో అన్ని కోణాల్లోనూ సంస్కరణ తీసుకురావడమే గురజాడ లక్ష్యం. కులం, మతం, స్త్రీ పురుష సంబంధాలు, మూఢ విశ్వాస నిర్మూలన, శాస్త్రీయ ప్రగతి, భాష మొదలైన అన్ని విషయాల్నీ ప్రజాస్వామ్య బద్ధంగా, నిర్దుష్టంగా వివేచన చేసిన మేధావి గురజాడ. తన ఆలోచనలనన్నిటినీ తన సాహిత్యంలోకి తీసుకువచ్చాడు. దీన్నే ఆధునికతగా, గురజాడ ఆధునిక సాహిత్యానికి ద్వారాలు తెరిచిన యుగద్రష్టగా చెప్పుకుంటాం. గురజాడ నుంచి, ఆధునికతా దృష్టిని శ్రీశ్రీ అలవరచుకున్నాడు. అంతేగాక పాశ్చాత్య సాహిత్య ప్రభావం చేత అంతర్జాతీయంగా వస్తున్న పారిశ్రామిక సంస్కృతి, ప్రజా విప్లవాలు, మనస్తత్వ విశ్లేషణ మొదలైన ఆధునికతా విధానాల్ని కూడా జీర్ణించు కున్నాడు. అందుకే విస్తృతమైన 'ఆధునికత'కి శ్రీశ్రీ మొదటివాడైనాడు. ఆయన రచనల్లో పాతదనాన్ని నిరసించడం, కొత్తదనాన్ని ఆహ్వానించడం అనేకచోట్ల బలంగా కనిపిస్తుంది. 'పదండి ముందుకు, పదండి తోసుకు, పదండి పోదాం పైపైకి' అన్న మాటలే ఆధునికతకి అద్భుతమైన ఆహ్వానం. వెనక్కిపోయేవాళ్ళని అవహేళన చేయడం శ్రీశ్రీలో ఎక్కడ పడితే అక్కడ చూడవచ్చు. 'నగరంలో వృషభం' ప్రగతి నిరోధకుణ్ణి వెక్కిరించే ప్రతీకాత్మక కవిత.

'నగరం హృదయంలో వృషభం / దారికి హక్కుదారు తానే అయినట్లు / పరిత్యజించి కాలానికి బాధ్యత / పరిహసించి నాగరికత పరుగు / నిలబడింది నేనే రాజునని... భద్రం సుమీ ఎద్దు నిన్ను తప్పుకోదు / యంత్ర విరోధి, అహింసావాది, శాకాహారి / మద్యనిషేధ ప్రజ్ఞాశాలి / నగరం నడివీధిలో / నాగరికత గమనాన్ని నిరోధిస్తూ / ఇలా ఎంతసేపయినా సరే / ఈ ఎద్దు నిలబడగలదు / ఎద్దుకి లేకపోతే బుద్ధి / మనిషికేనా ఉండొద్దా?'

నగరం మధ్యలో కదలకుండా నిలబడి ముందుకు పోయేవాళ్ళని నిరోధించే నాగరికతా విరోధి ఈ వృషభం. శ్రీశ్రీలో ఏర్పడిన ఆధునికతలో చాలా సంకీర్ణత కూడా ఉంది. ఈ 'సంకీర్ణత' అన్ని అంశాల్లోనూ మొదటి నుంచి చివర దాకా ఆయనలో ఉన్న ఒక జీవ లక్షణం. నాగరికతకు సంబంధించిన కొన్ని విశృంఖల భావాల్ని పాశ్చాత్య ప్రభావం చేత శ్రీశ్రీ అలవరచుకొని ఉండవచ్చు. యంత్రాల్ని వ్యతిరేకించడం, అహింసను ప్రేమించడం, శాకాహారం తీసుకోవడం, మద్యాన్ని నిషేధించడం, తిరోగమన భావాలు కావు గదా.

అందుకే గురజాడ నుండి స్ఫూర్తి పొందినా గురజాడ సంస్కరణ భావాల్ని సమగ్రంగా శ్రీశ్రీ జీర్ణించుకున్నట్లు కనిపించదు. గురజాడ, దేవుడు, కర్మ, మొదలైన లోకాతీత విషయాల్ని నమ్మలేదు. సమాజం మార్పు భౌతికమేనని అవగాహన చేసుకున్నాడు. మానవుడి పంచేంద్రియానుభూతులే సత్యమని ప్రకటిస్తూ ఒక వ్యాసాన్ని కూడా రాశాడు. శ్రీశ్రీ కూడా అభౌతిక భావాల్నీ, కర్మవాదాన్నీ ఖండించినవాడే. చాలా నిశ్చింతగా చెప్పినవాడే.

'జమీందారు రోల్సు కారు / మాయంటావూ? బాబూ / ఏమంటావు? / మహారాజు మనీపర్సు / మాయంటావూ? స్వామీ / ఏమంటావు?'

అయితే, కవిత్వావిష్కరణలో చాలా చోట్ల శ్రీశ్రీలోని సంకీర్ణత ఆశ్చర్యం కలిగిస్తుంది. 'ఏవి తల్లీ' కవితలో ఇలా అంటాడు.

'చక్రవర్తి అశోకుడెక్కడ / జగద్గురు శంకరుండెక్కడ / ఏవి తల్లీ నిరుడు కురిసిన / హిమసమూహములు?'

'సదసత్సంశయం' అనే కవితలో ఈ ప్రశ్న కూడా వేస్తాడు.

'ఈ సృష్టికి ఏమర్థం / మానవునికి గమ్యమేది / ఒక సకలాతీత శక్తి / ఉన్నట్టా లేనట్టా?'

ఇలాటివన్నీ శ్రీశ్రీ భౌతికవాదానికి అవరోధాలని చెప్పలేంగాని, ఆయనలోని సంకీర్ణతకి మాత్రం నిదర్శనాలు. అంతేగాక కులం, మతం, స్త్రీ పురుష సంబంధాలు – మొదలైన అంశాల గూర్చి శ్రీశ్రీ గురజాడ లాంటి వివేచనతో పట్టించుకున్నట్లు కనిపించదు.

సంప్రదాయ కవిత్వంలో ఉన్న శ్రీశ్రీని రెండో దశలో ఆధునికత, భౌతికతా తత్వాలు పూర్తిగా ఆక్రమించినై అన్నది యథార్థం. ఇది శ్రీశ్రీలోని సమకాలీనతా చైతన్యానికి నిదర్శనం. 'శ్రీశ్రీ కవితా ప్రస్థానం' అనే మహాప్రస్థాన సమీక్షా గ్రంథంలో (ప్రచురణ : 1968) అద్దేపల్లి ఇలా అన్నాడు.

'వీరికున్న ప్రత్యేక లక్షణమేమిటంటే వీరు జీవించిన కాలంలోని ప్రజల హృద్గతమైన ఉద్రేకమంతా వీరి మనస్సులో ఒక్కసారి పెల్లుబుకుతుంది. వారు వారి కాలాల్లోని విశిష్ట భావోద్రేకాల సమష్టి స్వరూపాలు.'

### 3

మానవతా దృక్పథం గూర్చి అవగాహన చేసుకున్నప్పుడు, గురజాడ మానవతా భావన హృదయ సంబంధం కలది. సమాజం మీది కరుణతో రూపుదిద్దుకున్నది. 30ల నుండి శ్రీశ్రీకి మానవతా దృక్పథంలో వచ్చిన మార్పు అతని సమకాలీనతపై ఆధారపడి వుంది. కాలంతో పాటు పరిణమించడం శ్రీశ్రీలో ఉన్న ప్రధాన ప్రేరణ. 30ల నుండి అంతర్జాతీయంగానూ, మన దేశంలోనూ అనేక మార్పులు జరిగినై. శ్రీశ్రీ మాటల్లోనే చెప్పాలంటే 50 సంవత్సరాల తెలుగు సారస్వతం (1900 – 1950) అనే వ్యాసంలో ఒకచోట ఇలా రాస్తాడు.

"కిందటి దశాబ్దంలో ప్రారంభమైన అశాంతి ఈ దశాబ్దంలో తీవ్ర రూపం దాల్చింది. ప్రపంచమంతటా ఆర్థిక సంక్షోభం చెలరేగి, పెట్టుబడిదారీ విధానం నేలమట్టంగా కదిలిపోయింది. సామ్రాజ్యవాద దేశాలు ఏళ్ళతరబడిగా సాగించిన సోవియట్ వ్యతిరేక ప్రచారంలోని నిస్సారత బయటపడి, ఒక వ్యక్తి మరొకవ్యక్తిని పీడించని సామ్యవాదమే మానవజాతికి శరణ్యమని క్రమ క్రమంగా రుజువు అవుతోంది. సోవియట్ రష్యాలో సామ్యవాదం నూతన విజయాలు సాధిస్తూ ఉంటే, దానిని ఎదుర్కొనడానికి ఇటలీలో ఫాసిజం, జర్మనీలో నాజీజము తలెత్తి రెండవ ప్రపంచ యుద్ధానికి విషబీజాలు నాటసాగాయి. దానికి నాందీ ప్రాయంగా చెలరేగిన స్పెయిన్ అంతర్యుద్ధంలో ఫాసిజమ్ తన నగ్న స్వరూపాన్ని బహిరంగంగా ప్రదర్శించింది. భారతదేశంలో దారిద్ర్యం, నిరుద్యోగం, పాలకుల పరపీడన, దుర్భర స్థితులకు దారితీశాయి. మధ్య తరగతి కుటుంబాలు విచ్ఛిన్నమయిపోయాయి. కర్షక కార్మికవర్గాలు ఆకలి మంటలతో అల్లాడిపోయాయి. సంపూర్ణ స్వాతంత్ర్యమే లక్ష్యమని తీర్మానించి, కాంగ్రెసు సంస్థ సత్యాగ్రహోద్యమాన్ని తీవ్రతరం చేసింది.... సోవియట్ సాహిత్యం, ముఖ్యంగా మాక్సింగోర్కీ రచనలూ, మయకోవ్‌స్కీ కవిత్వమూ వీరిని (యువ కవులను) ఎక్కువగా ఆకర్షించాయి."

1920ల నుండి వ్యాపించిన భావజాలం ఇది. మూడవ దశాబ్దం ఈ పరిస్థితుల తీవ్ర పరిణామమే. ఈ నేపథ్యంలోనించే శ్రీశ్రీ పరిణమించాడు. అతని మానవతా భావాలు వర్గ పునాదిని పొందినై. పేదరికాన్నీ, అట్టడుగు వర్గాల వేదనల్నీ 30లలో గుండె కదిపేట్లు వర్ణించి, మానవతావాదంలో ఒక నూతన దశను ప్రారంభించిన కవి శ్రీశ్రీ. ఇంతకు ముందరి మానవతావాదం కేవలం కరుణ వల్ల రూపుదిద్దుకుంటే, శ్రీశ్రీ మానవతావాదం వర్గ పీడన నుండి సమగ్రమయింది. మార్క్సిస్టు మానవతావాదానికి శ్రీశ్రీ ప్రారంభకుడు. వైయక్తిక మానవతాదృష్టి. సమానత వల్ల సాధించబడే సామాజిక మానవతను అందుకోవడమే మార్క్సిస్టు మానవతావాదం. ఇది పీడిత, శ్రామిక, వర్గాల ఐక్య పోరాటం వల్లనే సాధ్యం. ఈ మానవతా తత్వానికి అచ్చమైన ప్రతిబింబమే 'మహాప్రస్థానం'లోని అనేక శక్తివంతమైన కవితలు.

'నిరపరాధులై దురదృష్టంచే/ చెరసాలలలో చిక్కేవాళ్ళు / లోక రాక్షసుల పదఘట్టనచే / కొనప్రాణంతో కనలేవాళ్ళు / కష్టంచాలక కడుపుమంటచే/ తెగించి సమ్మెలు కట్టేవాళ్ళు / శ్రమనిష్ఫలమై జనిష్టురమై / నూతిని గోతిని వెదకేవాళ్ళూ/ అనేకులింక, అభాగ్యులంతా / అనాథలంతా, అశాంతులంతా/ దీర్ఘశ్రుతితో తీవ్ర ధ్వనితో/ విప్లవశంఖం వినిపిస్తారోయ్/

కేవలం మార్క్సిస్టు మానవతావాదమే గాక, సాంప్రదాయక వైయక్తిక మానవతావాదం కూడా శ్రీశ్రీలో ఉంది. కరుణ రసప్రభావం ఆయన మీద బాగా ఉంది. బాధల్లో ఉన్న పేదలను, వాస్తవిక జీవిత నేపథ్యంలో వర్ణించడంలో ఆయన నైపుణ్యం గొప్పది. బాటసారి, ఉన్మాది, సంధ్యాసమస్యలు మొదలైనవన్నీ యిందుకు ఉదాహరణలే.. 'సంధ్యా సమస్యలు'లో డబ్బున వాళ్ళ సమస్యలు వర్ణించి, లేనివాడి సమస్యల్ని యిలా చెప్తాడు.

ఇటు చూస్తే అప్పులవాళ్ళూ/ అటు చూస్తే బిడ్డల ఆకలి/ ఉరిపోసుకు చనిపోవడమో/ సముద్రయిన పడిపోవడమో/ సమస్యగా ఘనీభవించిందొక సంసారికి'

ఆవేశం శ్రీశ్రీలో ప్రబలమైన తత్వం ఆ ఆవేశం వల్లనే దేశదేశాల విప్లవకవిత్వాన్ని జీర్ణించుకుని తెలుగులో 30లలో ఆ ఉత్తేజంతో కవితలు రాశాడు. ఇంకా అప్పటికి సామ్యవాద ఉద్యమం సమ్మెలపైనా, పోరాటాల మీదా ఆధారపడి, వామపక్ష శక్తుల్ని ప్రోది చేసుకుంటున్న సమయంలోనే, విప్లవ స్ఫూర్తిలో కవితల్ని రాశాడు.

'కదం త్రొకుతూ పదం పాడుతూ/ హృదం తరాళం గర్జిస్తూ/ పదండి పోదాం వినబడలేదా/ మరో ప్రపంచపు జలపాతం/ దారిపొడుగునా గుండె నెత్తురులు/ తర్పణ చేస్తూ పదండి ముందుకు/ బాటలు నడిచీ, పేటలు గడిచీ/ కోటలన్నిటిని దాటండీ/ నదీ నదాలూ, అడవులు, కొండలు/ ఎడారులా మన కడ్డంకి'

ఇది ప్రజా యుద్ధ పంథా. లాంగ్‌మార్చ్. శ్రీశ్రీ ఆవేశతత్వమే యిలాంటి కవిత్వం రాయించింది.

'మనుష్యుడే నా సంగీతం/ మానవుడే నా సందేశం? అన్న శ్రీశ్రీ అనేక కోణాల్లో మానవత్వాన్ని తనతత్వంగా చేసుకొని, బలంగా ఆవిష్కరించిన కవి.

### 4

శ్రీశ్రీ ఒక శక్తివంతమైన తత్వాన్ని ప్రధానంగా చేసుకున్న సమయంలోనే, ప్రజలు దానికి విరుద్ధంగా భావించే మరొక తత్వాన్ని గూడా విడిచిపెట్టలేదు. ఇది శ్రీశ్రీ జీవలక్షణంలోని ప్రత్యేకమైన అంశం. మార్క్స్ మీద ఉన్న గౌరవం, అదే సమయంలో ఫ్రాయిడ్ మీద కూడా ఉంది. అందుకే అది వాస్తవికతనీ, చైతన్యస్రవంతినీ బాగా యిష్టపడి, తాను కూడా అనేక ప్రయోగాలు చేశాడు. జేమ్స్‌జాయిస్ 'యులిసిస్' నవలంటే శ్రీశ్రీకి ఎంతో యిష్టం. 'జేమ్స్‌జాయిస్ చైతన్య స్రవంతి' అనే వ్యాసంలో తన అభిమానాన్ని ఇలా ప్రకటిస్తాడు.

## పద్య కావ్య ప్రసిద్ధుడు ఉత్పల సత్యనారాయణ

ప్రముఖ పద్య కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఉత్పల సత్యనారాయణ అక్టోబర్ 23న మృతి చెందారు. గజేంద్రమోక్షం, భ్రమర గీతం, గోపి గీతము, గీతా భాగవత ప్రసంగాలు, రాజమాత, వేణుగీతం, యశోదానంద గేహిని వంటి పలు కావ్యాలను వీరు రాశారు. ప్రధానంగా పద్య కవిత్వంలో వీరు ప్రసిద్ధులు. 2003 సంవత్సరానికి గాను వీరు రాసిన 'శ్రీకృష్ణ చంద్రోదయం' పద్య కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందారు తెలుగు సాహిత్య విశిష్ట పురస్కార్, ఆంధ్ర సాహిత్య అకాడమీ అవార్డు, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక మండలి హంస పురస్కారం, భారత ప్రభుత్వం నుండి బాల సాహిత్య అవార్డు వంటి అనేక పురస్కారాలు వీరికి లభించాయి.

'1914 -18 మధ్య యావత్ప్రపంచమూ ఒక మహాయుద్ధంలో నిమగ్నమై ఉంటే, జేమ్సు జాయిస్ ఒక మహా కావ్య రచనలో నిమగ్నుడైనాడు. ఆ యుద్ధానికి ఫలితంగా రష్యాలో వచ్చిన, సామ్యవాద విప్లవాని కెంత ప్రాముఖ్యం ఉందో, సాహిత్య ప్రపంచంలో యులిసిస్ నవలకంత ప్రాబల్యం ఉంది'.

నిజానికి ఒక సామ్యవాది యిలా అంటాడని ఊహించలేం.కాని శ్రీశ్రీకి మనస్తత్వ కోణాలపై ఉన్న అభిమానం అంత తీవ్రమైనది. అందుకే, సమాంతరంగా సర్రియలిస్ట్ (అధివాస్తవిక) ప్రయోగాలెన్నో చేశాడు. అనుప్రాసలు భావధారకి కాకుండా వైచిత్రికి దారితీయడం, భావంతో సంబంధం లేని పదాలు, పదసంఘటనలూ ఒకదాని ప్రక్క ఒకటి రావడం, ప్రగతిశీల భావాలే కాదు, ఏ భావాలైనా హాస్యానికి వినియోగింపబడడం యిలాంటి అధివాస్తవిక రచనలు చేశాడు శ్రీశ్రీ. చిత్ర విచిత్రమైన నడకల మీద అతనికి ఎంతో ఆసక్తి.


**సాహిత్య ప్రస్థానం మాసపత్రిక చందా వివరాలు**

| | |
|---|---|
| సంవత్సర చందా (వ్యక్తులకు) | రు. 120 |
| సంవత్సర చందా (సంస్థలకు) | రు. 150 |
| అయిదేళ్లకు | రు. 500 |
| పదేళ్లకు | రు. 900 |
| విడి ప్రతి | రు. 10 |

ప్రజాశక్తి బుక్‌హౌస్ బ్రాంచీలన్నిటిలోనూ సాహిత్య ప్రస్థానం లభిస్తుంది. ప్రజాశక్తి దినపత్రిక ఏజంట్లకు చెప్పి వారి ద్వారా కూడా తెప్పించుకోవచ్చు.

**మేనేజర్**

**ప్రస్థానం**

**1-1-187/1/2, వివేక్‌నగర్,**

**చిక్కడపల్లి, హైదరాబాద్-20,**

**ఫోన్:27660013; వివరాలకు:9490099059**

ఇ.మెయిల్:Prasthanam_ss@yahoo.co.in

**సాహిత్య ప్రస్థానం అడ్వర్టయిజ్‌మెంట్ టారిఫ్**

**కలర్**

| | |
|---|---|
| టైటిల్ బ్యాక్ | రు. 15000 |
| టైటిల్ ఇన్నర్ | రు. 12000 |
| లోపలి పేజీ | రు. 10000 |


'చార్లీచాప్లిన్, జోసెఫ్ స్టాలిన్ / వాల్ట్ డిస్నీ / జార్జెస్ హన్నెట్/ గ్రేటా గార్బో / పిరాండెల్లో / ఇటీవల మా ఇన్స్పిరేషన్ సిగ్మండ్ ఫ్రాయిడ్, హెరాల్డ్ లాయిడ్, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ / జాకబ్ ఎప్‌స్టీన్ / కరీన్‌చట్ట్ గిరాం మూర్తి / ఇటీవల మా ఇన్స్పిరేషన్/ 'అర్థాన్ని అధ్వాన్నపు అడవిలో వదిలి/ గద్యాన్ని పద్యాన్ని కిచ్చి పెళ్ళి చేద్దాం'/ 'జీబ్రాకి ఆల్‌జీబ్రా చిహ్నాల/ లాంకోటూ పాంకోళ్ళూ తొడిగి / సాహిత్యా పౌరోహిత్యం యిస్తే / వెర్రికాదు సర్రియలిజయ్‌రా సోదరా'.

ఒక సంక్షుబ్ధ మనస్తత్వం గల శ్రీశ్రీకి మామూలు సౌందర్యం కంటె సంక్షుబ్ధ సౌందర్యం మీద గొప్ప మక్కువ. ఎందులోనైన అసాధారణమైన అనుభూతి అతనికి కావాలి.

'ఒక వస్తువు చలనంలో ఉన్న క్షణాన్ని, అదే వస్తువు సరిగా చలనం ఆగిపోయిన క్షణంలో కలిపేటప్పుడు స్ఫురించే పరస్పర సంబంధాన్ని ప్రదర్శించేదే సంక్షుబ్ధ సౌందర్యం. అది కానిది సౌందర్యమే కాదు.

సంక్షుబ్ధ సౌందర్యం గూర్చి చెప్పేటప్పుడు ఎంతో లీనమై ఈ కింది విధంగా అంటాడు.

'ఓహో! వికసన్న వకైరవ గంధ బంధుర ఉదార సమీర సౌరభము! గంధర్వలోక మధుర మధుర సుధాగానమంజువాటి. ఏదో విప్పారిత నేత్రాలు. వీధుల్లోని గూళ్ళలోనివో! శృంగారమో బీభత్సమో భయమో కోపమో విస్పష్టంగా తప్పవేరు విధంగా వీటిలో కనబడదు. కనకదుర్గ కళ్ళు, ఈజిప్టు రాశి నెఫర్ టీటీ, అరేబియన్ నిశీథాల శహరజాదీ సింహాలకు పారవేసే బానిస బాలికల కళ్ళు, జూలియట్, జస్టీన్ కళ్ళు, మోరో చిత్రించిన నాయికలు కొంగరి కళ్ళు, మార్కెట్‌లో అప్పుడప్పుడు మాత్రమే కనిపించే కళ్ళు'.

ఈ చివరి వాక్యమంతా సంక్షుబ్ధ సౌందర్యం, పాశ్చాత్య రచనల్లోని యిలాంటి సంక్షుబ్ధ సంకీర్ణ రచనలు శ్రీశ్రీని బాగా ఆకర్షించినై. బాగా వాస్తవికవాదిగా, అధి వాస్తవిక లక్షణం గల సంకీర్ణభావధారల్ని ప్రేమించడంలో శ్రీశ్రీలో ఒక ప్రత్యేక తత్వముంది. బహుశః చేతన్ (Conscious) ఉపచేతనల సమ్మిళిత సంకీర్ణ సంచారాలు శ్రీశ్రీలో ఎక్కువగా ఉండవచ్చుననిపిస్తుంది. అందుకే ఏకకాలంలో ప్రగతివాదాన్నీ, ప్రయోగవాదాన్నీ రెంటికీ యిష్టపడగలిగాడు.

## 5

1970 నించి శ్రీశ్రీలో కొత్త ఉత్తేజం కలిగింది. సుమారుగా 1960 నుండి ఎక్కువగా రచనలు చెయ్యని శ్రీశ్రీ 1970లో వి.ర.సం. ప్రారంభమైనప్పటి నుండి నిబద్ధ రచనలు చెయ్యడం ప్రారంభించాడు. సాయుధ పోరాటాన్ని సమర్పిస్తూ, పదేళ్ళపాటు జీవితంలోనూ, కవిత్వంలోనూ మళ్ళీ చైతన్యవంతుడయ్యాడు. ఇక్కడ నుండి శ్రీశ్రీలో నిబద్ధ తాత్వికత మొదలైందని భావించవచ్చు. అంత క్రితం ఉన్న సంకీర్ణ ఆలోచనలు, అసామాజిక భావాలూ అన్నీ తొలగిపోయి, మార్క్సిస్టు భావాల్నీ, హేతువాద భావాల్నీ నిశ్చితంగా చెప్పాడు. అభ్యుదయోద్యమంలో తాను అందరినీ ప్రభావితం చేశాడు. విప్లవోద్యమంలో తాను సిద్ధాంత కారులచేత ప్రభావితుడయ్యాడు.

అభ్యుదయోద్యమ సమయంలో అనేక కారణాలవల్ల విస్తృతంగా ప్రచలితం కాని, మార్క్సిస్టు రాజకీయ, సాహిత్య భావాలన్నీ, విరసం కాలంలో ప్రచారమయినై. ఆకారణం చేత శ్రీశ్రీ సామ్యవాద భావాల్ని నిబద్ధంగా ప్రకటించగలిగాడు.

శ్రీశ్రీలో ప్రధానమైనది కవితా చైతన్యం.దాన్ని అనేక దశల్లో అనేక విధాలుగా వినియోగించి ఉండవచ్చు. ప్రధానంగా మార్క్సియతత్వానికి కవిత్వం ద్వారా ప్రజల్లో ప్రాధాన్యం కలిగించడంలో శ్రీశ్రీ తాత్వికత తెలుగు సాహిత్యంలో ఒక చారిత్రక దశని రూపొందించింది. రాజకీయాది విషయాల్లో చాలాసార్లు శ్రీశ్రీ విరుద్ధ ప్రకటనలు చేశాడు గాని, సాహిత్యం గురించి, తాను ఏర్పరచుకున్న భావాల్ని ఎప్పుడూ మార్చుకోలేదు. ప్రాచీన సాహిత్యం గురించి ప్రసక్తి వచ్చినా, 30లలో చెప్పినట్లే 80లలోనూ చెప్పాడు. 1982 లో ఒక ముఖాముఖీ ప్రశ్నోత్తరాల్లో ఈ విధంగా అన్నాడు.

**ప్రశ్న :** మినీ కవితపై మీ అభిప్రాయ మేమిటి?

**శ్రీశ్రీ :** ఏ కవిత్వం మీదనైనా నాకు సదభిప్రాయమే ఉంది. ఎక్కడ దొరికినా ఏ సైజులో దొరికినా కవిత్వాన్ని అభిమానించడం మానలేను.

ఎన్ని సంకీర్ణతలు, ఎన్ని వైరుధ్యాలు ఉన్నా, పరిణత దశలో మార్క్సియ తత్వంతోనే ఏకీభావన పొందిన గొప్పకవి శ్రీశ్రీ.

పరామర్శ

# ఈ దశాబ్ది కాలంలో కొన్ని మంచి పుస్తకాలు

**ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లోను రచయితలు, కవులు, ప్రభుత్వాల నుంచీ, పత్రికల నుంచీ తగినంత ప్రోత్సాహం లేకపోయినా ఎలాగో ఒకలాగు పుస్తకాలను ప్రచురిస్తూనే వున్నారు. చదివే వాళ్ళు కొంత మేరకైనా చదువుతూనే వున్నారు.**

**ఈ నేపథ్యంలో ఈ మధ్య కాలంలో వెలువడి కాస్తంత సంచలనాన్ని, ఇసుమంత చైతన్యాన్ని ప్రజల్లో కలిగించి, వారిలో ఆసక్తిని పెంపొందించిన పుస్తకాలూ తెలుగులో వెలు వద్దాయి.**

**ఆర్వీ రామ్**

**ఈ** మధ్యన దాదాపు పది సంవత్సరాల కాలంలో తెలుగు సాహిత్యంలో సంచలనం కలిగించి, పది కాలాల పాటు నిలిచిపోయే పుస్తకాలు కొన్నయినా లేకపోలేదు. ప్రపంచీకరణ ఫలితంగా ఈ దేశంలో కొన్ని భాషలు, సంస్కృతులు తమ అస్తిత్వాన్నే కోల్పోయే స్థితి దాపురించింది. తెలుగు సంస్కృతీ సాహిత్యాలు దానికి మినహాయింపేమీ కావు. ఈనాడు 'బుక్' కల్చర్ పోయి 'లుక్' కల్చర్ పెరిగి పోతోంది. సాహిత్యం పట్ల, సంస్కృతి పట్ల ప్రజలకు ఆసక్తి తరిగిపోయి, వాణిజ్య మనస్తత్వం పెరిగిపోతుంది. వలసవాదానికి, సామ్రాజ్యవాదానికి ప్రతీకగా నిలిచిన ప్రపంచీకరణ, దానికి ప్రతినిధిగా చెలామణిలో వున్న అమెరికా వారి ఆకర్షణలతో అందరితో బాటుగా ఆంధ్రులకు 'డాలర్' సంస్కృతిపైన మోజు పెరిగి, సంపాదనే ధ్యేయంగా మారిపోయింది. మనిషిని సంస్కరించి, ఉన్నతునిగా తీర్చిదిద్దే సాహిత్య పతనం సన్నగిల్లింది. వచ్చే జనరేషన్ ఇంటర్నెట్, కంప్యూటర్ సిస్టమ్‌ల వెంటబడి ఎర్నింగ్ కోసం వెంపర్లాడుతోంది. దీంతో తెలుగు సంస్కృతీ సాహిత్యాలు అంటరాని విషయాలై పోయాయి. కొన్ని రోజులకి భాష సైతం తన ఉనికిని కోల్పోయే పరిస్థితి ఏర్పడ బోతోందన్నా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు.

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లోను రచయితలు, కవులు, ప్రభుత్వాల నుంచీ, పత్రికల నుంచీ తగినంత ప్రోత్సాహం లేకపోయినా ఎలాగో ఒకలాగు పుస్తకాలను ప్రచురిస్తూనే వున్నారు. చదివే వాళ్ళు కొంత మేరకైనా చదువుతూనే వున్నారు.

ఈ నేపథ్యంలో ఈ మధ్య కాలంలో వెలువడి కాస్తంత సంచలనాన్ని, ఇసుమంత చైతన్యాన్ని ప్రజల్లో కలిగించి, వారిలో ఆసక్తిని పెంపొందించిన పుస్తకాలూ తెలుగులో వెలువడ్డాయి. వాటిని సౌలభ్యం కోసం నవలలు, కథా సంపుటాలు, సంకలనాలు, కవిత్వం, నాటకాలు, విమర్శనా గ్రంథాలు, అనువాదాలు అన్న విభాగాలుగా చేసుకొని చెప్పడం జరిగింది.

## నవలలు

కథా సాహిత్యంతో పోల్చుకుంటే మిగిలిన అన్ని సాహిత్య ప్రక్రియలు వెనుక బడ్డాయి. అందులో బాగా వెనుక పడినవి పరిశోధనా గ్రంథాలు, వ్యాసాలు అయితే ఆ తర్వాత స్థానంలోకి నాటకాలు చేరతాయి. నాటకాల తర్వాత కవిత్వం బాగా వెనక బడింది. అనువాదాల గురించి చెప్పాల్సిన పనే లేదు.

ఈ క్రమంలో మంచి పేరు తెచ్చుకున్న నవలలు నవలాకారులు వేళ్ళ మీద లెక్క పెట్టే స్థాయిని దాటిపోలేదు. అలాంటి తక్కువ మంది నవలాకారుల్లో మొదటగా చెప్పుకోదగిన వారు డాక్టర్ కేశవరెడ్డి. వారు ఈ మధ్యకాలంలో ఇంక్రిడబుల్ గాడెస్ (క్షుద్రదేవత), సిటీ బ్యూటిఫుల్, స్మశానం దున్నేరు, అతడు అడవిని జయించాడు, రాముడుండాడు రాజ్జం వుండాదె, చివరి గుడిసె, మూగవాడి పిల్లనగ్రోవి, మునెమ్మ నవలల్ని ప్రచురించారు. వాటిలో బాగా పేరు తెచ్చుకున్న నవల మూగవాడి పిల్లనగ్రోవి.

**(1) మూగవాడి పిల్లనగ్రోవి :** రాయలసీమలోని రైతుల కడగండ్లను హృదయవిదారకంగా చిత్రించిన నవల మూగవాడి పిల్లనగ్రోవి. ఇందులో గుండెలు పిండే సన్నివేశాలు ఒకదానివెంట ఒకటి పరుగెత్తి, చివరికి ఒక మహా కావ్యాన్ని చదివిన అనుభూతిని కలిగిస్తాయి.

కరువు కాలంలో సరైన పంటలు పండక పొలాన్నే తల్లిగా భావించుకున్న 'బక్కిరెడ్డి' అనే రైతు విధిలేని పరిస్థితిలో ఆ ఊరి మునసబు మణియంగారికి నేలను అమ్ముకుంటాడు. తన పొలాన్ని మణియంగారికి అప్పచెప్పాల్సిన ముందురోజు పడిన వర్షానికి, తన ఎద్దులకు మడక కట్టి అర్ధరాత్రివేళ మడికయ్యను దున్ని దున్ని ఆ చాలుల్లో అలాగే పడి చచ్చిపోతాడు. అప్పట్నుంచీ ఆ మడికయ్యే ఒక అద్భుత భూమిగా నిలిచిపోతుంది.

**(2) బ్రతుకాట :** ఈ నవలా రచయిత డాక్టర్ వి.ఆర్. రాసాని. ఇతను వందకు పైగా కథలు, వ్యాసాలు, నాటకాలు రాసిన రచయిత. ఇతనిప్పటి వరకు చీకటి రాజ్యం, మట్టి బతుకులు, చీకటి ముడులు, ముద్ర వంటి నవలలు ముద్రించాడు. అతను రాసిన పరిశోధనాత్మక నవల బతుకాట. ఇది 2005లో ప్రచురింపబడి సాహిత్యంలో ఒక సంచలనాన్ని రేపింది. అమెరికా వారి 'తానా' బహుమతిని కూడా పొందింది.

ఇది కూడా రాయలసీమలోని చిత్తూరుజిల్లా దక్షిణ ప్రాంతమైన 'కుప్పం' ప్రాంతం నేపథ్యంగా సాగే నవల.

రాయలసీమలో మార్చి నుంచి ఆగస్టు మాసం వరకూ 'భారతోత్సవాలు' జరుగుతుంటాయి. ఇదొక సుదీర్ఘ కాలం పాటు జరుపబడే జానపద కళా సమ్మేళనం. భారత కథను పగటి పూట హరికథల రూపంలో హరిదాసు గానం చేస్తే, రాత్రిపూట అదే కతను




కుప్పం ప్రాంతంలోని కళాకారులు జానపద కళారూపమైన వీధి నాటకంగా దాదాపు 18 నుంచి 21 రోజుల పాటు ప్రదర్శిస్తారు. ఈ నాటక కళనే జీవన వృత్తిగా కలిగిన కుటుంబాలు వందల కొద్దీ వున్నాయి. అలా నాటక ప్రదర్శనే కులవృత్తిగా కలిగిన దాదాపు ఏడు తరాల వారి కథ బతుకాట. బతుకే ఆటగా, ఆటే జీవనంగా సాగే నాటక గురువుల కథ. ఇందులో ఎంతో ఉద్వేగభరితంగా చిత్రించడం జరిగింది. అందునా ఐదవ తరానికి చెందిన 'సిద్దప్ప' అనే గురువు జీవిత కథే ఇందులో ప్రధానంగా నడుస్తుంది. ఈ నవలను ఆంగ్లంలో ప్రసిద్ధి చెందిన అలెక్స్ హేలీ 'రూట్స్'తో కొందరు పోల్చి ప్రశంసించడం కూడా జరిగింది. 1806 నుంచీ నేటి వరకూ సాగిన అరుదైన పరిశోధనాత్మక నవల 'బతుకాట' లాంటిది తెలుగు సాహిత్యంలోను అరుదైనదే.

**(3) పంచమం :** దాదాపు గత పదేళ్ళ పాటు తెలుగు సాహిత్యంలో తలెత్తుకుని నిలబడిన సాహిత్యోద్యమం దళిత ఉద్యమం. ఈ దళిత చైతన్యం నుంచి వెలువడిన మరో మంచి నవల 'పంచమం'. దీని రచయిత చిలుకూరి దేవపుత్ర. ఈయన దళిత కథా రచయితగా, నవలాకారుడిగా తెలుగులో లబ్ధ ప్రతిష్ఠులు. వీరు ఏకాకి నౌక చప్పుడు, బందీ వంటి కథా సంపుటాలను, చీకటి పూలు, అద్దంలో చందమామ వంటి ఇతర నవలలూ రాశారు.

భూస్వాములకు సంబంధించిన ల్యాండు సీలింగులు, రీ కన్వేయింగులు, ల్యాండు సీలింగ్ పుణ్యమాని భూములు పొందిన దళితులు, రీ కన్వేతో తిరిగి భూములు పోగొట్టుకోవడాలు, దళితులైన మాల మాదిగల మధ్య అంతరాల్ని పాతే వర్గీకరణలు, దళితుల అణచివేతలు, గొంచిగాళ్ళ దాష్టీకాలు అన్నీ శివయ్య పాత్ర ద్వారా అద్భుతంగా చిత్రించిన నవల పంచమం. ఇది అనంతపురం జిల్లా దళితుల జీవన నేపథ్యంలో సాగుతుంది. ఇది కూడా ఈ మధ్యకాలంలో అమెరికా వారి 'ఆటా' బహుమతిని పొంది మంచి రచనగా పేరు తెచ్చుకుంది.

**(4) అంటరాని వసంతం :** విరసం అధ్యక్షుడు జి. కల్యాణరావు రచించిన నవల అంటరాని వసంతం. ఇందులోనూ దళితుల బాధలు, వారి సంస్కృతీ ప్రధానంగా చిత్రింపబడింది. యల్లప్ప అనే దళిత జానపద కళాకారుని గాథలో ప్రారంభమై అతని తర్వాత ఏడు తరాల దళిత స్థితిగతులు, జీవన విధానంలో మార్పులు హృద్యంగా చిత్రించబడిందీ నవలలో. నేటి పెత్తందార్ల ముసుగు రాజకీయాల మాటున సాగించే రాజ్యహింస, భూస్వాములైన అగ్రకులస్తుల అణచివేత కారణంగా ఛిద్రమైపోతున్న దళితుల బ్రతుకుల్ని గురించి కవితాత్మకమైన శైలీ విన్యాసంలో చెప్పిన తీరు ప్రశంసనీయంగా వుండి అందరి మన్ననలను అందుకున్న నవల ఈ 'అంటరాని వసంతం'.

## కథా సంకలనాలు

1901లో బండారు అచ్చమాంబ రాసిన 'స్త్రీ విద్య' కథతో తెలుగు కథా సాహిత్యం ఆరంభింపబడినా, అన్ని లక్షణాలతో సలక్షణంగా ఒక సామాజిక స్పృహతో వెలువడిన మొదటి కథ గురజాడ రాసిన 'దిద్దుబాటు'. ఈ గురజాడ ప్రవేశపెట్టిన వొరవడిలో ఎన్నో కథలు, ఎందరో కథకులు పుట్టుకొచ్చారు. యింకా పుట్టుకొస్తున్నారు. ఈ క్రమంలో ఎన్నో కథా సంకలనాలు, కథా సంపుటాలు లెక్కలేనన్ని వచ్చాయి. ఇంకా వస్తూనే వున్నాయి. ఈనాటి అన్ని వర్గాల ప్రజల మన్ననలను అందుకుంటున్న ఏకైక ప్రక్రియ కథ ఒక్కటేనని చెప్పక తప్పదు. గతంలో 'నూట పదహార్లు' వంటి కథా సంపుటాలు ఎంతో పేరు తెచ్చుకున్నాయి. అదేవిధంగా ఈ మధ్య కాలంలో వెలువడిన మంచి కథా సంకలనాలు విశాలాంధ్ర పబ్లిషింగ్ వారి తెలుగు కథ. కళాసాగర్ వారి కథాసాగర్, మధురాంతకం నరేంద్ర సంకలనం చేసిన తాత్విక కథలు, నూకారాం ప్రసాదరెడ్డి ముద్రించిన కక్షల కథలు, స్కైబాబా వెలువరించిన 'వతన్'.

**(1) తెలుగు కథ :** అభ్యుదయ సాహిత్యానికి అరవై ఏళ్ళుగా పెద్ద దిక్కుగా నిలిచిన సంస్థ విశాలాంధ్ర ప్రచురణాలయం. ఇది ఇటీవల ప్రతిష్ఠాత్మకంగా ముద్రించిన 108 కథల సంకలనం. ఇందులో గురజాడ మొదలు 2002 వరకు వెలువడిన కథలలో నుంచి ఏర్చి కూర్చిన కథలున్నాయి. ఈ 108 కథల్ని చదివితే ఈ వందేళ్ళ తెలుగు జాతి జీవన విధానం, సంస్కృతి జాతి ఉత్థాన పతనాలు. జీవన వైరుధ్యాలు అన్నీ మనం అవగతం చేసుకోవచ్చు. ఇది వందేళ్ళ తెలుగుజాతి చరిత్రా సంస్కృతులకు సాక్షీభూతంగా నిలబడగలిగిన సాటిలేని మేటి కథా సంకలనం. ఇందులో ఆది కథా రచయిత గురజాడయితే తుది కథా రచయిత ఇనయతుల్లా. దీనికి బాపు ముఖచిత్రం వేశారు.

**(2) కథాసాగర్ :** సినీ జగత్తుకే పరిమితమైన 'కళాసాగర్' అనే సాంస్కృతిక సంస్థ సుభాన్ సంపాదకత్వంలో దాదాపు 87 కథల్ని ఒక్కచోట చేర్చి అందమైన అట్ట బైండుతో ముద్రించిన పుస్తకమే కథా సాగర్. ఇది కూడా ఇటీవలి కాలంలో పలువురి ప్రశంసల్ని పొందింది. కళాసాగర్ రజతోత్సవ సందర్భంగా అందించిన విలువైన సంకలనం ఇది. ఇది ప్రసిద్ధ కథా రచయిత్రి అబ్బూరి ఛాయాదేవి కథ 'తన మార్గం'లో ప్రారంభమై 87వ కథ అయిన యర్రంశెట్టి శాయి 'సర్కస్'తో ముగుస్తుంది. ఇందులో తొలి తరం, మలి తరం కథ గాకుండా మూడవ తరం కథకుల కథలు, యువతరం కథలు వుండటం విశేషం.

**(3) కక్షల కథలు :** ప్రాదేశికతా ప్రాధాన్యతతో మొట్టమొదట చాసో 'నాగావళి' కథలు వెలువరించారు. ఆ తర్వాత విశాలాంధ్ర వారు రాయలసీమ ప్రాంతపు కథల్ని 'సీమ కథలు'గా వెలువరించారు. ఈ దారిలో ఈ మధ్యన ప్రాంతీయ స్పృహతో తెలంగాణా కథ, కడప కథ, కర్నూలు కథ వంటివి వెలువడ్డాయి. అలాగే రాయలసీమ బతుకుల్ని ప్రతి ఏడూ వచ్చే కరువుల తర్వాత కక్షలు అతలాకుతలం చేస్తున్నాయి. ఫ్యాక్షన్ పడగ నీడల్లో తెల్లారిపోతున్న బతుకుల్ని చిత్రించే కథల్ని నూకారాం ప్రసాదరెడ్డి 'కక్షల కథలు' పేరుతో సంకలనం చేశారు. ఈ మధ్య కాలంలో ఇది కూడా మంచి పుస్తకంగా పలువురి మన్ననలను పొందింది. ఒకప్పటి పాలెగాళ్ళుగా చెలామణి అయిన భూస్వాములు, రాజకీయ నాయకులు తమ ఆధిపత్య ఆదాయాల కోసం, భూముల ఆక్రమణల కోసం కక్షల్ని ఎలా పోషిస్తున్నారో, ఆ కక్షల కాలసర్పం కాటుకు బలైపోతున్న సామాన్యుల బలిదానం ఎలా వుంటుందో చిత్రించే కథలు ఇందులో ముప్పై పైచిలుకు వుంటాయి.

**(4) తాత్విక కథలు :** ఇదొక విలక్షణమైన కథా సంకలనం. మనిషి అస్తిత్వాన్ని, ఉనికిని ప్రశ్నించే తాత్విక నేపథ్యం




వున్న కథల సంకలనం ఇది. అమెరికా నివాసి అయిన డాక్టర్ బోయరెడ్డి సుబ్రమణ్యం రెడ్డిగారి ఆర్థిక సహకారంతో కథా రచయిత డాక్టర్ మధురాంతకం నరేంద్ర సంపాదకత్వంలో వెలువడిన గ్రంథం తాత్విక కథలు. ఇందులో చలం 'ఓ పువ్వు పూసింది', పాలగుమ్మి పద్మరాజు 'గాలివాన' వంటి ప్రసిద్ధ కథలతో పాటు ఇటీవల ప్రసిద్ధులైన రమణజీవి, రాసాని వంటి కథకుల కథలు కూడా ఉండటం చెప్పుకోదగ్గ అంశం.

**(5) వతన్ :** తెలుగు సాహిత్యంలో ఎన్నో ఉద్యమాలు, సరికొత్త ధోరణులు కాలానుగుణంగా పుట్టుకొస్తూనే వున్నాయి. ఆధునిక ఆంధ్ర సాహిత్యంలో అభ్యుదయ కవిత్వం, భావ కవిత్వం పడుగూ పేకల్లా ప్రారంభ దశ నుంచే వచ్చాయి. రాను రాను భావ కవిత్వం 1935 నాటికి శ్రీశ్రీ విజృంభణతో, విప్లవ కవిత్వ ప్రభావానికి తోక ముడిచింది. ఆ తర్వాత 70వ దశకంలో దిగంబర కవిత్వం పుట్టుకొచ్చింది. ఆ తర్వాత చాలా ఆలస్యంగా స్త్రీవాద సాహిత్యం, దళిత సాహిత్యం, ప్రస్తుతం మైనారిటీ సాహిత్యం ఒకదాని తర్వాత ఒకటిగా పుట్టుకొచ్చి తలెత్తుకు తిరిగాయి. కథా సాహిత్యంలోనూ వీటి ప్రభావం ప్రస్ఫుటంగా వుంది. నేడు నడుస్తున్న మైనారిటీవాద సాహిత్యానికి మొదటి పుస్తక రూపంగా వచ్చిన కథల సంపుటి 'వతన్'. దీని ప్రధాన సంకలన కర్త స్కైబాబా గత శతాబ్ది చివరి దశకంలో జరిగిన బాబ్రీ మసీదు కూల్చివేత సంఘటనతో ఈ దేశంలోని మహమ్మదీయుల్లో చలనం ఆరంభమైంది. ఇటీవల అమెరికాలో లాడెన్ నాయకత్వంలో జరిగిన దాడుల ఫలితంగా ముస్లింల పైన ఎదురు దాడులు జరిగాయి. దీంతో ఈ దేశంలోను ముస్లింలలో అభద్రతా భావం నెలకొని భారతీయ జనజీవన స్రవంతిలో ఇమడలేక వారు సతమతమై పోతున్నారు. ఈ నేపథ్యంలో ఎందరో ముస్లిం రచయితలు తమ బాధల్ని, అణచివేతల్ని, అభద్రతా భావాన్ని కథలుగా మలిచారు. ఈ క్రమంలో ముస్లిం కథకులుగా స్కైబాబా, మొహజబీన్, రహంతుల్లా, శశిశ్రీ, జి. భాషా, సలీం వంటి రచయితలు ఎన్నో కథల్ని సృష్టించారు. అలాంటి కథల్లో ప్రముఖమైనవి ఏర్చికూర్చిన అరుదైన సంకలనం వతన్. ఇది కూడా పలువురి ఆదరాభిమానాలకు నోచుకున్న ఓ మంచి సంకలనం.

## కథా సంపుటాలు

ఒకే రచయిత కథల్ని సంపుటంగా పేర్కొనడం ఆనవాయితీ. ఇటీవలి కాలంలో వెలువడి ప్రజాదరణను పొందిన కథా సంపుటాలు లేకపోలేదు.

**(1) వీరగల్లు :** కథపైనా, కథనం పైనా మంచి పట్టు గలిగి పరిపుష్టమైన శైలీ, శిల్పాలను ప్రయోగించి మంచి కథల్ని అందిస్తున్న అరుదైన రచయిత నారాయణస్వామి. వీరు ఇటీవల ముద్రించిన కథల సంపుటి వీరగల్లు. ఇతని శిల్పం రావిశాస్త్రి శిల్పంలా గట్టు తెగిన ప్రవాహంలా స్వేచ్ఛగా ఉరకలేసి పఠిత మనసుపైన చెరగని ముద్రవేస్తుంది. నిజానికతన్ని రాయలసీమ రావి శాస్త్రి అనాల్సి వుంది. అనంతపురం జిల్లాలోని ప్రజల కడగండ్లను అతి నేర్పుగా కథల్లో చిత్రించిన వైనం 'వీరగల్లు'లో కనిపించే అంశం. నీళ్ళ కోసం వారు పడే బాధలు, ఎడారిగా మారిపోతున్న భూములు, వాటిని నమ్ముకొని అగచాట్లు పడుతూ బతకలేక వలసలు పోయే రైతాంగం ఈ కథల నిండా కనిపిస్తారు. మధురాంతకం రాజారాం సాహిత్య సంస్థ ప్రతి యేడూ ఇచ్చే 'కథా కోకిల పురస్కారం' కూడా ఈ పుస్తకానికి లభించడం ఓ ప్రత్యేకత.

**(2) ఊటబాయి :** తెలంగాణా జీవితాన్ని, సంస్కృతిని తెలంగాణా యాసలో హృద్యంగా చిత్రిస్తున్న యువ రచయిత పెద్దింటి అశోక్ కుమార్ ముద్రించిన కథా సంపుటి ఊటబాయి. ఇది కూడా కొన్ని పురస్కారాలను పొంది మంచి పుస్తకంగా పేరు సంపాదించుకుంది.

**(3) మునిపల్లెరాజు కథలు :** ఇటీవల కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన ప్రసిద్ధ కథకులు మునిపల్లె రాజుగారు ముద్రించిన ఈ కథా సంపుటి కూడా పలువురి ప్రశంసల్ని అందుకుంది. ఇతను రాసిన గొప్ప కథలు ఇందులో 19 దాకా వున్నాయి. రచయితకు కీర్తి కిరీటాన్ని ధరింపచేసిన 'యశోద కొడుకు, వారాల పిల్లాడు, బిచ్చగాళ్ళ జెండా, అరణ్యంలో మానవ యంత్రం వంటి కథలు ఇందులో చేర్చడం జరిగింది. ప్రతి కథలోను ఒక తాత్విక గాఢత, హృదయాల్ని స్పృశించే కరుణ రసజీర గుండెను కరిగిస్తాయి. ఇదేగాక మాంత్రిక వాస్తవిక కోణంలో రాసిన 'అస్తిత్వ నాదం ఆవలి తీరాన' అన్న వీరి కథల సంకలనమూ ఓ విధమైన మౌన సంచలనాన్ని సృష్టిస్తోంది.

**(4) మెరవణి :** పోయినేడు విమలా శాంతి పురస్కారం పొంది సాహితీపరుల నీరాజనాలందుకున్న కథా సంపుటి మెరవణి. రచయిత వి.ఆర్. రాసాని.

కథకుడిగా, నవలాకారుడిగా, నాటక కర్తగా, వ్యాసకర్తగా, పుస్తక సంపాదకుడిగా బహుముఖీనమైన ప్రతిభను కనబరుస్తున్న రచయిత వి.ఆర్. రాసానికి కీర్తి కండువాను చుట్టిన పుస్తకం ఇది. అణగారిపోయిన కులాల గురించి, కులవృత్తుల గురించి స్థానిక కళా సంస్కృతికాంశాల గురించి గాఢమైన అనుబంధంతో, తీవ్రమైన సామాజిక పరిశీలనతో, మధురమైన మాండలిక శైలి విన్యాసంతో మనసును కుదిపేసి, పఠితను ఒక దిగ్భ్రమకు గురిచేసే కథల క్రోడీకరింపు మెరవణి. అడవిపైన పడి బతికే గువ్వలోళ్ళు, నక్కలోళ్ళు, యానాదులు, సంచార జీవనం సాగించే నెత్తివోవు గంగమ్మల వాళ్ళు, వీధి నాటక కళాకారులు వీరి కథల్లో కమనీయంగా దర్శనమిచ్చి, కనాకష్టమైన జీవితాల్ని గడుపుతూ కన్నీళ్ళు పెట్టిస్తారు. ఈ మధ్యకాలంలో ఇంతటి వస్తు వైవిధ్యం గల కథా సంపుటి 'మెరవణి' తప్ప మరొకటి కనిపించదని విజ్ఞుల కితాబు.

**(5) మా పసలపూడి కథలు :** స్థానిక జన జీవనంలోని సుఖదుఃఖాలను, సరస విరసాలను, జయాపజయాలను బాపు బొమ్మల్లా, అక్షర చిత్రాలుగా అందించిన కథల సంపుటి 'మా పసలపూడి కథలు' రచయిత సుప్రసిద్ధ సినీ దర్శకులు వంశీ. కోస్తా జీవితాన్ని రసవత్తరమైన కొన్ని ఎపిసోడ్స్‌గా అందించి ఆంధ్రుల్ని అలరించిన గ్రంథం ఇది.

**(6) కుబుసం :** స్త్రీవాద స్పృహతో ఎంతో ఆత్మీయంగా స్త్రీల జీవితాల్ని చిత్రించిన కథా సంపుటి కుబుసం. రచయిత్రి కుప్పిలి పద్మ. ఈ పురుషాధిక్య సమాజంలో పురుషుడు స్త్రీని అణిచివేసి, కట్టు బానిసలా చూస్తున్న దోపిడీ యొక్క విశ్వరూపం ఈ కథల్లో దర్శనమిస్తుంది. రచయిత్రికి పేరు తెచ్చిపెట్టిన కుబుసం, సాము, సాలభంజిక వంటి కథలు ఇందులో వున్నాయి. ఈ మధ్యకాలంలో స్త్రీల నుంచీ, మంచి కథల సంపుటి రాలేదన్న నిందను దూరం చేసిన సంపుటి ఇది.



## కవిత్వం

మనకు మంచి కవులకు కొదవలేదు. ఈ తరంలో శివారెడ్డి, స్మైల్, ఎండ్లూరి సుధాకర్, ఎలిశెట్టి ప్రభాకర్, శిఖామణిలాంటి గొప్ప కవులు తమ కలాల్ని కదిలించి కమనీయమైన కవిత్వాన్ని సృష్టిస్తున్నారు. ఈ దశాబ్దంలో వచ్చిన మంచి కవితా సంపుటాల గురించి కూడా చర్చించాల్సిన అవసరం కూడా వుంది.

**(1) నల్ల ద్రాక్ష పందిరి :** అంబేద్కర్ రగిల్చిన దళిత స్పృహతో రాసిన కవితా రత్నాల్ని పొదిగిన పుస్తకం నల్లద్రాక్ష పందిరి. కవి ఎండ్లూరి సుధాకర్. దళిత కవిత్వంలోనే గాక తెలుగు కవిత్వంలో బర్నింగ్ యారోలా దూసుకు వచ్చిన ప్రతిభాశాలి అయిన కవి ఎండ్లూరి సుధాకర్. 2002లో వెలువడిన ఈ కవితా సంపుటి సాహితీ లోకంలో ప్రకంపనాల్ని సృష్టించింది. అతని కీర్తి కిరీటంలో కలికి తురాయిలా నిలిచిన 'నల్లతల్లి' గేయం ఇందులోదే.

**(2) గోపి – నానీలు :** మినీ కవిత ఇటీవల మార్చుకున్న వేషం 'హైకూ'. ఇప్పుడు కొత్త రూపం 'నానీ'. ఈ ప్రక్రియకు 'నాన్న'గా ముందుకు వచ్చిన వారు ఎన్. గోపి. వారు నానీలను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకువెళుతున్నారు. ఈ క్రమంలో అతన్ని 'నానీ'లకు మూలపురుషుడిగా నిలిపినవి గోపి నానీలు.

**(3) నల్లగేటు – నందివర్ధనం చెట్టు:** దళిత వర్గం నుంచీ వచ్చిన మరో ప్రతిభావంతుడైన 'శిఖామణి' రాసిన కవితా సంపుటి ఇది. తరతరాల దళితుల బాధలు, అగ్రవర్ణాల ఈసడింపులతో ఆత్మాభిమానాల్ని కోల్పోయిన వారి ఆక్రందనలు అలవోకగా అందమైన పదచిత్రాలుగా ఈ గ్రంథంలో రూపు కట్టాయి. అణగారిన కులాల అమాయకత్వం స్వచ్ఛమైన వారి ప్రేమలు ప్రతి పేజీలోను పరచుకున్న పుస్తకం ఇది.

## నాటకాలు

ఛానల్స్ కల్చర్ సాహిత్యాన్ని చావుదెబ్బ తీస్తే, గ్లోబలైజేషన్ గూబలు పగలగొట్టింది. ఆ దెబ్బకు మొదట నేల కొరిగిన సృజన వృక్షం నాటకం. అయినా నంది, గరుడ, అప్పా బోష్యుల విష్ణుబొట్ల ఫౌండేషన్ పోటీలు నాటకాన్ని నిలబెడుతున్నాయి. ఆ పోటీల కోసమైనా నాటక రచనలు చేస్తున్న వారు కొందరైనా ఉన్నందుకు తప్పక సంతోషించాలి. ఈ నేపథ్యంలో ప్రదర్శన నాటకాలు కొన్ని, పఠన నాటకాలు కొన్ని ఈ మధ్య కాలంలో వెలువడి నాటకాల ఉనికిని చాటు కుంటున్నాయి.

**(1) పడమటి గాలి :** సుదీర్ఘమైన ఈ నాటకాన్ని రచించిన వారు పి. ఆనందరావు. దీనికి అమెరికా వారి 'ఆటా' బహుమతి కూడా లభించింది. దాదాపు నాలుగు గంటల పాటు ప్రదర్శింపబడే ఈ నాటకం తెలుగు నేలలోని నలుమూలలా కొన్ని వందలసార్లు ప్రదర్శింపబడి ఒక కొత్త సంచలనాన్ని సృష్టించింది. ఓ విధంగా మరణశయ్య పైనున్న నాటక కళకు తిరిగి ఊపిరి పోసింది. ఇందులోను రైతుల కడగండ్లే ప్రధాన ఇతివృత్తం. అమెరికా సామ్రాజ్యవాదానికి ప్రతీకగా నిలిచిన ప్రపంచీకరణ దుష్ట ఫలితాలను రసరమ్యంగా నిర్వహించిన నాటకం ఇది.

**(2) ఎడారి కోయిల :** హింస ధ్వని, మిస్డ్ కాల్స్ వంటి ప్రసిద్ధ నాటకాల్ని రచించిన వల్లూరి శివప్రసాద్, మధుర కథా రచయిత మధురాంతకం రాజారాం రాసిన ప్రసిద్ధమైన 'ఎడారి కోయిల' కథకి చక్కటి నాటకీకరణ చేశారు. ఇది కూడా అనేక బహుమతుల్ని, పురస్కారాలను అందుకుని నాటక వ్యవస్థలో ఓ మైలురాయిగా నిలిచింది.

**(3) కాటమరాజు యుద్ధం :** దీన్ని కూడా కొద్ది మార్పులతో ప్రదర్శించినట్లు రచయిత చెప్పుకున్నా ఇది పఠన నాటకంగానే మిగిలిపోయింది. దీని రచయిత డాక్టర్ వి.ఆర్. రాసాని. ఈ దశాబ్ది ఆరంభంలో ముద్రింపబడిన ఈ నాటకంలో 13వ శతాబ్దానికి చెందిన ఒక వీరగాథ చక్రాన్ని చిత్రించడం జరిగింది. జానపద సాహిత్యంలో వీరగాథా చక్రాలు (Balled Cycles) అనేవి ప్రత్యేకమైన వీరగాథల సమాహారాలు.

ఒక కథకు సంబంధించిన సంఘటనలు కథల రూపంలో ప్రచారంలో వుంటాయి. వాటన్నింటినీ ఒక్కచోట చేరిస్తే పూర్తి కథ తెలుస్తుంది. వీటిని 'వీరగాథా చక్రాలు' అంటారు. అలాంటి వాటిలో ప్రపంచంలోనే పెద్ద వీరగాథా చక్రాలుగా గుర్తింప బడినవి తెలుగు జానపద సాహిత్యంలోనే వున్నాయి. అవి పల్నాటి వీర చరిత్ర, కాటమరాజు కథలు, సంచార భిక్షుకులైన కొందరు వీధి గాయకులు పాడే గాథలివి. 24 రాత్రులు, 24 గాథల్ని ఆలపించగలిగే కథా సమాహారం పల్నాటి వీరచరిత్ర. అలాగే 32 రాత్రులు సాగే 32 గాథల సుదీర్ఘమైన వీరగాథా చక్రం కాటమరాజు యుద్ధగాథలు. ఈ ముప్పయి రెండు గాథల్ని ఒక నాటకంగా కూర్చడం కష్టమైన పని. దాన్ని రాసాని ఈ నాటకంలో సాధించారు. అందుకే ఇది పోణంకి దక్షిణామూర్తి, కీ.శే. పి.వి. రమణ, కొలకలూరి ఇనాక్, పి.వి. అరుణాచలం, తంగిరాల వంటి మేధావుల ప్రశంసల్ని పొందిన నాటకం. అప్పట్లో కొందరు దీన్ని లిమ్కా వరల్డ్ బుక్ రికార్డ్సుకు కూడా సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది.

## విమర్శ

ఈ దశాబ్దంలో పలువురు విమర్శనా గ్రంథాల్ని ప్రచురించారు. విమర్శ చదివే వాళ్ళే కరువైన ఈ రోజుల్లోను అందరి మన్ననల్ని పొందిన వ్యాస సంకలనాలు లేకపోలేదు. అలాంటి విమర్శనాత్మక గ్రంథంగా పేరు ప్రఖ్యాతుల్ని ఆర్జించిన పుస్తకాలు ఒకటి రెండు గుర్తుగానైనా మిగిలాయి. అలాంటి వాటిలో కీ.శే. వల్లంపాటి వెంకట సుబ్బయ్యగారి 'కథా శిల్పం' మొదటగా పేర్కొనదగింది. కొత్తగా రచనలు చేస్తున్న వారికిది కరదీపిక. అలాగే వీరు రాసిన 'నవలా శిల్పం' కూడా గొప్ప గ్రంథం. చిన్న విమర్శనే భరించలేని నేటి యువ రచయితలకు ఈ రెండు పుస్తకాలు తప్పక కొన్ని పాఠాల్ని నేర్పుతాయి. సందేహం లేదు.

## అనువాదాలు

ఇక చివరగా ఈ మధ్యకాలంలో ఇతర భాషల నుంచీ అనువాదం చేసుకున్న గ్రంథాలు కూడా కొన్ని సంచలనాలను సృష్టించాయి.

**(1) కల్యాణి :** జ్ఞానపీఠ్ పురస్కారాన్నందుకున్న ప్రసిద్ధ అభ్యుదయ తమిళ రచయిత రాసిన నవలకు తెలుగు అనువాదం ఇది. అనువాదకర్త జిల్లేళ్ళ బాలాజీ. ఇది ఒరిజినల్ నవలలా చదివించే గుణం కలిగి ఉండటమే గాకుండా ఆంధ్రజ్యోతి దినపత్రికలో సీరియల్‌గా ప్రచురింపబడి

అనువాదకులకు ఒక నూతన చైతన్యాన్ని, నమ్మకాన్ని కలిగించింది. దీన్ని విశాలాంధ్ర వారు పుస్తకంగా ప్రచురించారు.

**(2) రొయ్యలు :** మలయాళంలో ప్రసిద్ధి చెందిన నవలాకారుడు 'తగళి శివశంకర్ పిళ్ళై'. ఆయన రాసిన 'చెమ్మీన్' నవలను గన్నవరపు సుబ్బరామయ్య అనువాదం చేయగా కేంద్ర సాహిత్య అకాడమీ వారు ముద్రించారు. కేరళలోని సముద్రపు ఒడ్డున నివసించే జాలరుల జీవితాల నేపథ్యంలో సాగే ఈ నవల డైరెక్టు నవల కంటే గొప్ప పేరును సంపాదించింది. ప్రతి కథకుడు, నవలాకారుడు ఎప్పుడో ఒకప్పుడు తప్పక చదివి వుంటాడన్న భరోసాని ఈ నవల ఇస్తుంది.

**(3) రెక్కలు చాచిన పంజరం :** ఆంగ్లంలో జైలు జీవితాల్ని గడిపే రాజకీయ ఖైదీల దీనావస్థను గుర్రపు పరుగు వేగంతో కథాగమనాన్ని సాగించి ఉత్కంఠను రేకెత్తించి, శరీరాన్ని గగుర్పొడిపించే వాస్తవాలను చిత్రించిన నవల 'పాపియాన్'. రచయిత షారియర్. దీన్ని ఎంతో హృద్యంగా ఎంతో శ్రమించి ఎం.వి. రమణారెడ్డి 'రెక్కలు చాచిన పంజరం' పేరుతో అనువదించారు. ఇది కూడా మంచి పుస్తకంగా ఆంధ్రుల స్మృతి పథంలో కలకాలం నిలిచే నవలగా గుర్తింపు పొందింది.

### కథా సిరీస్

ఏ యేటికాయేడు వివిధ పత్రికల్లో వచ్చిన మంచి కథల్ని ఒకచోట చేర్చి అందిస్తున్న కథా సంకలనాలు కథా సాహితీ వారి కథా సిరీస్, మధురాంతకం రాజారాం సాహిత్య సంస్థ ప్రచురిస్తున్న కథా వార్షికలు సాహిత్యాభిమానులు సంతోషంగా భావించే పుస్తకాలు. ఇవి ఈ మధ్యన ప్రజాదరణ పొందుతున్న సంకలనాలు.

ఇది గత పదేళ్ళ లోపు వెలువడి ఆంధ్రుల గుండెల్లో గౌరవస్థానాన్ని పొందిన పుస్తకాల పరిచయం.

### ముగింపు

ఈ గ్రంథ రచయితలే గాక ఇంకా అప్పుడప్పుడూ మంచి నవలల్ని, కథల్ని రాస్తున్న రచయితలూ లేకపోలేదు. అంపశయ్య నవీన్ (కాలరేఖలు), కాలువ మల్లయ్య, శాంతి నారాయణ, కె.ఎన్.వై. పతంజలి, చంద్రలత (రేగడివిత్తులు) ఎ. అప్పల్నాయుడు, బి.ఎస్. రాములు, కె.ఎన్. బాలాజీ, కాట్రగడ్డ దయానంద్, మంచికంటి, మధురాంతకం నరేంద్ర, వివిఎన్ మూర్తి, కె.వి. నరేందర్, బత్తుల ప్రసాద్, వేంపల్లి గంగాధర్, దాదా హయత్, కాశీభొట్ల వేణుగోపాల్, వి. చంద్ర శేఖర రావు, వాడ్రేవు చినవీరభద్రుడు, సలీం లాంటి వాళ్ళు మంచి సాహిత్యాన్ని సృష్టిస్తు న్నారు. వీళ్ళని చూస్తుంటే తెలుగు కథ, నవల, కవిత్వం, నాటకం వంటి సాహిత్య ప్రక్రియలకు ఇంక పాతికేళ్ళ వరకూ ఢోకా లేదనిపిస్తుంది. ఈ పాతికేళ్ళలో మరెందరో సాహిత్యకారులు పుట్టుకొచ్చి తెలుగు సాహిత్యాన్ని తప్పక ముందుకు తీసుకు వెళతారు.

---



## జిందాబాద్

**సిహెచ్. మధు**

ఇపుడు నా కలం భూస్వరంగా మారింది
ఇపుడు నా గొంతు భూస్వరమై మ్రోగుతుంది
ఇపుడు నా కవిత భూస్వరానికి అంకితమవుతుంది

ఇక్కడ నా జనం భూపోరాటం జిందాబాద్ అంటున్నారు
ఇక్కడ నా ప్రజ భూమి కొరకు
భూమ్యాకాశాలను ఏకం చేస్తున్నారు
ఇక్కడ నా వాళ్ళు వాళ్ళ భూమి కొరకు
నిరంతర పోరాటానికి నింగిపైకి పిడికిలెత్తారు

ఇపుడు నా కలం భూస్వరంగా మారింది
ఇపుడు నా ప్రతి పదం భూస్వరాన్ని తలకెత్తుతుంది
ఇపుడు నా రచన భూపోరాటం అడుగుజాడలో నడుస్తుంది

దున్నేవాడిది భూమంటూ వున్నవాడిది కాదంటూ
రైతు బిడ్డలం మేము రాత్రింబగళ్ళు ఏకం చేసాం
తలదాచుకోవడానికి ఓ వంద గజాల భూమంటూ
ఈ భూమంతా మాదంటూ
దిక్కులన్నిటా ఏకమయ్యాం

సంస్కరణలన్నారు, సంఘాలన్నారు, కమిటీలన్నారు
సిఫార్సులన్నారు 'కోనేరు' అన్నారు
అన్నిటినీ నానబెట్టారు, తుపాకీలకు సానబెట్టారు
పవర్ పాలిటిక్స్ రాజకీయాలు
మోసానికి ప్రతీకలు
గద్దెనెక్కారు జనాన్ని గంగలో కలిపారు
సెజ్‌లంటున్నారు, మండళ్ళంటారు
వందల వేల ఎకరాలు సంతర్పణ చేస్తారు
రియల్ ఎస్టేట్ బూమ్‌లో జనం మట్టిపాలయ్యారు
జనం మోసపోయింది, ఓడిపోలేదు
పిడికిలి బిగించింది
మా భూమి మా కంటూ
భూపోరాటం జెండా ఎగిసింది
ఆకాశమెగసింది, చీకటి మెరిసింది
ఇది కవిత్వం కాదు
జనం గుండె దండోరా
ఆకలి కేకల జనం మంట
కవిత్వం లేని భూపోరాట భూస్వరం పాట
లాఠీలు మోగనీ – జైళ్ళు నిండనీ
ముదిగొండలు ఎన్ని చేస్తారో చేయనీ
భూపోరాటం ఆగదు
భూస్వరం ఆగదు

# తెలుగు నవలలో మహిళ



**నవలా సాహిత్యానికి ముందు వచ్చిన కావ్య ప్రబంధ సాహిత్యమంతా పురుషులను మాత్రమే ఉద్దేశించింది. సంబోధించింది. పురుషుల అభిరుచులకు ప్రాధాన్యతనిస్తూ రాయబడింది. అక్షరవిద్య అధ్యయనం అన్ని సామాజిక వర్గాలకు అందుబాటులోకి తీసుకొని వచ్చిన ఉదార విద్యావిధానంలో భాగంగా జ్ఞాన ప్రపంచం పురుషులతో పాటు స్త్రీలది కూడా అన్న ప్రజాస్వామిక ప్రాపంచిక దృక్పథం అభివృద్ధి చెందుతూ స్త్రీ విద్య ప్రాధాన్యత గుర్తించబడుతున్న తరుణంలో నవలా ప్రక్రియ వికసించింది.**

**కాత్యాయనీ విద్మహే**

**కాకతీయ విశ్వవిద్యాలయం**

తెలుగులో నవల సంస్కరణోద్యమం అభివృద్ధి పరిచిన ప్రక్రియ మాత్రమే కాదు, స్త్రీలను పాఠకులుగా ఎంచుకొని విస్తరించిన ప్రక్రియ కూడా. తెలుగులో నవల 1872లో నరహరి గోపాలకృష్ణమ శెట్టిగారి రంగరాజ చరిత్రతో ప్రారంభమై 1878 లో కందుకూరి వీరేశలింగం పంతులు రచించిన రాజశేఖర చరిత్రతో నిర్దిష్ట స్వరూప స్వభావాలను సంతరించుకొన్నది. చింతామణి పత్రిక నవలల పోటీలు పెడుతూ 1894 ఆగస్టు సంచికలో చేసిన ఒక ప్రకటనలో నవలలో కథ 'నీతి బోధకముగాను, దేశాభివృద్ధి కనుకూల పడునదిగాను వుండవలెనని", ఎక్కడను స్త్రీలు చదవగూడని మృదుత్వము తప్పిన మోటు మాటలు గాని యంశములు గాని యుండకూడదని' పేర్కొన్నది. సంఘసంస్కరణమే దేశాభివృద్ధికి మూలమున్న దృష్టి వున్న ఆ కాలపు ఈ ప్రకటనలోని దేశాభివృద్ధికి అనుకూలత అన్నమాట సంఘ సంస్కరణ అనుకూలతను సూచించే మాటే. సంఘ సంస్కరణోద్యమం. సంఘ ప్రధానంగా స్త్రీని కేంద్రంగా చేసుకొన్నది. అందువల్ల నవలలో మహిళ ఏ విధంగా చిత్రించబడిందో పరిశీలించటం ఆసక్తికరంగా వుంటుంది.

నవలా సాహిత్యానికి ముందు వచ్చిన కావ్య ప్రబంధ సాహిత్యమంతా పురుషులను మాత్రమే ఉద్దేశించింది. సంబోధించింది. పురుషుల అభిరుచులకు ప్రాధాన్యతనిస్తూ రాయబడింది. అక్షరవిద్య అధ్యయనం అన్ని సామాజిక వర్గాలకు అందుబాటులోకి తీసుకొని వచ్చిన ఉదార విద్యావిధానంలో భాగంగా జ్ఞాన ప్రపంచం పురుషులతో పాటు స్త్రీలది కూడా అన్న ప్రజాస్వామిక ప్రాపంచిక దృక్పథం అభివృద్ధి చెందుతూ స్త్రీ విద్య ప్రాధాన్యత గుర్తించబడుతున్న తరుణంలో నవలా ప్రక్రియ వికసించింది. కనుక స్త్రీలు నవలా పాఠకులుగా గుర్తించబడటం అతి సహజంగా, అనివార్యంగా జరిగిపోయింది. స్త్రీలను పాఠకులుగా గుర్తించిన తరువాత నవలా ప్రక్రియ ద్వారా స్త్రీలకు, ఎటువంటి నమూనాలు అందించబడినాయో తెలుసుకొనటం కూడా ఆసక్తి కరంగా వుంటుంది. అందువలన 'తెలుగు నవలలో మహిళ' చిత్రించబడిన రీతుల అధ్యయనం ఒక సామాజిక చరిత్రను, మహిళల పట్ల సమాజవైఖరిని, మహిళల జీవన సంస్కృతిని, జీవిత విలువలను తెలుసుకొనటానికి ఎంతయినా ఉపయోగకరంగా వుంటుంది.

ఇప్పటికి సరిగ్గా 123 సంవత్సరాల చరిత్ర కలిగిన తెలుగు నవలలో మహిళ కాలక్రమ వరుసలో సామాజిక రాజకీయార్థిక పరిణామాల నేపథ్యం నుండి ఏ విధంగా చిత్రించబడిందో పరిశీలించవచ్చు. పురుషులు రాసిన నవలలకు, స్త్రీలు రాసిన నవలలకు మధ్య స్త్రీల జీవితచిత్రణలో తేడాలు ఏమున్నాయో పరిశీలించవచ్చు. ఏ వర్గాల మహిళల జీవితం ఏ మేరకు నవలేతి వృత్తాలలో భాగమైందో చూడవచ్చు. మొత్తం మీద తెలుగు నవల ఆధారంగా మహిళల జీవితంలో వచ్చిన అభివృద్ధి వెలుగు నీడలను అంచనా వేయవచ్చు.

## 1

బ్రిటిషు వలన పాలనలో సామాజిక ఆర్థిక రాజకీయ అసమానతలకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాల చైతన్యం తెలుగులో, నవలేతి వృత్తాలను ప్రభావితం చేస్తూ వచ్చింది. ఆ మేరకు నవలల్లో మహిళల పాత్ర స్వభావం కూడా మారుతూ వచ్చింది. తొలి నవలలకు నేపథ్యం సంస్కరణోద్యమం. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా జీవితాలను, ఆధునికీకరించు కొనవలసిన అవసరాన్ని నొక్కి చెప్తూ అందుకు అవరోధంగా వున్న పనికిమాలిన పాతబడిన కాలం చెల్లిన సంప్రదాయాలు, ఆచారాలు, మూఢ విశ్వాసాలు, ఆచరణలు వదిలించు కొనవలసిన వన్న చైతన్యాన్ని పెంచే ఉద్దేశంతో ఈ నవలలు వచ్చాయి. సంస్కరణోద్యమంలో స్త్రీల జీవితం, సమస్యలు ప్రధానాంశాలు కనుక సంస్కరణోద్యమ నేపథ్యంలో వచ్చిన నవలలో మహిళల జీవితంపై విమర్శ కనబడుతుంది.

"కందుకూరి వీరేశలింగం పంతులు రాజశేఖర చరిత్ర నవలలో నీలాపిరేవు సన్నివేశాన్ని ఈ ప్రయోజనం కోసమే కల్పించాడు." అందరును ఒక్కచోట సమావేశమై సావకాశముగా మాట్లాడు కొనుటకు నీళ్ళకు వచ్చినప్పటికన్న మంచి సమయం స్త్రీలకెప్పుడును దొరకదు" అని అంటూనే అక్కడికి వచ్చి స్త్రీలు స్త్రీల శీలాన్ని గురించి, మగవాళ్ళ దౌర్జన్యాన్ని గురించి,

H 1990 మార్చి 28–31 తేదీలలో మధురై కామరాజ్ యూనివర్సిటీ, మధురైవారు 'Novel in Dravidan languages' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో సమర్పించిన పత్రానికి అభివృద్ధి రూపం.

అత్తలు, ఆడబిడ్డలు పెట్టే ఆరళ్ళ గురించి, పురుషుల భోగలాలసత గురించి, నగలమీద స్త్రీల ఆశల గురించి, తోటి స్త్రీలలోని దోషాల గురించి మాట్లాడుకొంటున్నారని చెప్పి విద్యాగంధమే యెరుగని మూఢవనితలకు మాట్లాడు కొనుటకు అంతకన్న మంచి విషయము లేమి దొరుకును? అని ఆ రకమైన స్త్రీ ప్రవృత్తికి విద్యలేక పోవటమే కారణమని నిర్ధారించాడు. పాతతరం స్త్రీలు నియంతలుగా ప్రవర్తిస్తూ సామాజిక మార్పులను ఆమోదించలేకపోతున్నారని అందులో భాగంగానే 'ఆడచెత్త' అని ఆడపిల్ల పుట్టుకనే నిరసించే స్థాయిలో వున్నారని సత్యవతీ చరిత్ర నవలలో (1883) యశోదమ్మ పాత్ర ద్వారా సూచించాడు. ఈ నవలలో సత్యవతి పాత్ర ఆయన స్త్రీలకు ఆదర్శంగా చూపించదలుచుకొన్న మహిళ. ఆమె విద్యావంతురాలు. అందువల్ల ఆమెను వ్యర్థ ప్రసంగాలు చేయనదానిగా శుచిగా శుభ్రంగా వుండే దానిగా మంచి పుస్తకాలు చదువుకొంటూ కాలాన్ని సద్వినియోగం చేసేదిగా నోములు, వ్రతాలు, ఉపవాసాలు, జాగారాలు అంటూ ఆరోగ్యాన్ని పాడు చేసుకోకుండా హేతుబద్ధంగా ఆలోచించేదిగా, అత్తగారు తోడికోడళ్ళతో సహనంగా ప్రవర్తించే దానిగా, తోటి స్త్రీల సమస్యలను అర్థం చేసుకొని వాళ్ళ శరీరారోగ్యాల గురించి పట్టించుకొని ప్రవర్తించే మానవిగా, భర్త ప్రేమకు పాత్రురాలైన భార్యగా ఒక ఆదర్శ నమూనాగా చిత్రించాడు. చదువుల వల్ల స్వతంత్రంగా సంసారాన్ని నిర్వహించటం, భర్తకు మంచి సలహాదారుగా పనిచేయటం, స్వంత నిర్ణయాలు తీసుకొని ప్రవర్తించటం లాంటి కొత్త విలువలు స్త్రీల జీవితంలోకి ప్రవేశించటాన్ని సత్యవతి పాత్ర ద్వారా చూపించినప్పటికీ స్త్రీల జీవితధ్యేయం మాత్రం. భర్త, అత్తమామలు, ఆడబిడ్డ తదితరులతో కూడిన కుటుంబానికి వాళ్ళ సౌఖ్యాలకు, ప్రయోజనాలకు కట్టుబడి వుండటమే సత్యవతీ చరిత్ర చదివి స్త్రీలు బుద్ధిమంతులు కావాలన్నది వీరేశలింగం ఆకాంక్ష.

వీరేశలింగం పంతులు స్త్రీ విద్యకోసం పాటుపడ్డాడు. వితంతు వివాహాలు చేయించాడు. అయితే ఆయన స్త్రీ విద్యా ఉద్యమ లక్ష్యాలను ఇతివృత్తంగా చేసుకొని 'సత్యవతీ చరిత్ర' నవల రాసినట్లు పునర్వివాహ విషయాన్ని ఇతివృత్తంగా చేసుకొని నవల రాయలేదు. ఆ లోపాన్ని పూరిస్తూ నిడమర్తి సత్యనారాయణ మూర్తి 1927లో సుశీల అనే నవల రాశాడు. ఈ నవలలో రత్తమ్మ పునర్వివాహం చేసుకొన్న స్త్రీ.



సంస్కరణ ఉద్యమంలో ప్రయోజనం పొందిన ఇటువంటి స్త్రీలు తాము పొందిన స్వంత ప్రయోజనాలతో సంతృప్తి పడి పూరుకోకుండా సామాజిక సంస్కరణకు తమవంతు కృషి చేసినప్పుడే ఉద్యమ ఆకాంక్షలు సంస్కార రూపంలో జీవితంలో భాగమవుతాయి. దానిని సూచించటానికి ఒక నమూనాగా రత్తమ్మ పాత్ర చిత్రించబడింది. స్త్రీ విద్య, పునర్వివాహం మొదలైన విషయాలలో అనుకూల భావాలను వ్యాపింపచేయటానికి ఆమె చురుకైన కార్యకర్తగా కృషి చేస్తుంటుంది. ఉద్యోగరీత్యా భర్త వేరే చోట వున్నా సంస్కరణ కార్యకలాపాలలో పాల్గొనటానికి అనువుగా వుంటుందని రాజమహేంద్రవరంలోనే వుంటుంది. రెండో పెళ్ళి చేసుకొన్నవాళ్ళని వితంతువులను వేరుగా చూచి ఎడంగా వుంచే సమాజంతో సభ్యత కోసం 'పేరంటాలు' మొదలైన వాటిని వేదికగా చేసుకొంటుంది. ఆరకంగా సంస్కరణోద్యమ ప్రయోజనాల వ్యాప్తి ప్రచారాల కోసం తనకు చేతనైన పరిధిలో ప్రయత్నించిన స్త్రీగా, స్త్రీలందరి వలెను భర్త యెడ మూఢ వినయమును ప్రకటించునది కాక స్వతంత్ర నాశించు' వ్యక్తిగా రత్నమ్మ పాత్ర చిత్రించబడింది.

సంస్కరణోద్యమం స్త్రీని ఒక ప్రత్యేక వ్యక్తిగా గుర్తించి స్త్రీ జీవితంలో అభివృద్ధికి విద్యను, పునర్వివాహాన్ని మార్గాలుగా చూపించింది. ఆ క్రమంలో వ్యక్తిత్వం వికసించి స్త్రీలు ఆత్మగౌరవ చైతన్యంతో తమకు ఎవరో ఏదో మంచి అని బోధిస్తే దానిని స్వీకరించే స్థితి నుండి తమకు ఏది కావాలో అన్వేషించి తెలుసుకొనే స్థితికి కావలసిన దానిని సాధించుకోగలిగిన స్థితికి ఎదగగలిగారు. అట్లా ఎదుగుతున్న స్త్రీలను చూపిస్తూ నవలలు రాసినవాడు చలం. 1921లో రాసిన శశిరేఖ అతని మొదటి నవల. 1948లో రాసిన జీవితాదర్శంతో కలిపి చలం రాసిన నవలలు ఎనిమిది. సరిగ్గా జాతీయోద్యమం ముమ్మరంగా సాగి దేశానికి బ్రిటిషువలస పాలన నుండి స్వాతంత్ర్యం వచ్చిన కాలం అది. జాతీయోద్యమ ప్రారంభానికి వీరేశలింగం ప్రత్యక్ష సాక్షి అయితే వికాసానికి చలం ప్రత్యక్ష సాక్షి. క్రూరములైన కులాచారాలకు దాసులమై మన ఇంట నుండు స్త్రీల కష్టములను నివారింపలేని వారము రాజ్యాంగ స్వాతంత్ర్యములను పొంది దేశము యొక్క కష్టముల నెట్లు నివారించగలుగుదుము" అని వీరేశలింగం 1887 నాటికే స్వీయ చరిత్రలో ప్రశ్నించారు. వీరేశలింగాన్ని 'స్పిరిట్యువల్ ఫాదర్'గా అంగీకరించిన చలం కూడా అటువంటి దృక్పథాన్నే ప్రదర్శించాడు. విడాకులు నాటకంలో చలం విదేశీ బానిసత్వం కన్నా బాధాకరమైన బానిసత్వాన్ని ఈ దేశపు స్త్రీలు పురుషుల అధికారం క్రింద అనుభవిస్తున్నారన్నాడు. ఆ బానిసత్వం నుండి విముక్తికి స్వేచ్ఛా స్వాతంత్ర్య పిపాసులై కుటుంబ సంబంధాలపై తిరుగుబాటు చేసిన స్త్రీలు చలం నవలల్లో కనబడతారు. శశిరేఖ నవలలో శశిరేఖ, దైవమిచ్చిన భార్య నవలలో పద్మావతి అందుకు నిదర్శనం. శశిరేఖ తన జీవితం మీద బరువై కూర్చొని తనను అనుక్షణం నియంత్రించే ఇష్టంలేని పెళ్ళి నుండి ఇష్టం లేని కాపురం నుండి పరాధీనత నుండి, పెత్తనాల నుండి, పెత్తనాలు చేసే సంస్థల నుండి, వ్యవస్థల నుండి విముక్తికి చేసిన ప్రస్థానమే శశిరేఖ నవలలో విషయం. స్వేచ్ఛకు ప్రేమకు సహజీవనం వివాహ వ్యవస్థలో సాధ్యం కాదని గుర్తించి తిరస్కరించి, అందుకోసం ప్రాణాలే వదిలేసింది శశిరేఖ.

పెళ్ళి ద్వారా లభించిన భర్త హోదాలో పురుషుడు స్త్రీల జీవితంపై సాగించే నియంత్రణ ఏ స్థాయిలో వుంటుందో దానికి రాజ్యం మద్దతూ కూడా ఎలా లభిస్తుందో దైవమిచ్చిన భార్యలో చూపించిన చలం ఇటువంటి అధికార వ్యవస్థపై తిరుగుబాటు చేసిన 'పద్మావతి'ని దైవమిచ్చిన భార్యలో చిత్రించాడు. సంఘం, చట్టం, నీతి, దేవుడు, దోవనపోయే వారందరూ పురుషుడికి భార్య జీవితం మీద సంక్రమింప చేసిన యాజమాన్యపు హక్కును వినియోగించుకొనే భర్తను భరించలేక వెళ్ళిపోయిన 'అరుణ' అరుణ నవలలో కనబడుతుంది. అయితే అదే సమయంలో నవలా సాహిత్యరంగంలో చలానికి ప్రతిద్వంద్విగా విశ్వనాథ సత్యనారాయణ సనాతన ధర్మానికి సంప్రదాయ విలువలకు కట్టుబడి వుండటమే స్త్రీల జీవిత లక్ష్యంగా చేసి చెలియలికట్ట, గంగూలీ ప్రేమ కథ, నీలపెండ్లి వంటి నవలలు రాశాడు.

పితృస్వామిక సామాజిక కుటుంబ వ్యవస్థకు ఒదిగివుండే స్వభావం గల రత్నావళి, బాల, నీల వంటి పాత్రలను సృష్టించి విశ్వనాథ వాళ్ళను సమాజానికి ఆదర్శంగా చూపే ప్రయత్నం చేశాడు. చలం నవలల్లో స్త్రీలు స్వీయ జీవితానుభావ జ్ఞాన చైతన్యాల నుండి కుటుంబాధికార వ్యవస్థా స్వభావాన్ని, అందులో పురుషుడికి, పురుషుడి వైపు బంధువులకు స్త్రీలపై వుండే నియంత్రణను ప్రశ్నించి ధిక్కరించే వాళ్ళు. అయితే విశ్వనాథ నవలల్లో స్త్రీ పాత్రలు వ్యవస్థా ధర్మానికి అనుకూల వ్యాఖ్యాతలు. జాతీయోద్యమ నేపథ్యం నుండి విశ్వనాథ అలవరచుకొన్న అతివాద జాతీయ దృక్పథం చివరకు స్త్రీలకు స్త్రీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు వ్యతిరేకమైంది. కావటం ఒక వైరుధ్యం, విషాదం.

## 2

జాతీయోద్యమ నేపథ్యంలో జాతీయోద్యమాన్ని ఇతి వృత్తంలో భాగం చేసుకొని వచ్చిన నవలల్లో అడవి బాపిరాజు రాసిన 'కోనంగి' ఒకటి ఇందులో అనంతలక్ష్మి కాంగ్రెసు రాజకీయాలను అభిమానించే కోనంగి భార్య. చేమారాణి కమ్యూనిస్టు రాజకీయాలను అభిమానించే రెడ్డికి భార్య. అయితే జాతీయ రాజకీయాలలో వ్యక్తులుగా వాళ్ళ పాత్ర ఏమీలేదు. జాతీయోద్యమంలోకి స్త్రీలను సమీకరించిన మేరకయినా స్త్రీల జీవితం నవలలో భాగం కాలేకపోయింది. అయితే ఆ లోటును కొంతలో కొంత భర్తీ చేయగలిగింది. ఉప్పల లక్ష్మణరావు రాసిన 'అతడు – ఆమె' (1922–48) నవల. ఇందులో శాంతం జాతీయోద్యమ రాజకీయాలలో క్రియాశీలంగా పాల్గొన్న స్త్రీ.

1930 ఏప్రిల్ 10 వ తారీఖున యంగిండియాలో గాంధీ ప్రత్యేకించి స్త్రీలకు ఖద్దరు ధరించమని, పికెటింగులు చేయమనీ బోధించారు. అంతకు ముందు నుండి జాతీయోద్యమ రాజకీయాల గురించి కొద్దో గొప్పో తెలిపి వున్నా గాంధీ గారి ఈ ప్రబోధం చదివి ఉత్తేజితురాలయ్యే శాంతం ఆనాటి నుండి ఏదో ఒక రకంగా ఉద్యమంతో సజీవ సంబంధం పెట్టుకొన్నది. తన దగ్గర వున్న మిల్లు బట్టలు తగలేసి ఖద్దరు, దీక్ష స్వీకరించింది. సత్యాగ్రహ శిబిరాలకు హాజరయింది. హరిజన సంఘంలో చేరి పనిచేసింది. అవి అన్ని సంపన్న వర్గాల వారి ప్రయోజనాలకు ఉపయోగపడుతుంటే చూసి బాధపడింది. పల్లెటూరి జనాన్ని రైతులను, కూలి నాలి జనాన్ని జాతీయోద్యమం ఆకర్షించ లేకపోయిందని ఆందోళన పడుతుంది.



సత్యాగ్రహ శిబిరాల దగ్గర శాంతం లాఠీదెబ్బలు తినటం, సత్యాగ్రహ ఉద్యమంలో, హరిజన సంఘాలలో పని చేయటం ఈ మొదలైన వాటిని ఆధారంగా చేసుకొని ఆమె భర్త శాస్త్రి కాంగ్రెస్ టిక్కెట్టు సంపాదించి ఎన్నికలలో నిలబడాలనుకొంటాడు. అది సహించలేక శాంతం పిల్లలిద్దరినీ తీసుకొని ఇల్లు వదిలి వెళ్ళింది. శాస్త్రిలో స్వార్థం తగ్గి మార్పు వచ్చాకనే అతనితో జీవితం మొదలుపెట్టాలను కొన్నది. ఆ ప్రకారమే చేసింది. ఆ రకంగా ఉద్యమం ద్వారా తాను చైతన్య వంతురాలై ఉద్యమాన్ని విమర్శ నాత్మకంగా చూడగలస్థాయికి 'ఎదగటమే కాదు తద్వారా పొందిన వ్యక్తిత్వంతో స్త్రీగా ఆత్మగౌరవంతో, జీవించటం లక్ష్యంగా ఎదిగిన ఎదుగుతున్న మహిళలకు ప్రతినిధిగా శాంతం పాత్రను సృజించాడు, ఉప్పల లక్ష్మణరావు.

1940వ దశకం నుండి నవలలు రాస్తూ 1968 వరకు 25 నవలలు రాసిన కొడవటిగంటి కుటుంబరావు అటు సంస్కరణోద్యమ వారసత్వం నుండి ఇటు జాతీయోద్యమ నేపథ్యం నుండి సమకాలంలో నూతన శక్తిగా వికసించిన కమ్యూనిస్టు రాజకీయ దృక్పథంతో మహిళల జీవితాన్ని చిత్రించాడు. కుటుంబరావు నవలల్లో మూడు తరాల మహిళలు కనబడతారు. 20వ శతాబ్దపు ప్రారంభంలో అంటే 1900 – 1910 మధ్య కాలంలో పుట్టి పెరిగినవాళ్ళు మొదటి తరం. 1920లల్లో పుట్టి 1935 ఆర్థిక సంక్షోభం నాటికి ఊహ తెలిసి రెండవ ప్రపంచ యుద్ధానికి ప్రత్యక్ష సాక్షులయిన వాళ్ళు. రెండవతరం. 1940లల్లో పుట్టినవాళ్ళు రెండవతరం. 1940లల్లో పుట్టినవాళ్ళు నవతరం. వీళ్ళలో మళ్ళీ జీవితం పట్ల ఏ ప్రేమాలేని వాళ్ళు – బెదిరిన మనుషులు నవలలో రావమ్మ, సోమిదేవి వంటి వారున్నారు. జీవితాన్ని ఉన్నదున్నట్లు స్వీకరించి జీవించటమే గాని తమకంటూ స్వంత ఆలోచనలు, ఆకాంక్షలు గాని వాటి కనుకూలంగా జీవితాన్ని నిర్మించుకోవాలన్న ఆసక్తి, ప్రయత్నం చేయనివాళ్ళు మరొక రకం. ఆడజన్మ నవలలో లక్ష్మి, వారసత్వం నవలలో భాను, గడ్డురోజులు నవలలో జానకి, పంచకళ్యాణి నవలలో సుజాత మొదలైన వాళ్ళు ఈ కోవకు చెందుతారు. లభించిన జీవితాన్ని తమ తమ చైతన్యాన్ని, అవకాశాలను బట్టి బాగుచేసు కొనటానికి ప్రయత్నించిన స్త్రీలు – అనుభవం నవలలో పార్వతమ్మ, సవతి తల్లిలో రాజ్యం మొదలైన వాళ్ళు. జీవితాన్ని తమకు కావలసిన విధంగా చొరవచేసి నిర్మించుకొన్నవాళ్ళు పంచకళ్యాణి నవలలో సుశీల, జానకి, లక్ష్మి, సరోజ డైరీలో సరోజ, కొత్త కోడలులో సరోజిని మొదలైన వాళ్ళు.

సవతి తల్లిలో రాజ్యం సవతితల్లి అనే మిషమీద సమాజం తన చుట్టూ సృష్టించిన శత్రుపూరిత వాతావరణంతో సంఘర్షిస్తూ సవతి పిల్లల సంరక్షణ బాధ్యత తన చేతిల్లోకి తీసుకొంటుంది. రాజ్యం కుటుంబంలో అత్త ఆడపడుచులతో పడిన ఈ ఘర్షణను గురించి చెప్తూ కుటుంబరావు 'రాజ్యం గతాన్ని వదిలించుకొనటానికి శిథిలమైపోయే సనాతన శక్తులతో ప్రత్యక్షంగా పోరాడింది' అంటాడు. రాజ్యంలాంటి వాళ్ళు చాలామంది చాలా రంగాల్లో చాలా సంఘర్షణలు కొనసాగిస్తేనే గాని జీవితంలో సుఖ పరిణామాలకు దారి ఏర్పడదు. జీవితం నిండా పురోగమనానికి అడ్డు తగిలే శిధిలాలున్నాయి. వాటిని నిర్మూలించిన మీదట గాని కొత్త నిర్మాణానికి అవకాశాలేర్పడవు అని అభిప్రాయపడ్డాడు. పురోగమనానికి అడ్డుతగిలే శిధిలాలను నిర్మూలించే పనిలో వున్న రాజ్యం లాంటి స్త్రీలను ఆయన అభిమానిస్తాడు. కానీ కొత్త నిర్మాణాలు చేసే స్త్రీల పక్షాన ఆయన నిలబడతాడు. రాజ్యం తనకు నచ్చిన పాత్రే కానీ తనకు బాగా ఇష్టమైన పాత్ర సరోజ డైరీలో సరోజ. తల్లి పెత్తనాలను కాదని తనంతట తాను వరుడిని ఎన్నుకొన్న స్త్రీ సరోజ. కొత్త కోడలులో సరోజిని కూడా తనకు కావలసిన వరుడిని తాను నిర్ణయించుకొని తనకు ప్రతికూలంగా వున్న అత్తగారింటి పరిస్థితులను చొరవతో చక్కదిద్దుకొన్న కొత్తతరం స్త్రీ. 1950ల కంటే ముందే రాసిన ఈ నవలలో వరుడి ఇంటికి ఇంట్లోవాళ్ళను, ఇంటి పరిస్థితులను చూచి అర్థం చేసుకోనటానికి తానొక్కతే వెళ్ళిన సరోజిని పాత్రను సృష్టించి కొడవటిగంటి కుటుంబరావు జీవితాన్ని నిర్మించుకొనదలచిన వాళ్ళకు వుండవలసిన చొరవను చైతన్యాన్ని సూచించాడు. అయితే

ఆయన నవలల్లో స్త్రీలెవ్వరూ జాతీయోద్యమ రాజకీయాలలో గానీ కమ్యూనిస్టు రాజకీయాలలో గానీ క్రియాశీల పాత్ర వహించిన వారు కాదు. చదువుకొనటం, స్వతంత్రంగా ఆలోచించటం, తమ జీవితాల గురించి తాము నిర్ణయాలు తీసుకోవటం. దానికి సంబంధించిన మంచి చెడుల బాధ్యత తామె వహించటం స్వాతంత్ర్యనంతర కాలపు మహిళాలక్షణంగా ఆయన ప్రతిపాదించటం కనిపిస్తుంది.

**(3)**

1935 నాటికే కమ్యూనిస్టుపార్టీ ఏర్పడినా 1947లో అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడి తరువాత గానీ కమ్యూనిస్టు పార్టీ భావజాల, నిబద్ధత నుండి తెలుగులో పూర్తిస్థాయి నవలలు రావటం జరగలేదు. 1947 నాటికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన తెలంగాణలో వికసించిన నైజాం వ్యతిరేక సాయుధ రైతాంగ పోరాటం అటువంటి నవలలకు నేపథ్యం అయింది. దీనితో శ్రామిక మహిళ జీవితం నవలకు వస్తువు కాగలిగింది.

అయితే శ్రామిక మహిళ జీవితమయినా మొదలయ్యే కుటుంబం దగ్గర నుండే తన కుటుంబానికి కడుపునిండా తిండి వుండాలంటే చేతినిండా పని వుండాలి. స్వంత వ్యవసాయం వుండాలి అని ప్రజల మనిషి నవల 1955)లో అన్నమ్మ భర్తతో కలిసి రాళ్ళభూమిని చదును చేసింది. రాజనాల వరి పండించింది. పిల్లలను సాక్కుంటూ వచ్చింది. భర్త చనిపోయినా సాగుకు వచ్చిన భూమిని చేతికి అందివచ్చిన కొడుకును చూచుకొని కుటుంబ జీవితం ప్రశాంతంగా కొనసాగిస్తున్నది. ఎన్నాళ్ళ నుండో తాము సాగు చేసుకొంటున్న ఆ భూమి తనదని పట్టా పుట్టించి దొర తమను భూమి నుండి బేదఖల్ చేసినప్పుడు ఆమె కుటుంబ జీవిత ప్రశాంతత చెదిరింది. తన భూమిలో దొర కట్టించిన అరకలకు అడ్డుతగిలే సామాజిక రాజకీయ చర్యలోకి ఆమె అతి సహజంగా అప్రయత్నంగా దిగింది. తెలంగాణలోని భూసంబంధాలలోని అసమానత కారణంగా విస్తృత సామాజిక రాజకీయ రంగాలలోని వచ్చిపడిన స్త్రీలకు ఒక ప్రతినిధి అన్నమ్మ.

తెలంగాణాలో భూస్వాముల భార్యలుగా స్త్రీలు భర్తల దౌర్జన్యాలు, దోపిడీలు, స్త్రీలపట్ల వాళ్ళ పీడన చూస్తూ మౌనంగా భరించవలసిన స్థితిలో వున్నారు. భర్తలు సంపాదించి పెట్టే నగలు నాణేలు చాటున తమ అసంతృప్తులను మరుగు పరుచుకొని జీవించాల్సిన స్థితి వాళ్ళది. వట్టికోట ఆళ్వారుస్వామి రాసిన గంగు నవలలో (1955 తరువాత) రత్నమ్మ, రమణమ్మ, ఆ రకమైన భూస్వాముల భార్యలకు ప్రతినిధి పాత్రలు.



రైతాంగ పోరాట చైతన్యం రైతాంగ వర్గానిది మాత్రమే కాదు. భూస్వామ్య ధనస్వామ్య కుటుంబాలలో పుట్టి పెరిగినా పట్న వాసపు ప్రాపంచిక జ్ఞానంతో సంబంధం నూతన చైతన్యాన్నిచ్చిన కమ్యూనిస్టుపార్టీ సిద్ధాంత అవగాహన వాళ్ళను రైతాంగ పోరాటం చైతన్యాన్ని అభివృద్ధి చేసుకొనేలా చేసాయి. అలాంటి స్త్రీలకు ప్రతినిధులు గంగు నవలలో కమల, సుజాత. స్త్రీలు కావటం వలన తమ శక్తులు పార్టీ పనికి ఉపయోగపడక వృద్ధా అవుతున్నాయనేది వాళ్ళ బాధ. సుజాత తండ్రి నిర్బంధంలో జీవించలేక పోతుంది. 'ఎవడో ఒకడు నా మెడన బడి నా ఆత్మను ఆదర్శాలను అణిచివేస్తాడని ఆమె బాధపడుతుంది. అంతటి ప్రమాదం రాకుండా పార్టీ తనకు కాపాడాలని ఆమె వాంఛిస్తుంది.

కమల పార్టీలో వుంటూ మగవాళ్ళ పెత్తనాన్ని వ్యతిరేకిస్తుంటుంది. 'సమాజం ఇంత నిరంకుశంగా రాక్షసంగా మారటానికి ఏ విధానం కారణమైనా దాంట్లో మగవాని స్వార్థం చాలా వుంది. అసలు మొదటి నుంచీ ఆడవాండ్లకే కనుక అవకాశాలిచ్చి వుంటే, ఇంత దుర్దశకు రాకుండా పోయేది' – అని అమె అభిప్రాయం. పార్టీ రాజకీయాలలో క్రియాశీలంగా పాల్గొనేందుకు స్వీయ చైతన్యంతో సన్నద్ధమవుతున్న ఆనాటి తెలంగాణ స్త్రీలకు ప్రతినిధులు వీళ్ళిద్దరు. 1955లో రచించినా వట్టికోట ఆళ్వారు స్వామి నవలల్లో స్త్రీలు 1935 నుండి 1945 మధ్య పదేళ్ళ కాలం మీద తెలంగాణలో రూపొందుతున్న సామాజిక రాజకీయార్థిక పరిణామాల నేపథ్యం నుండి తయారైనవారు. 1955 తరువాత కమ్యూనిస్టు రాజకీయాల చైతన్యంతో ఉత్తరాంధ్ర నుండి నవలలు రాసినది రాచకొండ విశ్వనాథశాస్త్రి. భూస్వామ్య పెత్తందారీ పీడనను లైంగిక పీడనను ఏకకాలంలో గురి అయిన స్త్రీలను రావిశాస్త్రి నవలల్లో చూడవచ్చు. గోవులొస్తున్నాయి జాగ్రత్త నవలలో మరిడీ మహలక్ష్మమ్మ ఇందుకు ప్రతినిధి పాత్ర. భూములు దోచుకోవడం ద్వారా భూములు పెంచుకొనే భూస్వాముల అధికారదాహం భూమితో పాటు సంపదలో భాగంగా పరిగణించబడే స్త్రీల మీదికి కూడా విస్తరిస్తుంది. పీడనపై ధిక్కారం ఒక సహజ ప్రతిచర్య అయి అది స్వీయ పీడనకు ప్రతీకారంగా వ్యక్తమయ్యే స్థితి నుండి సాధారణ, ఆర్థిక, రాజకీయ పీడనలకు ప్రతీకారంగా వ్యక్తమయ్యే దశకు చేరుతుందని గోవులొస్తున్నాయి జాగ్రత్త నవలలో లచ్చయ్యమ్మ పాత్ర ప్రవృత్తిలో నిరూపించాడు రావిశాస్త్రి. అంటే రావిశాస్త్రి నవలలో మహిళలు మహిళలుగా స్వీయ బాధలకు పేదవర్గాలకు చెందిన వారుగా వర్గదోపిడి పీడనలకు ఏకకాలంలో ప్రతిస్పందించగల వాళ్ళన్నమాట. రావిశాస్త్రి రాసిన 'మూడు కథల బంగారం' నవలలో విమల స్త్రీలకు ఆదర్శంగా చూపించదలిచిన పాత్ర. అడవిలో ఒంటరిగా బతికే ఆడదానికి అలా బతకాలంటే ఎన్నో విద్యలు– శారీరకదారుఢ్యానికి, మానసిక స్థైర్యానికి సంబంధించినవి రావాలని విమల అభిప్రాయం. ఒకరికి ఒకరు పీడించుకు తినే సాంఘిక ధర్మం నెలకొని వున్న సమాజం అడవే. అక్కడ స్త్రీలకు అసలే రక్షణ లేదు. ఆమె తనను తానే రక్షించుకోవాలి. ఆశక్తిని ఆడవాళ్ళు పెంచుకొని ఆత్మవిశ్వాసంతో నిలబడాలన్నది ఆయన ఆకాంక్ష.

రావిశాస్త్రి నవలలు నక్సల్‌బరి శ్రీకాకుళ పోరాటాలకు ముందు వెనుకలుగా వస్తే 1978 నాటికి ఉత్తర, తెలంగాణలో వ్యవసాయ పోరాటాల నేపథ్యంలో అల్లం రాజయ్య లాంటివారు నవలలు రాయటం ప్రారంభించారు. కొలిమంటు కొన్నది నవలలో భూస్వామ్య పీడనకు గురయిన వెంకటమ్మ వుంటే వూరు నవలలో ప్రజాపోరాటాలలో భాగస్వాములవుతున్న స్త్రీలు కనిపిస్తారు. ఆయనదే 'అగ్నికణం' నవలలో బాన్యక్క లైంగిక పీడనకు గురి అయి ఒంటరిగా చేయబడిన గ్రామీణ నిరుపేద స్త్రీలకు ప్రతినిధిగా కనిపిస్తుంది. బి.యస్. రాములు 'బ్రతుకుపోరు' నవలలో లక్ష్మి తదితర స్త్రీలు బీడి పరిశ్రమలో తక్కువ వేతనాలతో వ్యతిరేక పని పరిస్థితులతో దయనీయమైన జీవితం గడుపుతూ వాటికి వ్యతిరేకంగా పోరాడుతున్న తెలంగాణ స్త్రీల ప్రతినిధులుగా చిత్రించ బడ్డారు. ఆర్. పవన్‌కుమార్ నల్ల వజ్రం,

నవలలో సింగరేణి కాలరీస్‌లో త్రాగునీటి కోసం, వంటకు అవసరమైన ఇంధనం కోసం ఎంతో కష్టానికి ఒత్తిడికి గురి అయ్యే పరిస్థితులలో వున్న గని కార్మికుల భార్యల జీవితం చిత్రించబడింది.

తెలంగాణ విప్లవోద్యమ నవల శ్రామిక మహిళల జీవితాన్ని చిత్రించటంతో ఆగక గిరిజన మహిళల జీవిత చిత్రణకు విస్తరించింది. సాధన రాసిన 'రాగో (1993) అందుకు మంచి ఉదాహరణ. గిరిజన తండాలలో సంప్రదాయాలు ఆచారాల ఒత్తిడికి పీడనకు గురయ్యే స్త్రీలు, తమ మీద సాగుతున్న పీడనల నుండి విముక్తికి విప్లవోద్యమమే పరిష్కారం అని భావించి వస్తున్న స్థితిని రాగో జీవిత క్రమంలో నిరూపించింది ఈ నవల.

**(4)**

భారతదేశం బ్రిటిషు వలసపాలన నుండి విముక్తమైన తరువాత స్త్రీ విద్యా ఉద్యోగాలకు ప్రణాళికలల్లో లభించిన స్థానం కారణంగా స్త్రీలు తమ వ్యక్తిత్వాలను పురుషుడితో సంబంధం లేని స్వతంత్రతను వ్యక్తీకరించుకొనటానికి, సామాజికార్థిక రంగాలలో అవకాశాలు పెరిగాయి. ఇవి స్త్రీల జీవితంలో తెచ్చిన పరిణామాలను స్త్రీలే తమ అనుభవకోణం నుండి అంచనా వేసుకొనసాగారు. వ్యక్తిగత సామాజిక సమస్యలను తమ దృష్టికోణం నుండి చూచి అంచనా వేసుకొనే స్త్రీల శక్తి పదునెక్కుతూ నవలల్లో మహిళల చిత్రణలో మార్పు తెచ్చింది. డా.పి. శ్రీదేవి రాసిన కాలాతీత వ్యక్తులు నవల, రంగనాయకమ్మ రాసిన నవలలు ఈ ధోరణిని ప్రతిబింబిస్తాయి.

కాలాతీత వ్యక్తులు నవలలో స్త్రీల చదువుల వల్ల ఉద్యోగాల వల్ల తాము ఎదుర్కొనవలసిన కొత్త పరిస్థితులతో సంఘర్షిస్తూ ఒంటరి పోరాటాలు చేసినవారే. ఎవరి పోరాట మార్గాలు వారివే. ఆత్మగౌరవం, ఆత్మాభిమానం అందరికీ సామాన్య లక్షణాలు. ఎవరికీ లోకువగానో ఒదిగిపోయో జీవించటం వాళ్ళకు ఇష్టం లేదు. తమమీద కుటుంబం లాంటి వ్యవస్థల పెత్తనాలు కానీ, అన్నలుగా, తండ్రులుగా, భర్తలుగా వేరు వేరు అధికార రూపాలలో తమ జీవితాల మీద పురుషులు చేసే నియంత్రణను కానీ సహించని నూతన తరం స్త్రీలు కల్యాణి, ఇందిర, వసుంధర, వైదేహి అలాగని వీళ్ళు కుటుంబాన్ని, సామాజిక సంబంధాలను తిరస్కరించారు. ఒకరి మీద ఒకరికి హక్కులు లేని అధికారాలు లేని, ఆప్యాయతలు పంచుకోగలిగిన ఉత్తమ సంస్కారంతో కూడిన వ్యవస్థగా కుటుంబాన్ని పునర్నిర్మించుకొనాలన్నది వాళ్ళ ఆకాంక్ష.



1958 లో వచ్చిన కాలాతీత వ్యక్తులు నవల దగ్గర నుండి ప్రారంభించి ఇప్పటివరకు స్త్రీల నవలలు ప్రధానంగా స్త్రీలు స్త్రీలు కావటం వలన సమాజంలో ఎటువంటి అణిచివేతలకు గురి అవుతున్నారో చిత్రించటంతో పాటు అణచివేతలకు వ్యతిరేకంగా కొత్త జీవిత నమూనాలను ప్రతిపాదించాయి. రంగనాయకమ్మ, ఓల్గా, అరుణ రాసిన నవలలు ఈ విషయాన్ని నిరూపిస్తాయి.

మధ్యతరగతి కుటుంబాలకు చెంది, స్కూల్ చదువులు పూర్తి చేసి ఒక్కొక్కసారి కాలేజి చదువులు కూడా చదివి ఉద్యోగాల జోలికి పోకుండా గృహిణులుగా జీవించటానికి సిద్ధపడిన స్త్రీల జీవితం రంగనాయకమ్మ నవలలకు వస్తువు. వ్యక్తిత్వాన్ని చంపుకొని నీచంగా హీనంగా బ్రతకాల్సిన పరిస్థితులలోకి స్త్రీలను నెట్టిన కుటుంబాధికారం మీద విమర్శతో నిరసనతో జీవించి భరించలేక ఆత్మహత్య చేసుకొన్న భాను పేకమేడలు నవలలో కనబడుతుంది. స్త్రీల సృజన శక్తులకు, అభివృద్ధికి అవకాశమియ్యని కుటుంబాధికారం మీద, ముఖ్యంగా భర్త అధికారం మీద విమర్శతో మార్పును ఆకాంక్షించే చైతన్యం కల విజయ రచయిత్రి నవలలో వుంది. హక్కుల చైతన్యంతో భార్యా భర్త సంబంధాలతో సమత్వాన్ని సహజ జీవన విలువగా మార్చుకొన్న విమల స్వీట్‌హోమ్ నాయిక. తనకోసం తాను జీవించాలనే ఆకాంక్ష వున్నప్పటికి దాంపత్య సంబంధాలలో శాంతికోసం భర్తకు అనుకూలంగా తనను తాను కుదించుకొనేందుకు మరొకవైపు ప్రయత్నిస్తూ సంఘర్షించిన విజయ కంటే స్వేచ్ఛాయుత దాంపత్య సంబంధాలను ఆచరణ సాధ్యం చేసుకొన్న విమల అంటే రంగ నాయకమ్మకు ఇష్టం.

స్త్రీలు ఒకళ్ళ కష్టాల పట్ల ఒకళ్ళు స్పందించగలిగిన వాళ్ళైనా, సానుభూతి చూపించగల వాళ్ళయినా అసమానతలకు పీడనలకు కారణాలను అర్థం చేసుకొనటానికి అవసరమైన మార్క్సిస్టు చైతన్యం లేనిదే తాము బానిసలుగా వున్నామన్న స్పృహను పొందలేరని, ఆస్పృహను పొందిన తరువాతనే వేరు వేరు స్థాయిలలో తమమీద అమలవుతున్న పురుష పీడనను ఎదుర్కొని స్వీయ విముక్తికై సంసిద్ధులు కాగలుగుతారని నిరూపించే క్రమంలో రంగనాయకమ్మ జానకి విముక్తి నవలలో జానకిని, శారదను, నమూనాలుగా చూపించింది. ఆ చైతన్యంతోనే శాంత స్వీయ వ్యక్తిత్వానికి, ఆకాంక్షలకు ఆశయాలకు భంగం కలుగని రీతిలో బానిస యజమాని సంబంధాలుగా వున్న కుటుంబాన్ని మానవీయ సంబంధ వ్యవస్థగా పునర్నిర్మింకొనటాన్ని జానకి విముక్తి నవల సూచించింది. వివాహబంధంలోని అధికార సంబంధాలకు బానిసత్వానికి అతీతంగా సత్యంతో శాంతచేసిన సహజీవనం రంగనాయకమ్మ ఆదర్శ నమూనా.

ఓల్గా 1987 నుండి నవలలు రాస్తున్నది స్వేచ్ఛ. ఆమె మొదటి నవల, ఓల్గా నవలల్లో కూడా స్త్రీల మధ్యతరగతికి చెందినవారే కానీ కొంచెం పెద్ద చదువులు చదివి ఉద్యోగాలు చేసుకొంటున్నవాళ్ళు. కొద్దో గొప్పో సామాజిక సంబంధాలు, ఉద్యమ చైతన్యం వున్నవాళ్ళు. అందువల్లనే తమ ఎదుగుదలకు ఆటంకంగా వున్న కుటుంబాధికార వ్యవస్థ స్వభావాన్ని స్వీయ అనుభవ జ్ఞానం నుండి గుర్తిస్తారు. లేదా తోటి స్త్రీల అనుభవం నుండి గ్రహిస్తారు. స్వేచ్ఛ నవలలో అరుణ జ్ఞానం ఆ విధమైన స్వీయానుభవం నుండి విస్తరించిందే. పెళ్ళి చేసుకొంటే తల్లిదండ్రుల అదుపు నుండి బయటపడ్డ స్వేచ్ఛ లభిస్తుందని అనుకొంటుంది. కానీ తన సామాజిక స్వేచ్ఛకు భర్త అనే అధికారం కూడా ఒక అవరోధమేనని అనుభవంలో తెలుసుకొంటుంది. స్వేచ్ఛ కోసం భర్తను వదిలివెళ్తుంది. భర్త అనే పదవి వల్ల పురుషుడికి లభించే అధికార హోదాల నుండి తమను తాము కాపాడుకొనాలంటే స్త్రీలు కుటుంబ జీవితాన్నే ధిక్కరించాల్సి వుంటుందని అప్పుడే జీవితంలో సౌకర్యం, సౌఖ్యం సమకూడుతాయనే ఒక వినూత్న భావన స్వేచ్ఛకు నవల ముగింపులో ఓల్గా వేసిన బీజం విస్తరించి 'ప్రయోగం' సభ్యత ఓల్గా పేరు మీద

స్త్రీల అభిప్రాయాల అనుభవాల అభివ్యక్తికి ఉన్న అవరోధాలను ఓల్గా నవలలు తొలగద్రోశాయి. రహస్యభావాలు, సంబంధాలు లేని కొత్త స్త్రీ పురుష సంబంధాలు, స్వేచ్ఛాయుత స్త్రీ పురుష సంబంధాలు ఓల్గా ఆదర్శం. ఎటువంటి రాజీకి, సర్దుబాటుకు లొంగని నిరపేక్ష స్వేచ్ఛ కోసం స్త్రీ పురుషులు ఎవరికి వాళ్ళు విడివిడిగా జీవించటమే సరిమైన విధానం అని ఓల్గా నవలలు సూచిస్తాయి. ఇష్టమైనప్పుడు ఇష్టమైన వాళ్ళతో అధికారానికి హక్కుకు అవకాశమీయని సంబంధాన్ని ఏర్పరచుకొంటూ పిల్లలను కనటానికి పెంచటానికి స్వంత బాధ్యత మీద నిర్ణయాలు తీసుకొనే హక్కు, అవకాశం తమదిగానే వుంచుకొనే కొత్త తరహా స్త్రీల నమూనా ప్రయోగం నవల పూర్తయింది. అలాగే ఓల్గా వర్ణ వర్గ వైషమ్యాలతో వున్న సామాజిక రాజకీయ వ్యవస్థలలోని క్రియాశూన్య స్థబ్దతను బద్దలు కొట్టటానికి స్త్రీలు తామంతా పితృస్వామిక పీడనకు గురి అవుతున్న ఒక జాతిగా సమీకృతులు కావటం ఉపయోగకరంగా వుంటుందని మరొక ప్రత్యామ్నాయ నిర్మాణాన్ని 'ఆకాశంలో సగం' నవల ద్వారా సూచించటం జరిగింది. ఈ నిర్మాణంలో ప్రత్యేకించి స్త్రీల అభివృద్ధి, మొత్తం మీద సామాజిక అభివృద్ధి సాధ్యమవుతాయని ఓల్గా వూహ.

సమాజంలో అట్టడుగు వర్గానికి, వర్గానికి చెందిన స్త్రీల జీవితం. అరుణ రాసిన ఎల్లి (1992) నీలి (1996) నవలలకు వస్తువు. ఎరుకల కులానికి చెందిన మూడు తరాల స్త్రీలు మాలచ్చిమి, ఆమె కూతరు బాజి, మనమరాలు ఎల్లి వీళ్ళ ముగ్గురి జీవితాలను చుట్టుకొని లైంగిక పీడన యొక్క దుర్భరత్వాన్ని వ్యక్తీకరించింది ఎల్లి నవల. పందులను పెంచుకొనటం, చాపలల్లుకొనటం, చింతచిగురు అమ్ముకొచ్చుకొనటం ఇలాంటి పనులతో కుటుంబానికి ఆర్థికంగా ఉపయోగపడుతూనే ఎరుకుల స్త్రీలు బైట పెత్తందారుల లైంగిక పీడనకు, కుటుంబంలో పురుష పీడనకు, ఓలి వంటి దురాచారాలకు కన్న పిల్లల మీద హక్కులేని దీనతకు గురి అవుతూ లోనవుతూ జీవించవలసి వస్తుంటుంది. ఈ విధమైన వ్యవస్థకు బలయిన స్త్రీ ఎల్లి అయితే దీనిమీద తిరగబడిన స్త్రీ నీలి. ఇద్దరిని ఓలికి సంబంధించిన విషయాలే. ఓలి డబ్బు తిరిగి ఇవ్వకుండా స్త్రీకి తనదైన జీవితం ఏర్పరచుకొనే హక్కులేదు. నీలి దానిని ధిక్కరించింది. మామ తన కోసం ఖర్చు పెట్టిన ఓలికి తను ఆ ఇంటికి చేసిన చాకిరి చెల్లు అని కుల పంచాయితీని తిరస్కరించింది. ఆమెను ఇష్టపడిన దువ్వ ఆమెకు మద్దతుగా నిలబడ్డాడు. ఈ రకంగా అరుణ అట్టడుగు సామాజిక వర్గాల స్త్రీల జీవితాలల్లోని యధాతధ స్థితికి ఒక నమూనా ఎల్లి పాత్రను, స్త్రీల జీవితంలో వస్తున్న చైతన్యానికి సూచనగా నీలి పాత్రను చిత్రించింది.

మొత్తం మీద తెలుగు నవలలో మహిళా చైతన్యం అభివృద్ధి ముఖంగా వికసించిన చరిత్ర ఈ నూట పాతిక సంవత్సరాల నవలా చరిత్రలోని అద్భుతమైన వాస్తవం. ఇంటా బయటా స్త్రీలు చేస్తున్న జీవన్మరణ పోరాటం – ఏ స్వతంత్ర ఉద్యమానికి, స్వేచ్ఛా ఉద్యమానికి, హక్కుల ఉద్యమానికి తీసి పోనిదని ఈ అధ్యయనంలో స్పష్టం అయింది.

**(1990)**

# శతాయుష్మాన్ భవ!

**డా॥ ఎం. విజయశ్రీ**

బాంబు భయం లేనిచోటు
భాగ్యనగరంలో లేనే లేదు
నగర జీవి నడక
వినోదం లేని వింత వీధిలో!!

నినాదాలు – నిరాహారదీక్షలు
నాటని చెట్లల్లా
రోడ్డు కిరువైపులా నిలుచుంటాయి

'ఆనందం' అరనిమిషం సేపు ఆగి
కర్టెసీ లేని ఆర్టీసీ బస్సులా
వెళ్ళిపోతుంది

ఆకలి పుదీనా నీళ్ళతో కలిసి
'ఛాట్' చేద్దామనుకుంటే
'ఫట్' మంటుంది జీవితం
'ఫాస్ట్' ఫుడ్‌లో
స్లోపాయిజన్ బాంబు తయారీ
పూలగాలి పీల్చాలని వుందా
అదసలే లుంబినీ...
'మరణం శరణం గచ్ఛామీ'! అంటూ
బుద్ధ విగ్రహంలా మునిగిపోతావు!
హైటెక్ సమాజం కావాలా?
పంజగుట్ట దాటలేవు
ఇనుపగోళ్ళ పంజాలు
నిన్ను కబ్జా చేస్తాయి
ఇన్ని జరిగినా బ్రతికే వున్నావా?
అకస్మాత్తుగా త్సునామీ ఆవులిస్తుంది
అయినా ఆయుర్దాయం మిగిలితే
నాళాల నోళ్ళు నిన్ను మింగేసి
మృత్యు ప్రయాణం చేయిస్తాయి
మరెలా?... బ్రతకటం??
ఒకడిని చంపు – నువ్వు చావకు
నీ రహస్యం తుపాకీతోనే చెప్పు
అపుడు నిపుణుల సంఘం
నిన్ను రక్షణ ఇచ్చి మరీ
బ్రతికిస్తుంది
దీర్ఘాయుష్మాన్‌భవ!!
అధమం
శతాయుష్మాన్‌భవ!!

# దారి తప్పిన బాల్యం

**సత్య భాస్కర్**

బాల్యం బడిలోనే దారి తప్పింది
ఈడురాని చూపులకు
కైపెక్కించే కథనాలతో
చదువు సినిమా పోస్టరయింది!
పచ్చదనాల ప్రకృతి జీవరాశులు
తరులు, గిరులు, పంట పొలాలు
శ్రమైక జీవనం – అంతరిక్షయానం
చేయి పట్టి నడిపించాల్సిన
చదువు ఇంటర్నెట్‌లో బూతు పురాణమయింది!
నేరాలు – ఘోరాలతో
రోజూ ఇంట్లో నెత్తురు కక్కుతున్న టివి
పసిపిల్లల ఫ్యాషన్ పెరేడ్‌లతో
ఐటెమ్ సాంగులు, ప్రైవేట్ ఆల్బమ్‌లతో
పిచ్చి గంతులు వేస్తూ
బాల్యాన్ని ఊబిలోకి దించుతోంది!
ముద్దుల విషం ఎక్కిన బాల్యం
మార్కెట్ చేతిలో 'రోబో' అయింది

## నివేదిక

# నానీల దశమ వార్షికోత్సవం నానీల శతాధిక గ్రంథోత్సవం



నానీల దశమ వార్షికోత్సవ సభలో సోమేపల్లి వెంకట సుబ్బయ్య రచించిన 'పచ్చని వెన్నెల' నానీల సంపుటిని ఆవిష్కరిస్తున్న డా॥ సినారె. కిన్నెర ఆర్ట్స్ కార్యదర్శి ఎం. రఘురామ్, రాయసం వెంకట రామయ్య, పొత్తూరి వెంకటేశ్వరరావు, వైస్ ఛాన్సలర్ ఆవుల మంజులత, డాక్టర్ ఎన్. గోపి, శ్రీమతి ఓల్గా

తెలుగు భాషా సాహిత్యాలకు పునరంకిత స్ఫూర్తితో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నానీల దశమ వార్షికోత్సవం, నానీల శతాధిక గ్రంథోత్సవం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, నానీల సృష్టికర్త ఆచార్య ఎన్. గోపి పర్యవేక్షణలో 13, 14 అక్టోబరు 2007న రెండు రోజుల పాటు ఘనంగా జరిగాయి. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా॥ ఎన్.టి. రామారావు కళా మందిరంలో రాష్ట్ర, రాష్ట్రేతర నానీ కవులు, సాహిత్యాభిమానులు, రచయితల సమక్షంలో శాఖోపశాఖలుగా విస్తరించి గత పదేళ్ళుగా ఈ ప్రక్రియ జరిపిన ప్రస్థానంపై సుదీర్ఘ సమాలోచన జరిగింది. రెండు రోజుల సభలను 13వ తేదీ ఉదయం జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా॥ సి. నారాయణరెడ్డి ప్రారంభిస్తూ ధారాళంగా, పరవళ్ళు తొక్కే భావపరంపరతో, సామాజిక సామీప్యతతో పదునెక్కిన నానీల ప్రక్రియకు పెరుగుతున్న ఆదరణను ప్రస్తావించి ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో నానీలకు ఓ అధ్యాయం కేటాయించవలసి ఉందన్నారు.

సభాధ్యక్షత వహించిన తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డా॥ ఆవుల మంజులత నానీలను ఇంగ్లీషులోకి అనువదించడం ద్వారా అంతర్జాతీయ ఖ్యాతిని విరివిగా తీసుకు రావలసిన అవసరాన్ని గుర్తు చేస్తూ ఎంపిక చేసిన నానీలను విశ్వవిద్యాలయం అనువదింపజేసి ప్రచురిస్తుందన్నారు. నానీల సృష్టికర్త ఆచార్య గోపి కీలకోపన్యాసం చేస్తూ నానీ అంటే నావి-నీవి-వెరసి మనవి అని, పరస్పర సమిష్టి జీవిత సత్యాలుగా, మానవ సంవేదనలకు ప్రతీకలుగా వాటిని చూపారు. నానీలను రాయాలంటే భావోద్వేగం, సాంద్రత, గాఢత అవసరమంటూ సంఖ్యా నియమాన్ని ప్రస్తావించారు. గట్టి గింజల్లాంటి నానీలు రాయాలంటే నిర్వహణా శక్తి ముఖ్యమని గుర్తు చేశారు. ఇప్పటిదాకా వెలువడిన నానీల్లో 50 శాతం ఉత్తమ స్థాయిలో ఉన్నాయనీ, నానీలు రాయడం కీర్తికి షార్ట్‌కట్ కాదనీ, స్పందన, నిజాయితీ లేకుండా నానీలు రాయకూడదని అన్నారు.



నానీ గ్రంథాలు రచించిన కవుల గ్రూప్ ఫోటో

విశిష్ట అతిథులుగా పాల్గొన్న పాత్రికేయులు డా॥ పొత్తూరి వెంకటేశ్వరరావు, ప్రముఖ కవి రాయసం వెంకట రామయ్య, ఓల్గా నానీలను రూపపరమైన వచన ఉద్యమంగా అభివర్ణించారు. నానీల కవి, నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (ఢిల్లీ) అసిస్టెంట్ ఎడిటర్ డాక్టర్ పత్తిపాక మోహన్ సమావేశకర్తగా వ్యవహరించారు. సోమేపల్లి వెంకట సుబ్బయ్య రచించిన 'పచ్చని వెన్నెల', జిందం అశోక్ రాసిన 'పెద్ద గడియారం - కరీంనగర్' నానీలను డాక్టర్ నారాయణరెడ్డి, పత్తిపాక మోహన్ సంపాదకత్వంలో వచ్చిన 'గోపి నానీల పీఠికా ప్రస్థానం' గ్రంథాన్ని రాయసం వెంకట్రామయ్య, డా॥ సి. భవానీదేవి రచించిన 'కవయిత్రుల నానీలు' వ్యాస సంపుటిని డా॥ ఆవుల మంజులత ఆవిష్కరించారు.

### మొదటి సదస్సు

ప్రారంభ సభానంతరం జరిగిన మొదటి సదస్సుకు ఆచార్య పి. సుమతీ నరేంద్ర అధ్యక్షత వహిస్తూ ఒకానొక మానసిక స్థితిలో అలవోకగా వెలువడిన నానీలు చేసిన శతాధిక గ్రంథ ప్రస్థానాన్ని వివరించారు. ముఖ్య అతిథిగా ప్రసంగించిన పాత్రికేయులు ఐ.వెంకట్రావు నానీల ప్రచురణకు పత్రికలు ఇస్తున్న ప్రాధాన్యతను గురించి చెప్పగా, ఉస్మానియా తెలుగు శాఖకు చెందిన డా॥ వెల్దండ నిత్యానందరావు సమావేశకర్తగా వ్యవహరించారు. ఈ సదస్సులో బూర్ల వెంకటేశ్వర్లు 'రంగుల హరివిల్లు' నానీల సంపుటిని డా॥ పెళ్ళకూరు జయప్రద, కోట్ల వెంకటేశ్వరరెడ్డి 'నిషేధానంతర నానీలను' జూకంటి జగన్నాథం, పున్న అంజయ్య 'నల్లగొండ నానీల'ను కొండకింది చిన వెంకటరెడ్డి (నల్లగొండ) ఆవిష్కరించారు. అనంతరం 'నానీలు - సాంద్రత, కవితాత్మకత' అన్న అంశంపై డా॥ పెన్నా శివరామకృష్ణ, 'నానీలు - గ్రామీణ జీవన చిత్రణ - ఉత్తమ స్ఫూర్తి' గురించి ఎన్. అరుణ, 'నానీల్లో విశిష్ట వ్యక్తుల ప్రసక్తి' గురించి దాస్యం సేనాధిపతి, 'నానీల్లోని జీవన తాత్వికత' అన్న అంశంపై డా॥ ఎస్. రఘు పత్ర సమర్పణ చేశారు. వస్తు వైవిధ్యంతో అనంత సత్యాలను ఆవిష్కరించే ప్రక్రియగా నానీలను పత్ర సమర్పకులు చూపించగలిగారు.

### రెండవ సదస్సు

రెండవ సదస్సుకు ఉస్మానియా తెలుగు శాఖాధిపతి ఆచార్య కె. కుసుమారెడ్డి అధ్యక్షత వహించగా ఎస్.వి. యూనివర్శిటీ పూర్వ

వైస్ ఛాన్సలర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ నిర్మాణ నియతితో మానవ ప్రకృతిలోని భిన్న ప్రవృత్తులను ఆకళింపు చేసుకోవాలని చేసిన ప్రయత్నమే నానీలన్నారు. డాక్టర్ కలువకుంట రామకృష్ణ సమావేశకర్తగా వ్యవహరించారు. అనంతరం అనిశెట్టి రజిత 'నన్నో ఓ నన్నో' నానీల సంపుటిని బి.ఎస్. రాములు, పి. లక్ష్మణ్‌రావు 'తీరని దాహాన్ని' అంబల్ల జనార్దన్, వంగర పరమేశ్వరరావు 'నేతన్న నానీలను' ఆచార్య ఎన్. గోపి, తత్త్వవాది ప్రమోద్‌కుమార్ రాసిన 'మాట్లాడే చెట్లు'ను ఆచార్య మసన చెన్నప్ప ఆవిష్కరించారు. డా॥ సి. భవానీ దేవి 'నానీల్లో స్త్రీ హృదయ సంవేదన' అంశంపై 'నానీల నిర్మాణ పరిశీలన'ను గూర్చి ఎం. నారాయణశర్మ, 'నానీల్లో దళిత బహుజన కోణాలు' అన్న అంశంపై ఆచార్య ఎస్వీ సత్యనారాయణ పత్ర సమర్పణ చేశారు.

## మూడవ సదస్సు

మూడవ సదస్సు ఆచార్య టి. కిషన్‌రావు అధ్యక్షతన జరిగింది. నల్గొండ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కె. ముత్యంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఒక శాస్త్రవేత్త నానీలు వంగడాన్ని సృష్టిస్తే, రైతులు దాన్ని అనుసరించినట్లు గోపీ సృష్టి అయిన నానీలను అచిరకాలంలోనే కవులు స్వీకరించారన్నారు. ఎస్.ఆర్.భల్లం సమావేశ కర్తగా వ్యవహరించారు. అనంతరం అంకాలపు వీరేశంబాబు నానీలు 'బత్తీసలు'ను తొలి తరం తెలంగాణా కథకులు గూడూరి సీతారాం, తులసీరాం 'విశాఖ నానీలు'ను ప్రముఖ రచయిత్రి ముదిగంటి సుజాతా రెడ్డి, ఎం.వి.ఆర్. సత్యనారాయణమూర్తి 'కాగితప్పడవలు'ను ఆచార్య గోపి, జోహర భాను రాసిన 'మబ్బుల్లో చుక్కల'ను రంగినేని మోహన రావు (సిరిసిల్ల) ఆవిష్కరించారు. అనంతరం 'నానీలు–ప్రాంతీయ చైతన్యం' అంశంపై కాసుల ప్రతాపరెడ్డి, 'నానీలు – మానవ సంబంధాలు' అంశంపై పి. లక్ష్మణరావు, 'సమకాలీన సాహిత్య చరిత్ర – నానీల ప్రభావం' గురించి టి. సురేష్ పత్ర సమర్పణ చేశారు.

ఆచార్య గోపి రచించిన నానీలను ఇంగ్లీషు, ఉర్దూ, హిందీతో పాటు పలు భారతీయ భాషలలోకి అనువాదం చేసిన అనువాదకులు పి. జయలక్ష్మి, డా॥ బి. సత్యనారాయణ, డా॥ ఎం. విజయశ్రీ తమ అనుభవాలు వివరించారు. ఎలాంటి ఇబ్బందిని కలిగించకుండా పాఠకుడి భావసీమను కదిలించగలిగే నానీలను గోపీ రాశారంటూ అనేక ఉదాహరణలను చదివి వినిపించారు. అనంతరం నానీల అధ్యయన శిబిరంలో జూకంటి జగన్నాథం, డా॥ ద్వానాశాస్త్రి పాల్గొని నానీల్లోని భావుకత, దేశీయత, ఆప్తత, గురిచూసి విసరడంలో ఉన్న ఒడుపు, ధారణానుకూలతకు ఒదిగే తీరును విశ్లేషించగా కె.ఎస్. అనంతాచార్యులు సమావేశకర్తగా వ్యవహరించారు. ప్రారంభ సమావేశం సందర్భంగా గాజోజు నాగభూషణం నానీలపై రూపొందించి, ఆలపించిన స్వాగతగీతం ఆకట్టుకుంది.

## పవర్ పాయింట్ ప్రజెంటేషన్

రెండవ రోజు (14వ తేదీ) కార్యక్రమం విశ్లేషణలు, నానీల కవి సమ్మేళనాలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో కొనసాగింది. ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి తొలుత సభాధ్యక్షత వహించి మాట్లాడారు. ఆధునిక కాలంలో చిన్న కవితలు, టుమ్రీలు, చమత్కారికలు వచ్చినా మిగలలేదని, హైకూ... నానీలు నిలదొక్కుకున్నాయని ఆయన అన్నారు. విమర్శ, ఎగతాళి రెండూ వేరని అంటూ కవితాత్మ నిండుగా ఉన్న నానీలను ఎగతాళి చేయడం సహృదయత కాదని రాచపాళెం అభిప్రాయపడ్డారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ గణేశ్వరరావు (ఢిల్లీ విశ్వవిద్యాలయం) పదేళ్ళుగా నానీలతో తనకున్న పరిచయంతో వాటి నాణ్యతని విశ్లేషించారు. రమ్యసాహితీ సంపాదకులు చలపాక ప్రకాష్ సమావేశకర్తగా ఉన్నారు. డా॥ సి. భవానీదేవి 'హైదరాబాద్ నానీలు'ను ప్రముఖ కవి రామాచంద్రమౌళి ఆవిష్కరించి భాగ్యనగరాన్ని నానీలలో ఇమిడ్చి జనరంజకం చేసిన తీరును కొనియాడారు. చివరగా డా॥ తలతోటి పృధ్వీరాజ్ నానీల పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అందరినీ అలరించింది. సాహిత్యపరంగా ఇదొక చక్కని ప్రయోగమని అందరూ భావించారు.

## మొదటి కవి సమ్మేళనం

అనంతరం మొదటి కవి సమ్మేళనం ఆచార్య మసన చెన్నప్ప అధ్యక్షతన జరిగింది. సోమేపల్లి వెంకట సుబ్బయ్య ముఖ్య అతిథిగా మాట్లాడుతూ బుడి బుడి అడుగుల్లో భూగోళమంత భావాన్ని ఇముడ్చుకునేదే నానీ అంటూ ప్రతి ఒక్కరినీ అలరించి అనతికాలంలోనే మెప్పించిన ఆ ప్రక్రియను నొప్పించేలా విమర్శిస్తే అసూయే అవుతుందన్నారు. ఈ సందర్భంగా మరికంటి 'పాలమూరు నానీలు'ను ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, చిమ్మపూడి నానీలను దుగ్గిరాల సోమేశ్వరరావు, వై. సత్యనారాయణ 'దీపంతలు'ను డాక్టర్ నేరెళ్ళ మాధవ్, కొత్తపల్లి ఉదయబాబు 'చిగురు పిట్టలు'ను రాచపాళెం, జిందం అశోక్ 'మానేరు నానీల'ను రసరాజు ఆవిష్కరించారు. రసరాజు మాట్లాడుతూ వ్యక్తులు రాశారని కాకుండా తాను ఇష్టపడి ప్రేమతో నానీలు రాశానని చెప్పారు. ఆచార్య గోపి తన ప్రసంగంలో నానీల దశమ వార్షికోత్సవ సభలు ప్రతి జిల్లాలో నిర్వహిస్తామని ప్రకటించారు. దుగ్గిరాల, నేరెళ్ళ మాట్లాడుతూ ఎప్పుడో వదిలేసిన కవిత్వాన్ని నానీలు చదివాక తిరిగి ప్రారంభించాలని పిస్తున్నదని చెప్పారు. కవి సమ్మేళనంలో కొట్టి రామారావు, కోసూరి రవికుమార్, కారం శంకర్ తదితర 20 మంది పాల్గొన్నారు.

## రెండవ కవి సమ్మేళనం

రెండవ కవి సమ్మేళనానికి అనిశెట్టి రజిత సమావేశకర్తగా ఉండగా, ప్రముఖ రచయిత జింబో రాజేంద్ర అధ్యక్షత వహిస్తూ నానీల చిరత్వాన్ని వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇంద్రగంటి శ్రీకాంత శర్మ నానీల ప్రయాణం అంతస్సీమల్లోకి, అనుభూతుల్లోకి అంటూ నిత్యాన్వేషణ, ఉపదేశం, అనురాగ స్పర్శతో చెప్పాలనే తపన నానీల్లో కనిపిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా దేవరెడ్డి వీరభద్రారెడ్డి 'అక్షర ఖజానా'ను ఆచార్య టి. గౌరీశంకర్, మణి త్రినాథరాజు, 'పల్లె పుంతలు'ను, డా॥ సంగనభట్ల నర్సయ్య, జంజం కోదండ రామయ్య 'అద్దాల్లో నీడలు'ను ఆచార్య టి. మోహన్‌సింగ్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన నానీల కవి సమ్మేళనంలో 25 మంది కవులు పాల్గొన్నారు.

## కవయిత్రుల సమ్మేళనం

మూడవ నానీ కవయిత్రుల సమ్మేళనంలో నానీల మెరుపులు కురిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఓల్గా మాట్లాడుతూ నానీల కవిత్వంలో రచయిత్రులు గొప్పగా రాణిస్తున్నారని అన్నారు. ఒక హృదయాహ్లాదాన్ని, ఒక దుఃఖానుభూతిని అక్షరాకృతిగా మలచడం

ద్వారా ఉత్తమ నానీకి పురుడు  పోయాలని చెప్పారు. స్త్రీల మనో సంఘర్షణ ప్రధాన వస్తువుగా ఎన్నో నానీలు వచ్చాయని తెలిపారు. నానీల తొలి కవయిత్రి డా॥ సి. భవానీదేవి అధ్యక్షత వహించగా, ఆకాశవాణి ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ ఝాన్సీ కె.వి. కుమారి సమావేశకర్తగా వ్యవహరించారు. అమ్మ, నగరం, వారసత్వం, తప్పొప్పులు, ట్రిక్కులు, అవినీతి వంటి అనేక అంశాలతో అనిశెట్టి రజిత, బండారు విజయ, నాంపల్లి సుజాత, డా॥ బండారు సుజాత శేఖర్, ఎ.వి. సుజాత, డా॥ వి. త్రివేణి, పార్వతీ పృథ్వీ, వి. ఇందిరా ప్రియదర్శిని, వి. వింధ్యా వాసినీదేవి, పోగుల విజయశ్రీ, ఎం. శైలజామిత్ర, అమరజ్యోతి, ఎన్. అరుణ, కందేపి రాణీప్రసాద్, ఝాన్సీ కె.వి. కుమారి, కోపూరి పుష్పాదేవి తదితర 18 మంది కవయిత్రులు పాల్గొని చక్కని నానీలను వినిపించారు.

నాలుగవ సమ్మేళనానికి మచిలీపట్నం సారస్వత సమితి అధ్యక్షులు కొట్టి రామారావు సమావేశకర్త కాగా అన్నవరం దేవేందర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శీలా వీర్రాజు మాట్లాడుతూ కవిత్వపు జల ఏ ప్రక్రియలో పారినా దప్పిక తీర్చుకోవలసిన బాధ్యత పాఠకులకు ఉంది అని చెప్పారు. సార్వత్రిక విశ్వ విద్యాలయం డీన్ ప్రొఫెసర్ కె.ఎస్. రమణ మాట్లాడుతూ బాహ్యాంతర కవితా రూపాలపై చర్చ జరగాలని అన్నారు. అనంతరం పుస్తకావిష్కరణలు జరిగాయి. కొట్టి రామారావు 'జీవన స్వరాలు'ను ఆచార్య కె.ఎస్. రమణ, జినుకుల వెంకటేశ్ 'గోరు ముద్దలు'ను ఆచార్య గోపి, గాదిరాజు రంగరాజు 'అంతరంగాలు'ను శీలా వీర్రాజు, బొబ్బిలి జోసెఫ్ 'వెన్నెల చినుకులు'ను కొట్టి రామారావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో 20 మంది కవులు తమ కవితలను వినిపించి శ్రోతలను అలరించారు.

## ముగింపు సభ

ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులు డా॥ ఎ.బి.కె. ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవి కేవలం ఉత్పత్తి కేంద్రం కాకూడదని, గత పదేళ్ళుగా ఆగకుండా సాగుతున్న నిరంతర ప్రక్రియ నానీలు అన్నారు. పలచదనంతో నానీలను రాయొద్దని ఆయన కవులకు సూచించారు. సభాధ్యక్షత వహించిన నానీల కవి సోమేపల్లి వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ఆచార్య గోపి తర్వాత వారి ప్రేరణతో ఎందరో నానీ కవులు ఆవిర్భవించారనీ అన్నారు. విశిష్ట అతిథిగా వాస్తుశిల్పి డా॥ బి.ఎన్. రెడ్డి పాల్గొని నానీలలోని కవుల ప్రాణస్పర్శను విశదీకరిస్తూ మాట్లాడారు. సాహితీవేత్త శాంత సుందరి హాజరయ్యారు. పుస్తకావిష్కరణలు, పత్ర సమర్పణలు, కవి సమ్మేళనాలు, విశ్లేషణలతో సాగిన నానీల రెండు రోజుల సదస్సు నివేదికను జర్నలిస్టు తిరునగరి శ్రీనివాస్ సమర్పించారు. ముగింపు సభలో టి. సంపత్‌కుమార్, టి. మాధవీలత రాసిన 'ఢిల్లీ నానీల'ను డా॥ బి.ఎన్. రెడ్డి, అంబల్ల జనార్దన్ 'ముంబాయి ముత్యాలు'ను శ్రీమతి శాంతసుందరి ఈ సందర్భంగా ఆవిష్కరించారు. సాహితీ గౌతమి అధ్యక్షుడు (కరీంనగర్) మాడిశెట్టి గోపాల్ సమావేశకర్తగా వ్యవహరించారు. నానీ కవులను వేదికపై దశమ వార్షికోత్సవం సందర్భంగా ఘనంగా సన్మానించారు. దాస్యం సేనాధిపతి రూపొందించిన 'నానీ కవుల డైరెక్టరీ' సంకలనాన్ని ఓల్గా ఆవిష్కరించారు. కరీంనగర్ స్వరాంజలి కల్చరల్ అకాడమీ టి. మోహనస్వామి బృందం 'తెలుగు మధుర గీతాలు' పేరుతో గీతాలాపనను నిర్వహించారు. రెండు రోజుల పాటు వివిధ నానీ కవుల నానీలతో అన్నవరం శ్రీనివాస్ చిత్రకళా ప్రదర్శనకు మంచి ఆదరణ లభించింది. దీనిని సినారె ప్రారంభించారు. సభల ఆవరణలో నానీ గ్రంథాలు రచించిన నూరుమంది నానీ కవుల ఛాయాచిత్రాల ప్రదర్శన ఒక ఆకర్షణ. అలాగే నూటికి పైగా ప్రసిద్ధ నానీలను ప్రదర్శించగా వాటిని అందరూ ఆసక్తిగా చదివారు.

ఏ రూపంలో చెప్పినా గుండెను పట్టుకునే కవిత్వముంటేనే అది శిరోధార్యం అన్నది ఒప్పుకోవలసిన సత్యం. కొత్త తరం కవులకు మంచి ప్రవేశమార్గంగా మారి గత పదేళ్లలో బహుముఖ మూల్యాలతో నానీల కవిత్వం ఎదిగిందన్న నిశ్చితాభిప్రాయం రెండు రోజుల సదస్సుల్లో సీనియర్ సాహితీవేత్తలు, ప్రముఖుల నుండి వ్యక్తమైంది. తప్పటడుగులు ఏమైనా ఉంటే నిలదొక్కుకుని బలంగా కవిత్వం రాయాలన్న సూచనను నానీల కవులకు వారు అందించారు.



**ప్రముఖ రచయిత్రి, కవయిత్రి డా॥ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి 'ఆలకించే అక్షరం' నానీల సంకలనాన్ని ప్రముఖ రచయిత్రి ముదిగంటి సుజాతారెడ్డి హైదరాబాద్‌లో పొట్టి శ్రీరాములు యూనివర్శిటీ ప్రాంగణంలో అక్టోబర్ 13వ తేదీన ఆవిష్కరించారు. ఈ ఫొటోలో డా॥ పెళ్లకూరు జయప్రద, నల్లగొండ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. ముత్యంరెడ్డి, ప్రొఫెసర్ ఎన్. గోపి ఉన్నారు.**



**నానీల దశమ వార్షికోత్సవాలలో ఎన్.టి. రామారావు కళా మందిరంలో అక్టోబర్ 14వ తేదీన వై. సత్య నారాయణ రచించిన నానీల సంపుటి "దీపంతలు"ను ధ్వన్యనుకరణ సమ్రాట్ డా॥ నేరెళ్ళ వేణుమాధవ్ ఆవిష్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో ప్రముఖ పద్య కవి రసరాజు, రంగస్థల నటులు దుగ్గిరాల సోమేశ్వరరావు, విమర్శకులు ఆచార్య రావపాళెం చంద్రశేఖరరెడ్డి, కవి సత్యనారాయణ, ఆచార్య మసన చెన్నప్ప, ప్రముఖ కవి సోమేపల్లి వెంకట సుబ్బయ్య ఉన్నారు.**

# ముదిగొండ క్షతగాత్రునిచే 'భూస్వరాలు' ఆవిష్కరణ



**ము**దిగొండ కాల్పుల్లో బుల్లెట్ గాయాలైన మర్లపాటి కోటేశ్వర రావు 'భూస్వరాలు' కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. ఖమ్మం పట్టణంలోని యుటిఎఫ్ మీటింగ్ హాల్‌లో సెప్టెంబర్ 30న జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ రాజ్యసభ సభ్యులు వై. రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ' పోరాడేవాళ్ళ మధ్య 'భూస్వరాలు' పుస్తకాన్ని ఆవిష్కరించుకోవడం స్ఫూర్తివంతంగా ఉందని, కవులు పోరాట కవిత్వాన్ని సొంతం చేసుకున్న తీరును, చైతన్యవంతమైన స్పందనల్ని ఈ పుస్తకంలో చూడవచ్చని' అన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కన్వీనర్ తెలకపల్లి రవి మాట్లాడుతూ ' భూపోరాటాన్ని, అమరుల త్యాగాన్ని 'భూస్వరాలు' రికార్డు చేసిందని' అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో కె. ఆనందాచారి, మాల్యశ్రీ, రౌతురవి, బండి పద్మ, రాయల వెంకటేశ్వర్లు, లెనిన్ శ్రీనివాస్, శేషగిరి, శిరంశెట్టి కాంతారావు, దుర్భాచారి, విద్యాసాగర్, కట్టాశ్రీనివాస్, వెంకట్, జీవన్, పోతగాని, సాధనాల, ఆంజనేయులు, షుకూర్, కె. రమేష్, బి. రమేష్, బండి రమేష్, వనం నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



**ఖమ్మంలో భూస్వరాలు ఆవిష్కరణ సభలో ఎడమ నుండి కె. ఆనందాచారి, తుర్లపాటి కోటేశ్వరరావు, రాయల వెంకటేశ్వర్లు, రౌతు రవి తదితరులు**

# విజయనగరంలో "భూస్వరాలు" పుస్తకావిష్కరణ భగత్‌సింగ్ శత జయంతి

**సె**ప్టెంబర్ 30న స్థానిక గురజాడ కేంద్ర గ్రంథాలయంలో సాహితీ స్రవంతి విజయనగరం ఆధ్వర్యంలో జరిగిన భూస్వరాలు పుస్తకావిష్కరణ సభలో డా॥ రామసూరి దేశం స్వయంసమృద్ధి కావాలంటే వ్యవసాయక ఉత్పత్తులు సృజించే రైతులు, రైతు కూలీల చేతిలో భూమి ఉండాలని అభిప్రాయపడ్డారు. ఈ అవసరాన్ని తెలిపే కవితలే ఈ పుస్తకం నిండా ఉన్నాయన్నారు. తొలుత ఈ పుస్తకాన్ని ప్రముఖ రచయిత్రి డా॥ చాగంటి తులసి ఆవిష్కరించారు. ఆమె భగత్‌సింగ్ శతజయంతి సందర్భంగా ప్రసంగిస్తూ రుధిరజ్యోతి కవితా సంకలనాన్ని రచించిన శ్రీరంగం నారాయణబాబు భగత్‌సింగ్ కంటే ఏడాది పెద్దవాడని తెలిపారు. కపాలమోక్షం, భగత్‌సింగ్ శాపం అనే రెండు కవితల్ని నారాయణబాబు రచించాడని తెలిపారు. విద్యార్థులు గాంధీ, భగత్‌సింగుల చరిత్రను పరిశీల నాత్మకంగా చదవాలని, అప్పుడు మాత్రమే ఆ ఇరువురి భావజాలాల మధ్య భేదం అర్థమవుతుందని తెలిపారు. సీనియర్ కవి అల మాట్లాడుతూ భగత్‌సింగ్ రచనలు చదివిన ప్రతివాడు ఆయన సోషలిస్టు భావజాల నిబద్ధతను అర్థం చేసుకుంటారని తెలిపారు. కథకుడు జి.ఎస్.చలం జైలు నుండి భగత్‌సింగ్ రాసిన రెండు లేఖల్ని చదివి వినిపించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన సాహితీ స్రవంతి కన్వీనర్ దివాకర్ మాట్లాడుతూ రాజ్యం అవతరణ నుండి భూపోరాటాలు ఉన్నట్లు రామాయణ, భారతాలు రుజువు చేస్తున్నాయని తెలిపారు. అయితే వారి భూఆరాటం రాజ్య విస్తీర్ణ కాంక్ష అని, నేటి భూపోరాటం జీవిక కోసం పోరాటమని తెలిపారు.



**భూస్వరాలు పుస్తకావిష్కరణ సభలో (ఎడం నుంచి కుడికి వరుసగా) చీకటి దివాకర్, డా॥ రామసూరి, డా॥ చాగంటి తులసి, అల, జి.ఎస్. చలం**

## సంగారెడ్డిలో 'భూస్వరాలు' ఆవిష్కరణ

సంగారెడ్డి పట్టణంలో సెప్టెంబరు 30న 'భూస్వరాలు' ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. సాహితీ స్రవంతి మెదక్‌జిల్లా కన్వీనర్ స్ఫూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యావేత్త పూసల లింగాగౌడ్ 'భూస్వరాలు' కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంలో ఆవిష్కర్త మాట్లాడుతూ పుస్తకంలోని కవితలు ప్రేరణ కలిగించే రీతిలో ఉన్నాయని, అన్నారు. సంగారెడ్డి పట్టణంలో సాహిత్య వాతావరణం నెలకొల్పడానికి తనవంతు తోడ్పడగలనని ఆయన అన్నారు. ప్రస్థానం సంపాదకవర్గ సభ్యుడు వీరప్రసాద్, గోవర్ధన్, వెంకటేష్, శ్రీనివాస్, రుక్మారెడ్డి, కడారి నరసయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 'నీలి పతాక' పుస్తక ఆవిష్కరణ సభ

కవి చక్రవర్తి గుఱ్ఱం జాషువా జయంతి సభ సెప్టెంబర్ 28న రాజమండ్రిలోని గరిమెళ్ళ సత్యనారాయణ ట్రైనింగ్ కాలేజీలో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్వీ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన దార్శనికుడుగా జాషువాను అభివర్ణించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి, రచయిత, విమర్శకుడు డా॥ గూటం స్వామి రాసిన 'నీలి పతాక' దళిత దీర్ఘ కావ్యాన్ని ఆచార్య ఇనాక్ ఆవిష్కరించారు. దళితులను చైతన్యపరిచే రచనలు మరిన్ని రావలసిన అవసరం వుందని ఆయన అన్నారు. సమాజంలో అసమానతలు పెరిగిపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. డా॥ గూటం స్వామిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మంధా అన్నపూర్ణ, కళా గౌతమి వ్యవస్థాపకులు డా॥ బి.వి.ఎస్. మూర్తి, సాహితీవేత్తలు పతివాడ సూర్యనారాయణ, మహీధర రామశాస్త్రి, నగర ప్రముఖులు, సాహితీ వేత్తలు, ట్రైనింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



'నీలి పతాక' దళిత దీర్ఘ కావ్యాన్ని ఆవిష్కరించిన ఆచార్య కొలకలూరి ఇనాక్. చిత్రంలో (ఎడమ నుంచి) వై. మోహనరావు, డా॥ బి.వి.ఎస్. మూర్తి, కొలకలూరి ఇనాక్, సుదర్శనరావు, 'నీలి పతాక' కవి డా॥ గూటం స్వామి



ఖమ్మంలో డా॥ హరీష్ సంస్మరణ సభలో 'మాటలూ – రాతలూ' ఆవిష్కరణ సందర్భంగా తమ్మినేని వీరభద్రం, చేకూరి కాశయ్య ప్రభృతులు



నానీల పీఠికా ప్రస్థానంను ఆవిష్కరిస్తున్న రాయసం వేంకటరామయ్య, డా. పొత్తూరి వేంకటేశ్వరరావు, సంపాదకుడు డా. పత్తిపాక మోహన్, కె.ఆవుల మంజులత, డా॥ సి.నారాయణరెడ్డి, ఆచార్య ఎన్.గోపి

## సాహితీ స్రవంతి చిక్కడపల్లి జోన్ కమిటీ ఏర్పాటు

సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యాలయంలో అక్టోబర్ 20న జరిగిన సమావేశంలో సాహితీ స్రవంతి చిక్కడపల్లి జోన్ కమిటీ ఏర్పడింది. సాహితీ స్రవంతి జంట నగరాల కన్వీనర్ సత్యభాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గడ్డం రవీంద్రను జోన్ కమిటీ కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగింది. ఇంకా ఈ కమిటీలో నర్సింహమూర్తి, బొపార, సిహెచ్. మురళీమోహన్, వారప్రసాద్, టి. విజయ బాబూరావు సభ్యులుగా ఎన్నికయ్యారు. పలువురు కవులు, రచయితలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి నెల మొదటి ఆదివారం వివిధ సాహిత్యాంశాలపై చర్చలు జరపాలని, సాహిత్య కార్యక్రమాలు చేపట్టాలని సమావేశం తీర్మానించింది.

## తెలుగు భాషా కృషీవలుడు బుడ్డిగ సుబ్బరాయన్‌కు నివాళి



ఆంధ్ర మహిళా సభ లిటరసీ హౌజ్ కార్యదర్శిగా 2006 వరకూ కృషిచేసిన బుడ్డిగ సుబ్బరాయన్ సెప్టెంబర్ 29వ తేదీన మృతిచెందారు. మద్రాసు తెలుగు భాషా సమితిలోని తెలుగు విజ్ఞాన సర్వస్వం విభాగానికి సమన్వయకర్తగా విశేష కృషి చేసిన వీరి సాహిత్య సేవ అభినందనీయమైనది. బాలల విజ్ఞాన సర్వస్వం వంటి పుస్తకాలు రాసిన వీరు బాలల అక్షరాస్యతా విధానాల పట్ల శ్రద్ధ కనబరచేవారు. చిత్ర సహితంగా పుస్తకాలు ఉండేలా ప్రయత్నించేవారు. తను స్వయంగా తీర్చిదిద్దిన సురభి పెద్ద బాలశిక్ష ఒక సమగ్ర విజ్ఞాన సర్వస్వం. తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారంతో సహా పలు గౌరవ పురస్కారాలను సుబ్బరాయన్ అందుకున్నారు.

# భద్రగిరిలో "నేల - నరులు"

**భ**ద్రాచలం లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల ప్రాంగణంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో "నేల - నరులు" అనే అంశంపై అక్టోబర్‌లో నెల నెలా జాబిలి సాహిత్య కార్యక్రమం జరిగింది. దీనికి ఎన్.సిహెచ్. చక్రవర్తి సభాధ్యక్షులుగా మాగంటి సూర్యం ముఖ్య అతిథిగా, ఖమ్మం జిల్లా సాహితీ స్రవంతి ప్రధాన కార్యదర్శి రౌతు రవి గౌరవ అతిథిగా, అభినవ మొల్ల చక్రవర్తుల లక్ష్మీ నర్సమ్మ ప్రత్యేక అతిథిగా, పి.వి.ఆర్.జి. స్వామి విశిష్ట అతిథిగా, మాల్యశ్రీ సమన్వయకర్తగా వ్యవహరించారు. తొలుత సాహితీ స్రవంతి ఉపాధ్యక్షులు స్వాగతం పలుకగా, సాహితీ స్రవంతి కార్యదర్శి తాతోలు దుర్గాచారి వందన సమర్పణ చేశారు.

నేలకు - నరులకు విడదీయరాని సంబంధం వుందని, నేల కోసమే నాడు నేడు పోరాటాలు జరిగాయని, జరుగుతున్నాయని, భూమి సమస్య తీరినప్పుడే ఈ సంఘర్షణకు పరిష్కారం దొరుకుతుందని, కురుక్షేత్ర సంగ్రామం నుంచీ, ముదిగొండ యుద్ధం దాకా ఇందులో పాల్గొన్న వక్తలు, కవులు ప్రస్థావించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కాపూరి పాపయ్య శాస్త్రి, డాక్టర్ కల్లూరి ఆనందరావు, బొమ్మరాతి యల్లయ్య, ఎ. శ్రీహరి కామేశ్వరరావు, జి. గోపాలకృష్ణ, బి.యస్సార్. ఆంజనేయశాస్త్రి, జెడ్. జిగీష, కె. హరిత, డాక్టర్ కాసర్ల రంగారావు, పి. విద్యాసాగర్, వీధుల రాంబాబు, బి.వి. సుబ్రహ్మణ్యశాస్త్రి, పొడిచేటి సీతారామానుజాచార్యులు, కుమారి కె. ప్రశాంతి పాల్గొన్నారు. ఇంకా యుగంధర్, మండలోజు గోపాలకృష్ణ, జి. రామరాజు, జె. నవీన్‌బాబు, ఎం. యాదగిరి, డి. హరిసర్వోత్తమ్, జీవ, తాతోలు ప్రమీల, టి. విజయ నిర్మల, టి. అనూష, టి. నీహారిక ప్రభృతులు చర్చలో పాల్గొన్నారు.

# "రాంషా" జయంతి

**ప్ర**ముఖ కవి, రచయిత, సాహిత్య విమర్శకుడు కీ.శే. రాంషా జయంతి సందర్భంగా భద్రాచలం లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల ప్రాంగణంలో స్థానిక సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో రాంషా జీవితం – సాహిత్యం అనే అంశంపై సదస్సు నిర్వహించబడింది. ఈ సదస్సులో ప్రధాన వక్తగా బి. గోపాలకృష్ణ పాల్గొని 'రాంషా' గొప్ప ప్రగతిశీల రచయితని, చక్కని దార్శనికుడని, గురజాడ అడుగు జాడలో నడిచి వచ్చిన ఏకైక అభ్యుదయ కవి అని, శ్రీశ్రీ, చలం వంటి వారిని అనుసరించిన, తనదైన ప్రత్యేకతను చాటుకున్న సమతా భావుకుడని, 'అనంతం' వంటి అభ్యుదయ కవిత్వమే కాక హేతువాదం వంటి దార్శనిక గ్రంథాలు రచించిన ప్రతిభావంతుడని, అభిసారిక వంటి శాస్త్రీయ విజ్ఞాన పత్రికను నడిపి, సాంఘిక సమస్యలను పరిష్కరించిన సంస్కర్త అని కొనియాడారు. ఇంకా ఈ సదస్సులు – సభాధ్యక్షులు ఎన్.సిహెచ్. చక్రవర్తి, ముఖ్య అతిథి, సాహితీ బంధు మాగంటి సూర్యం, సమన్వయ కర్త మాల్యశ్రీ, సాహితీ స్రవంతి కార్యదర్శి తాతోలు దుర్గాచారి, ఉపాధ్యక్షులు డి.వి. కృష్ణమూర్తి, వీధుల రాంబాబు, డాక్టర్ కాపూరి పాపయ్య శాస్త్రి, ప్రచార కార్యదర్శి జి. రామరాజు, శ్రీమతి కె. హరిత, కె.ఎస్.ఎన్.వి. ప్రసాద్, ఎస్. వెంకటాచారి, అమ్మిన శ్రీనివాసరాజు, బి. దుర్గాప్రసాద్ ప్రభృతులు పాల్గొని ప్రసంగించారు.

# 'పీపల్ మే నీమ్' పుస్తకావిష్కరణ

**బా** రహమతుల్లా తెలుగు కవిత్వ పుస్తకం 'పీపల్ మే నీమ్' బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో అక్టోబర్ 4వ తేదీన ఆవిష్కరణ జరిగింది. నగ్నముని అధ్యక్షత వహించారు. సామాజిక ఉద్యమ నేత కేశవరావు జాదవ్ ఈ కవితా సంపుటిని ఆవిష్కరించారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన కె. శివారెడ్డి మాట్లాడుతు 'బా' కథ రాసి కథకుడిగా సత్తా నిరూపించుకున్న రహమతుల్లా 'కరీమున్ నవ్వు' కవిత రాసి కవిగా తన సమర్థత చాటాడు. కనుక బా రహమతుల్లా మంచి కథకుడే గాక మంచి కవి కూడా అని అన్నారు.

'పీపల్ మే నీమ్' సంపుటి వివిధ పార్శ్వాలతో నిండి వున్నది. వాటిలో 'చార్మినార్'లు బా రహమతుల్లా సామాజిక దృష్టికి దర్పణాలు. 'చాందినీ రాత్రులు' అతని ప్రేమలు. 'సముద్రాలు' అతను గౌరవించే వ్యక్తుల చిత్రణలు. మొత్తంగా మనుషుల నడుమ సామరస్యాన్ని, ప్రేమను కాంక్షించే కవితల సంపుటి ఇది అని కవి దర్భశయనం శ్రీనివాసాచార్య అన్నారు.



**'పీపల్ మే నీమ్' పుస్తకావిష్కరణ సభలో కె. శివారెడ్డి, బా రహమతుల్లా, కేశవరావ్ జాదవ్, నగ్నముని, దర్భశయనం శ్రీనివాసాచార్య, స్కైబాబా**

ముస్లింవాద సాహిత్యంలో బా రహమతుల్లాది విలక్షణమైన గొంతు. రావిచెట్టులో వేపచెట్టులా కలిసిపోయిన ఈ దేశ హిందూ ముస్లింల సంస్కృతిని తన కవిత్వం ద్వారా అతను చాటి చెప్తున్నాడు అని కవి స్కైబాబా విశ్లేషించారు.

# కర్నాటి లక్ష్మీనర్సయ్యకు తంగిరాల అవార్డు



తంగిరాల స్మారకోపన్యాసం చేస్తున్న కర్నాటి లక్ష్మీనరసయ్య. సోమేపల్లి వెంకటసుబ్బయ్య, తంగిరాల చక్రవర్తి, సర్వజిత్

తెలుగు నాటకరంగంలో అవిరళ కృషి చేసిన విశిష్ట వ్యక్తులకు ప్రతి ఏటా ఇచ్చే "తంగిరాల రంగస్థల 8వ పురస్కారం ప్రజానటుడు నాటి ప్రజానాట్యమండలి సభ్యులు జానపదకళాకారుడు ఆంధ్ర ఆర్ట్ ఆకాడమీ వ్యవస్థాపకుడు కర్నాటి లక్ష్మీనర్సయ్యకు సెప్టెంబర్ 30న సాయంత్రం 6 గంటలకు విజయవాడలోని చంద్ర రాజేశ్వరరావు గ్రంథాలయంలో ఆవార్డ్ ప్రధానం చేశారు. ఈ సభలో గుంటూరు ఆర్.డి.వో ప్రముఖ కవి సోకుపల్లి వెంకటసుబ్బయ్య, సీనియర్ పాత్రికేయుడు సర్వజిత్ ముఖ్య అతిధులగా పాల్గొన్నారు. ఈ సభను తంగిరాల ట్రస్ట్, రమ్యభారతి పత్రికలు నిర్వహించాయి. తంగిరాల చక్రవర్తి, చలపాక ప్రకాష్, చింతా వెంకటేశ్వర్లు, ఎమ్.ఎస్. రాజు, చిత్తలూరి సత్యనారాయణ, అశోక్‌కుమార్, కోకావిమల కుమారి, చింతాలక్ష్మీ సుజాత, అద్దూరి రాములు, అరసవిల్లి కృష్ణ, రమణీజీ, మూర్తి రాజు మొదలగువారు పాల్గొన్నారు. 'ఉగ్రవాద' వ్యతిరేక కవిగాయక సమ్మేళనం చింతా లక్ష్మీసుజాత ఆధ్వర్యంలో జరిగింది.

# మలక్‌పేట సాహితీ స్రవంతి సభ

అక్టోబర్ 2వ తేదీ మధ్యాహ్నం హైదరాబాద్ ల్యాబ్‌క్వార్టర్స్ కమ్యూనిటీ ఆడిటోరియంలో నగర సాహితి స్రవంతి కన్వీనర్ ఎ. సత్యభాస్కర్ అధ్యక్షతన సభ జరిగింది. రిటైర్డ్ విద్యాశాఖ డైరక్టర్ డా॥ వి.వి.యల్. నరసింహారావు ముఖ్య అతిథిగా విచ్చేసారు. యువ కళాకారులకు నిరంతర అధ్యయనం పాత సాహిత్య రంగంతో కొంత పరిచయం ఉండాలన్నారు. 'నేనూ-నా పుస్తకం' అనే అంశంపై "స్ఫూర్తి" (కవితాసంకలనం) శ్రీ యాదగిరిరావు, పిచ్చుకగూడ కవితాసంకలనంపై (పొత్తూరి సుబ్బారావు) మొగలిరేకులు (పంకజా మల్లిక్), ప్రతీక్ష (ఎం.సత్యభాస్కర్) వలసగానం (తంబెళ్ళ కనకాచారి), కలాలు గళాలు (తంగిరాల చక్రవర్తి), భూస్వరాలుపాటల కవితాసంకలనం గురించి జి. అప్పారావు, తొలకరి (బొ.పా.ర), రవ్వలు (విప్లవదత్ శుక్లా) మాట్లాడారు. ఈ సభలో తంగిరాల చక్రవర్తి , గజవెల్లి దశరథ రామయ్య సమన్వయ బాధ్యతలు నిర్వహించారు. డిఫెన్స్ ఎంప్లాయిస్ పెద్ద ఎత్తున హాజరైన ఈ సభలో లాబ్స్‌కు సంబంధించిన కొత్త కళాకారులు పాల్గొనడం ఒక విశేషం – ఆళహవి హన్మంతరావు, యాదగిరి, త్రిశూల్, సాయికుమార్, మాధవి, విజయలక్ష్మీ, శ్రావ్యమైన సంగీతపరమైన పాటలతో ఆహుతుల్ని అలరించారు. లాబ్స్‌క్వార్టర్స్ వీరబాబు సహకరించారు.




విజయనగరం మయూర హోటల్‌లో సెప్టెంబర్ 16వ తేదీన నాగసూరి వేణుగోపాల్ రచించిన "ప్రకృతి పర్యావరణం" పుస్తక ఆవిష్కరణ జరిగింది. ఎస్.కె. పబ్లికేషన్స్ డైరెక్టర్ ఎస్.కె. బాబు, అధ్యక్షులు పి.ఎల్.పి. రాజు, ఆవిష్కర్త టి. శివాజీరావు, కాశీపట్నం రామారావు, డాక్టర్ రామసూరి, రచయిత నాగసూరి వేణుగోపాల్ చిత్రంలో వున్నారు.



కరీంనగర్ జిల్లా కోరుట్లలో భారత సాహిత్య సమితి ఆధ్వర్యంలో జరిగిన సభలో ప్రముఖ కవి డా॥ తిరుమల శ్రీనివాసాచార్యకు దివంగత కవి డా॥ అందె వేంకటరాజు సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న తెలంగాణా యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.ఎల్.ఎన్. స్వామి. చిత్రంలో డింగరి రామాచార్య, ఎం.ఎ. గఫార్, శ్రీ గాదె శంకర కవి, తాళ్ళపల్లి మురళీధరగౌడ్, అందె రాజారావు తదితరులు

# ఆగ్రాలో తెలుగు కవులు




ఆగ్రాలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆంధ్రప్రదేశ్ నుంచి 9 మంది కవులు, కవయిత్రులు కలిసి పాల్గొన్నారు. సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో ఆగ్రాలో ఇంటర్నేషనల్ అసోసియేషన్ అంతర్జాతీయ రచయితల క్లబ్ ఇండియా నిర్వహించిన సదస్సులో విభిన్న సంస్కృతులు, విభిన్న వేషధారణలు, ఆత్మీయ పలకరింపులతో ఎంతో ఆనందంగా మొదలైంది.

మొదటి రోజు సదస్సులో పెరుగు రామకృష్ణ నానీలు 'ముంజెలు" వాటిని స్వాతి శ్రీపాద ఆంగ్లంలోకి అనువదించారు. వై. శ్రీరాములు గారిది Elixir on Earth, Shades of Moon Light, Whiether And Other, రామా చంద్రమౌళిగారిది వెలుగుపూలు, మోపూరి పెంచల నరసింహంగారి పుస్తకం, ఇది త్రిభాషా సంకలనం, దీనికి ఆంగ్ల అనువాదం శైలజా మిత్రా చేశారు. జ్వలిత పుస్తకాలు పరివ్యాప్తి కాలాన్ని జయిస్తూ నేను అనే పుస్తకాలు ఆవిష్కరించబడటం విశేషం.

అంతర్జాతీయ సదస్సు అయినప్పటికీ చాలామందికవులు వారి వారి మాతృభాషలోనే కవితలు వినిపించారు. రెండవ రోజు సదస్సులో ఉదయం పెరుగు రామకృష్ణ, శైలజా మిత్ర, వై. శ్రీరాములు పత్ర సమర్పణ చేశారు. మధ్యాహ్నం సదస్సులో జరిగిన కవి సమ్మేళనంలో కొండేపూడి నిర్మల, రామకృష్ణ సృజన, శైలజా మిత్ర, స్వాతి శ్రీపాద కవితలు వినిపించారు. రేణుక అయోల, తెలుగు కవితని హిందీలోకి అనువాదం చేసుకొని చదివి వినిపించారు. జ్వలిత, కె.బి. లక్ష్మి తమ కవితలు చదివి ప్రేక్షకుల చేత అభినందనలు పొందారు. సాహిత్యంలోకి యువతలు ఆసక్తి కనపరచడం లేదు అనుకొని బాధపడుతున్న తరుణంలో ఛత్తీస్‌ఘడ్ నుండి వచ్చిన ఇద్దరు యువ కవయిత్రులు కవితలు చదివి వినిపించడమే కాకుండా రెండే రెండు పాత్రలతో కవితని నాటకీకరణ చేసి అందరిని అలరించారు. ఇలాంటివి మనం కూడా ప్రదర్శించాలనే ఆలోచన కవయిత్రులలో చోటు చేసుకుంది. కవి సంధ్యలో గాన మాధుర్యంతో పాటుగా కవితలు చదవడం విశేషం.

జమ్మూ నుంచి వచ్చిన జె.ఎస్. పథానియా... విపరీతంగా అందరినీ ఫోటోలు తీసి, సరదాగా పలుకరిస్తూ హడావుడి చేశారు. ఆఖరికి ఫోటో అంటే భయపడేలా చేస్తే, అది తలచుకొని అందరూ సరదాగా నవ్వుకొన్నాము.

కొత్తవారు ఈ సదస్సులోకి వచ్చారనే భావన సాహితీ మిత్రులలో కనిపించింది. మొదట్లో అందరూ కొత్తవారే. కొత్తే పాతవుతుంది.

ఇవన్నీ పక్కన పెడితే తెలతెలవారుతుండగా "తాజ్‌మహల్" అందాలు రచయితల గుండెలను మూగబోయేలా చేశాయి.

చలువరాతి ప్రేమ మహల్ అందరి హృదయాలలో నిశ్శబ్దంగా ఒదిగిపోయింది.

ఇలాంటి సదస్సులో మరింత మంది రచయితలు ఆంధ్రా నుంచి పాల్గొనాలని ఆశిస్తున్నాను.

# మణుగూరులో కవి సమ్మేళనం



అక్టోబర్ 2 గాంధీ జయంతిని పురస్కరించుకుని ఖమ్మం జిల్లాలోని మణుగూరు సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. మణుగూరులోని స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో జరిగిన ఈ కవిసమ్మేళనంలో అహింస, మతోన్మాదం, మానవత్వం, త్యాగం, నిరాడంబరత వంటి పలు అంశాలతో కూడిన తమ కవితల్ని పలువురు కవులు వినిపించారు. మణుగూరు సాహితీ స్రవంతి అధ్యక్షుడు బొమ్మరాత యెల్లయ్య, భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు మాల్యశ్రీ, యం.డి. యూసఫ్, ఎస్.డి. నాసర్ పాషా, అద్దంకి హన్మంతరావు, జక్కా శ్రీదేవి, యం.డి. ఇద్రీస్ అహ్మద్, కురి రాజేశ్వరరావు, బి.వెంకటేశ్వర్లు, రాచకొండ శ్రీనివాస్, కిలారు బాబు, ఆవుల కనకయ్య, శ్రీమతి కె. రేణుకాదేవి తదితరులు కవి సమ్మేళనంలో పాల్గొన్నారు.

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**

# సి.పి.బ్రౌన్ (1798-1884)

**నవంబరు 10 జయంతి**



SAHITYA PRASTHANAM    Postal Regd.No.H/SD/415/07-09    RNI.NO.APTEL/2004/18396

సర్వ శిక్ష అభియాన్
అందరూ చదవాలి-అందరూ ఎదగాలి

పాఠశాల విద్యాశాఖ,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

# పథకం ప్రారంభం నుండి 2006-2007 వరకు సాధించిన ప్రగతి

## సర్వశిక్షా అభియాన్ కార్యక్రమంలో 2006-07లో సాధించిన ప్రగతి

| క్ర. సంఖ్య | వివరములు | మంజూరు చేయబడినవి | పూర్తి చేయబడినవి |
|---|---|---|---|
| 1. | నూతన పాఠశాలల ఏర్పాటు | 304 | 304 |
| 2. | ప్రాథమిక పాఠశాలలను, ప్రాథమికోన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయడం | 156 | 156 |
| 3. | నూతన పాఠశాలలో నియమించబడిన ఉపాధ్యాయులు | 1624 | 1624 |
| 4. | పాఠశాలలు లేని ఆవాస ప్రాంతాలలో EGS కేంద్రాల ఏర్పాటు | 3292 | 3145 |
| 5. | ప్రత్యామ్నాయ పాఠశాలల ద్వారా బడి బయటి పిల్లల నమోదు (ఆర్.బి.సి. మరియు ఎన్.ఆర్.బి.సి.ల ద్వారా) | 359829 | 290366 |
| 6. | స్కూల్ కాంప్లెక్స్‌ల ఏర్పాటు | 6970 | 6970 |
| 7. | బోధనా అభ్యసన గ్రాంటు విడుదల చేసిన పాఠశాలలు | 3792 | 3792 |
| 8. | ఓ.సి. బాలికలకు ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ | 416174 | 416174 |
| 9. | ఉపాధ్యాయులకు శిక్షణ | 286307 | 244938 |
| 10. | సహాయము పొందిన ప్రత్యేక అవసరాలు గల పిల్లలు | 138467 | 47166 |
| 11. | మండల వనరులు కేంద్రాల ఏర్పాటు | 1128 | 1128 |

## పథకం ప్రారంభం నుండి 2006-07 వరకు సర్వశిక్షా అభియాన్‌లో సాధించిన ప్రగతి

### 1. సర్వశిక్షా అభియాన్ ద్వారా అనుమతించిన పాఠశాలలు

| ప్రాథమిక పాఠశాలలు | | ప్రాథమికోన్నత పాఠశాలలు | | మొత్తం పాఠశాలలు | |
|---|---|---|---|---|---|
| మంజూరు చేయబడినవి | పూర్తి చేయబడినవి | మంజూరు చేయబడినవి | పూర్తి చేయబడినవి | మంజూరు చేయబడినవి | పూర్తి చేయబడినవి |
| 2989 | 2989 | 5432 | 5432 | 8421 | 8421 |

### 2. సర్వశిక్షా అభియాన్ ద్వారా ఉపాధ్యాయుల పోస్టుల మంజూరు

| రెగ్యులర్ ఉపాధ్యాయులు | | | | అదనపు ఉపాధ్యాయులు | | | | మొత్తం ఉపాధ్యాయులు | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ప్రాథమిక | | ప్రాథమికోన్నత | | ప్రాథమిక | | ప్రాథమికోన్నత | | ప్రాథమిక | | ప్రాథమికోన్నత | |
| మంజూరు | నింపినవి | మంజూరు | నింపినవి | మంజూరు | నింపినవి | మంజూరు | నింపినవి | మంజూరు | నింపినవి | మంజూరు | నింపినవి |
| 5175 | 5175 | 13202 | 13202 | 5882 | 5882 | 12041 | 12041 | 11057 | 11057 | 25243 | 25243 |

## పథకం ప్రారంభం నుండి 2006-07 వరకు సాధించిన ప్రగతి

| క్ర. సంఖ్య | వివరములు | మంజూరు చేయబడినవి | పూర్తి చేయబడినవి |
|---|---|---|---|
| 1. | నూతన పాఠశాలల ఏర్పాటు | 2989 | 2989 |
| 2. | ప్రాథమిక పాఠశాలలను, ప్రాథమికోన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయడం | 5432 | 5432 |
| 3. | నూతన పాఠశాలలో నియమించబడిన ఉపాధ్యాయులు | 25365 | 25365 |
| 4. | పాఠశాలలు లేని ఆవాస ప్రాంతాలలో EGS కేంద్రాల ఏర్పాటు | 33770 | 29891 |
| 5. | ప్రత్యామ్నాయ పాఠశాలల ద్వారా బడి బయటి పిల్లల నమోదు (ఆర్.బి.సి. మరియు ఎన్.ఆర్.బి.సి.ల ద్వారా) | 1099574 | 612688 |
| 6. | మండల వనరులు కేంద్రాల ఏర్పాటు | 1128 | 1128 |
| 7. | స్కూల్ కాంప్లెక్స్‌ల ఏర్పాటు | 6970 | 6970 |
| 8. | బోధనా అభ్యసన గ్రాంటు విడుదల చేసిన పాఠశాలలు | -- | 13113 |
| 9. | ఓ.సి. బాలికలకు ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ | -- | 979147 |
| 10. | ఉపాధ్యాయులకు శిక్షణ | 703889 | 464914 |
| 11. | సహాయము పొందిన ప్రత్యేక అవసరాలు గల పిల్లలు | -- | 146811 |

## మౌలిక సదుపాయాల కల్పన పథకం ప్రారంభం నుండి 2006-07 వరకు సాధించిన ప్రగతి

| క్ర. సంఖ్య | వివరములు | మంజూరు చేయబడినవి | పూర్తి చేయబడినవి |
|---|---|---|---|
| 1. | నూతన పాఠశాల భవనాలు | 1401 | 1136 |
| 2. | నూతన ప్రాథమికోన్నత పాఠశాల భవనాలు | 1225 | 1085 |
| 3. | భవనాలు లేని ప్రాథమిక పాఠశాలలకు భవనాలు | 6001 | 4408 |
| 4. | భవనాలు లేని ప్రాథమికోన్నత పాఠశాలలకు భవనాలు | 650 | 494 |
| 5. | అదనపు తరగతి గదులు | 27154 | 17483 |
| 6. | మరుగుదొడ్లు | 5274 | 5274 |
| 7. | త్రాగునీటి వసతి సౌకర్యాలు | 6986 | 6986 |
| 8. | మండల రిసోర్సు కేంద్ర భవనం | 186 | 148 |
| 9. | స్కూలు కాంప్లెక్స్ భవనం | 1005 | 536 |
| 10. | ఇతరములు (విద్యుత్ సౌకర్యం, శిథిలావస్థలో ఉన్న భవనాలు) | 1022 | 1022 |
| | **మొత్తం** | **60104** | **47772** |